fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 37 | విజయవాడ, బుధవారం 7 ఫిబ్రవరి 2018 | 12 + 12 + 2 పేజీలు వెల : 4.00



ఫలితాల అనంతరం విజయోత్సాహంలో సిఐటియు స్టీల్‌ప్లాంట్ నాయకులు రామారావు, కార్యకర్తలు

'ఉక్కు'లో సిఐటియు విజయభేరి

198 ఓట్ల మెజార్టీతో గెలుపు

9

అన్యాయమెక్కడ!

టిడిపికి ప్రధాని ఎదురుప్రశ్న

మోడీతో సుజనా చౌదరి భేటీ

మంత్రుల హామీతో ఆందోళన విరమించిన టిడిపి ఎంపీలు

లోటు భర్తీకి సూత్రమేమీ లేదు : జైట్లీ



ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

"ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడ అన్యాయం చేశాం. అడిగినవన్నీ ఇస్తున్నాం కదా. అందుకనే అదనపు సమాచారాన్ని అడిగాం కదా. దేనికీ తొందర పడొద్దు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో నన్ను ఫోన్‌లో మాట్లాడమంటారా? ఏపికి ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వం. న్యాయం చేస్తాం" అని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. 'ఏపి ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని, సమస్యల పరిష్కారానికి చర్చల ద్వారా ఒక మార్గం కనుగొంటామని ప్రధాని, సుజనా చౌదరితో చెప్పినట్లు సమాచారం. ఏపిని ప్రత్యేక దష్టితో చూస్తామని, అన్యాయం చేయబోమని మోడీ చెప్పినట్లుగా సమాచారం.

మంగళవారం నాడిక్కడ పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో కేంద్ర మంత్రి, టిడిపి ఎంపి సుజనా చౌదరి భేటీ అయ్యారు. 32 నిమిషాల పాటు మోడీతో సమావేశమైన సుజనా, విభజన సమస్యలు, ఏపీ పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరును వివరించారు. మోడీతో భేటీ తర్వాత చంద్రబాబుకు ఫోన్ చేసి సుజనా చౌదరి తమ పమావేశం వివరాలు తెలియజేశారు. "ప్రధానిగా మీరు ప్రమాణస్వీకారం చేసిన సమయం నుంచి నేటి వరకు మిత్రపక్షంగా మేము సహకరిస్తున్నాం. అన్ని విషయాల్లోనూ మీ వెన్నంటే ఉన్నాం. అయితే దీనికి భిన్నంగా కేంద్రం ఆంధ్రప్రదేశ్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఏడాది పూర్తయినా అమలుకు నోచుకోలేదు. మరోవైపు చాలా రాష్ట్రాలకు జీఎస్టీ తర్వాత కూడా హోదా కొనసాగిస్తున్నారు. కేంద్రానికి అన్ని విషయాల్లో సహకరిస్తున్నా ఏపి విషయంలో మాత్రం వివక్ష కొనసాగుతోంది. రాజధాని శంకుస్థాపన సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నీ పక్కకు పోయాయి. ఇటీవల మా ముఖ్యమంత్రి మిమ్మల్ని కలిసి అనేక విషయాలు ప్రస్తావించారు. వాటిలో ఒక్క విషయంలోనూ పురోగతి లేదు" అని సుజనా చౌదరి ప్రధానికి స్పష్టం చేశారు. దీనికి మోడీ స్పందిస్తూ... అన్ని విషయాలు పరిష్కరిస్తామని, ఆందోళన విరమించాలని కోరినట్లు సమాచారం. అయితే ఆ అంశం తన చేతిలో లేదని సుజనా ప్రధానికి స్పష్టం చేశారు. దీనిపై సీఎం చంద్రబాబుతో తానే స్వయంగా మాట్లాడతానని మోడీ చెప్పినట్లు సమాచారం.

టిడిపి ఎంపీల ఆందోళన విరమణ

కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, పియుష్ గోయల్ ఇచ్చిన హామీలతో టిడిపి ఎంపీలు ఆందోళన విరమించారు. రెవెన్యూ లోటు భర్తీకి స్పష్టమైన సూత్రమేమీ లేదని, ఏపికి ఇవ్వాల్సిన నిధులను వివిధ మార్గాల్లో సమకూరుస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిగా అన్యాయం జరిగిందని రాష్ట్ర ఎంపిలు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో అరుణ్ జైట్లీ పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ మేరకు ప్రకటన చేస్తూ, ఏపి ఆర్థిక శాఖ కార్యదర్శిని త్వరలోనే ఢిల్లీకి పిలిపిస్తున్నామని, ఆ భేటీలో రాష్ట్రానికి రావాల్సిన ప్యాకేజీ విధివిధానాలు రూపొందిస్తామని తెలిపారు. విదేశీ సంస్థల నుంచి ఏపి ప్రభుత్వం రుణం తీసుకుంటే కేంద్రం 90 శాతం చెల్లిస్తుందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. "ఏపి నిధులను నాబార్డ్ ద్వారా ఇవ్వమని సిఎం కోరుతున్నారు. ఈఏపి నిధులను నాబార్డు ద్వారా ఇవ్వడం వల్ల రాష్ట్రానికి అప్పు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. ద్రవ్యలోటు వ్యత్యాసం ఏర్పడుతుంది. ఈ సమస్య పరిష్కారంపై మల్లగుల్లాలు పడుతున్నాం. ఏపి ఆర్థిక శాఖ కార్యదర్శితో చర్చలు జరపాలని.. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి సూచించా. రెవెన్యూ లోటు భర్తీపై స్పష్టమైన సూత్రం లేదు. కొత్త ఫార్ములాను రూపొందించడంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తాం. లోటు భర్తీ కింద ఇప్పటికే రూ.3,900 కోట్లు ఇచ్చాం. ఏపి విభజన చట్టం హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం" అంటూ జైట్లీ ప్రకటించారు. వైజాగ్ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుపై సంప్రదింపులు జరుగుతున్నాయని రైల్వే మంత్రి పియుష్ గోయల్ వెల్లడించారు. రైల్వే జోన్‌పై పొరుగు రాష్ట్రాలు అభ్యంతరం మిగతా 9లో



తిరుపతిలోని నాలుగుకాళ్ల మండపం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

రేపు రాష్ట్ర బంద్

జయప్రదానికి వామపక్షాల పిలుపు

కాంగ్రెస్, వైసిపి సంపూర్ణ మద్దతు

2



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాలు గురువారం నాడు బంద్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనాలు లోపలి పేజీల్లో



సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా నేటి నుంచి భీమవరం ఫెస్ట్

7


అమెరికా మార్కెట్లు ఢమాల్

భారత సూచీలపై తీవ్ర ప్రభావం



సెన్సెక్స్ 561 పాయింట్లు పతనం

న్యూఢిల్లీ : వివిధ పరిణామాల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. మదుపర్ల అమ్మకాల ఒత్తిడితో సోమవారం ఇక్కడి సూచీలు ఆరు సంవత్సరాల కనిష్టానికి దిగజారాయి. ఈ ప్రభావం ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లతో పాటు భారత సూచీలపై కూడా పడింది. అగ్రరాజ్యంలో ద్రవ్యోల్బణం ఎగిసిపడనుందన్న అంచనాలు అక్కడి మార్కెట్లను కుదేలు చేశాయి. అంచనాలకు మించిన వేగంతో ఫెడ్ వడ్డీ రేట్లను పెంచడంతో అమెరికాలో బాండ్ల లాభదాయకత పెరగనుంది. దీంతో షేర్లపై పెట్టే పెట్టుబడులను ఇన్వెస్టర్లు బాండ్లకు తరలించనున్నారనే విశ్లేషణలు మార్కెట్లలో మరింత ప్రతికూలతను పెంచాయి. ఈ పరిణామాల మధ్య ఎస్ అండ్ పి 500, డో ఇండస్ట్రియల్స్ సూచీలు రెండూ కూడా 4.0 శాతానికి పైగా పతనమయ్యాయి. చరిత్రలోనే తొలిసారి డో ఒక దశలో 1600 పాయింట్లు పతనమైంది. తుదకు 1175.21 పాయింట్ల నష్టంతో 25వేలకు దిగజారింది. 2011 ఆగస్టు తర్వాత ఇదే అతిపెద్ద నష్టం. ఎస్అండ్‌పి 500 చివరికి 2648.94 వద్ద ముగిసింది. నాస్‌డాక్ కాంపోజిట్ కూడా 3.8 శాతం నష్టపోయింది. ప్రపంచ మార్కెట్లలో ప్రతికూలత సెన్సెక్స్‌ను 561 పాయింట్లు పతనమయ్యేలా చేసింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఈ సూచీ 1200 పాయింట్ల పైగా విలువ కోల్పోయింది. వరుసగా మూడు రోజుల పాటు నష్టపోయిన భారత మార్కెట్ల వల్ల మదుపర్ల దాదాపుగా రూ.10 లక్షల కోట్ల విలువను కోల్పోయారు. మంగళవారం కూడా అమెరికా మార్కెట్లు నష్టాల్లోనే ప్రారంభమయ్యాయి.



న్యాయం జరిగే వరకూ పోరాటం

టిడిపి ముఖ్యనేతలతో చంద్రబాబు

భూ కేటాయింపులపైనా చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరిగే వరకూ పార్లమెంటులో పోరాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్లమెంటు సభ్యులకు సూచించారు. హామీలతో సరిపెట్టొద్దని ఆదేశించారు. పార్లమెంటులో ఆందోళన నేపథ్యంలో మంగళవారం ఉదయం టిడిపి కీలక నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ప్రధాని కార్యాలయం నుండి ఫోన్ వచ్చిన నేపథ్యంలో అక్కడ తీసుకోవాల్సిన నిర్ణయాలపై అత్యవసరంగా చర్చించారు. సమావేశానికి ఎవరిని పంపించాలనే అంశంపై చర్చించి, సుజనా చౌదరిని పంపించాలని నిర్ణయించారు. అప్పటి వరకూ తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలతో ఉన్న నాయకత్వం మొత్తం ప్రధానితో సమావేశం అనంతరం చల్లబడింది. మరోవైపు అరుణ్‌జైట్లీ, పియూష్ గోయల్ కూడా దీనిపై స్పందించడంతో పార్లమెంటు సభ్యులు కొంత శాంతించారు. సాయంత్రానికి ఆందోళనను విరమించారు. అయితే ఉండవల్లిలో జరిగిన సమావేశంలో మాత్రం కేంద్రం నుండి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ ఊరుకునేది లేదని, ఇదే విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిసింది. లేకపోతే క్షేత్రస్థాయిలో నష్టపోతామని, పార్టీపరంగా అది అంత మంచి నిర్ణయం కాదన్నట్లు సమాచారం. మరోవైపు మంత్రి యనమల తదితరులు కూడా దీనిపై కొంత జాగ్రత్తగానే వ్యవహరించాలని సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా మూడు రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనకు మిగతా 9లో

మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం



మాల్దీవులు అధ్యక్షులు అబ్దుల్లా యమీన్



మాల్దీవులు సుప్రీంకోర్టు వద్ద మోహరించిన జాతీయ భద్రత బలగాలు

సుప్రీం ఆదేశాలు బేఖాతరు

15 రోజుల ఎమర్జెన్సీ

మాజీ అధ్యక్షుడితో సహా న్యాయమూర్తులు, ఎంపిల అరెస్ట్

భారత్ జోక్యం కోరిన నషీద్

మాలే/కొలంబో/బీజింగ్ : భారత్‌కు చేరువలో హిందూమహా సముద్ర ప్రాంతంలో వున్న మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం క్రమంగా ముదురుతోంది. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ 15 రోజుల ఎమర్జెన్సీ ప్రకటించిన తరువాత ప్రత్యేక పోలీసు బృందం మంగళవారం వేకువ జామున మాజీ అధ్యక్షుడు మౌమూన్ అబ్దుల్ గయూమ్‌ను అరెస్ట్ చేసినట్లు స్థానిక మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. రాజధాని మాలేలో తన ఇంటిలో వున్న గయూమ్, ఆయన అల్లుడిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర పన్నినట్లు వీరిపై అభియోగాలు నమోదు చేశారు. సోమవారం అర్ధరాత్రి నుండి 15 రోజుల పాటు ఎమర్జెన్సీ విధిస్తున్నట్లు యమీన్ మిగతా 8లో



గందరగోళంలో నీట్

నోటిఫికేషన్ విడుదలలో జాప్యం

విద్యార్థుల్లో ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్‌ను వివాదాలు వీడటం లేదు. ఎంబిబిఎస్, బిడిఎస్ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో ఒకే తరహా పరీక్ష విధానం ఉండాలని సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనతో ఏర్పాటైన మిగతా 9లో

శ్రీనగర్ ఆసుపత్రిపై ఉగ్ర కాల్పులు

ఇద్దరు పోలీసులు మృతి

తప్పించుకుపోయిన ఉగ్రవాది

శ్రీనగర్ : శ్రీనగర్‌లోని శ్రీ మహారాజా హరిసింగ్ ఆసుపత్రిపై మంగళవారం ఉగ్రవాదులు కాల్పులు జరిపి పోలీసు కస్టడీలో ఉన్న పాక్ ఉగ్రవాది నవీద్‌జట్‌ను తప్పించి తీసుకుపోయారు. ఖైదీలకు సాధారణంగా నిర్వహించే వైద్య పరీక్షల నిమిత్తం అతనిని శ్రీనగర్‌లోని ఆసుపత్రికి తీసుకు వచ్చారు. అదే సమయంలో నవీద్‌కు సన్నిహితుడైన మరో ఉగ్రవాది కాల్పులు జరిపి, అతనిని తప్పించి తీసుకుపోయాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసులు మృతి చెందారని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ కానిస్టేబుళ్ళు అతనిని ఆసుపత్రికి తీసుకురాగానే అతనికి సన్నిహితులుగా ఉన్న కొంతమంది కాల్పులు జరిపారని శ్రీనగర్ సీనియర్‌పోలీసు సూపరింటెండెంట్ ఇంతియాజ్ ఇస్మాయిల్ విలేకరులకు తెలిపారు. ఉగ్రవాది నవీద్ జట్‌ను పోలీసు బృందం ఆసుపత్రికి తీసుకు వచ్చే సమయానికే అక్కడ పొంచి ఉన్న అతని సన్నిహితులు సహాయపడ్డారా అనే విషయాన్ని దర్యాప్తు చేయాల్సి ఉందని ఆయన అన్నారు. మరో ఐదుగురు ఖైదీలతో కలిపి నవీద్‌జట్‌ను ఆసుపత్రికి తీసుకువెళ్ళినట్లు చెప్పారు.

ఆసుపత్రిని పోలీసులు చుట్టుముట్టారు. అయితే ఆసుపత్రిలో నవీద్ జట్ ఉన్నాడా? తప్పించుకు పారిపోయాడానే విషయం స్పష్టం కాలేదు. ఆసుపత్రి లోపల అత్యవసర సేవలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రిలో ఇతర రోగులకు ఇబ్బంది కలగకుండా నవీద్‌జట్‌ను పట్టుపకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. నవీద్ 2014లో అరెస్టయ్యాడు. కాశ్మీర్‌లోని పలు ఉగ్రవాద దాడులతో ఆయనకు మిగతా 9లో

నేడు సిఎం దుబాయ్‌కి..

పలు వాణిజ్య సంస్థలతో సమావేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెట్టుబడుల రాబట్టే ప్రక్రియలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం దుబాయ్ వెళ్లనున్నారు. ఆయన వెంట ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, మౌలిక వసతులశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, ఎపిఈబిడి సిఈఓ జాస్తి కృష్ణకిషోర్ తదితరులు వెళ్లనున్నారు. సిఎం గురువారం అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం అవుతారు. దుబాయ్ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జనరల్ డాక్టర్ మహ్మద్ ఆల్ జరూనీతో సిఎం భేటీ అవుతారు. సాయంత్రం 5.30 గంటల నుండి భాగస్వామ్య సదస్సు-2018కి సంబంధించి రోడ్‌షోలో పాల్గొంటారు.



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై పార్టీ నాయకులతో చర్చిస్తున్న చంద్రబాబునాయుడు

డ్రెయిన్లలో ప్లాస్టిక్ వస్తువులు వేయకుండా నియంత్రించండి : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నగరాలు, పట్టణాలలో కాలువలు, డ్రెయిన్లలో ప్లాస్టిక్ వస్తువులు వేయకుండా నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం అమృత్ (అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్, అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్) పథకానికి సంబంధించి 8వ రాష్ట్రస్థాయి హైపవర్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వస్తువులను వేయడం వల్ల జల, వాయు కాలుష్యం పెరుగుతోందన్నారు. రోడ్ల పక్కన చెత్తను, వ్యర్థాలను వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. కేబుల్ వైర్లను వేసేందుకు రోడ్లను ఇష్టానుసారం తవ్వకుండా గొట్టాల ద్వారా వేసేందుకు పిపిపి విధానంలో ప్రణాళికలను సిద్ధం చేయాలని మున్సిపల్ ఉన్నతాధికారులకు తెలిపారు. జాతీయ, ప్రధాన రహదారుల వెంబడి తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రాంతాల వారీగా పారిశుధ్య నిర్వహణను సమీక్షించి, సిబ్బందికి తగిన ప్రోత్సాహకాల్ని అందించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలనన్, హైపవర్ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ కె కన్నబాబు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, తాడేపల్లిగూడెం, నెల్లూరు, విజయనగరం, అనంతపురం, కడప, కర్నూల్‌లలో వ్యర్థాల నుంచి ఇంధన (వేస్ట్ టు ఎనర్జీ) తయారీ ప్రాజెక్టులపై సచివాలయంలో మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ సమీక్షించారు. గడువులోగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో పర్యావరణ శాఖ ప్రధాన కార్యదర్శి అనంత రాము, స్వఛ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఎండి ఎన్ మురళీధర్ రెడ్డి, డెవలపర్లు పాల్గొన్నారు.



స్థిరంగా అల్పపీడన ద్రోణులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

మాల్దీవుల నుంచి కర్నాటక తీరానికి ఆనుకుని తూర్పు అరేబియా వరకు అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, దాని పరిసరాలపైనా మరో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని రాయలసీమలో బుధవారం అక్కడక్కడా ఒకటి రెండుచోట్ల చిరు జల్లులు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మిగతా ప్రాంతాల్లో నాలుగు రోజులు పాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. మంగళవారం ఉదయం రాష్ట్రంలో ఎండలు, పాక్షిక మేఘావృతం కొనసాగింది.

ప్రజ్ఞ

1. రైతులకు మద్దతుగా హర్యానా ప్రారంభించిన పథకం?
2. ప్రపంచంలోనే అతి చిన్న రాకెట్‌ను ప్రయోగించిన దేశం?
3. గోదాజరి వన్య ప్రాణుల అభయారణ్యాన్ని ఎక్కడ నిర్మించనున్నారు?
4. దేశంలోని ౦ండో అతిపెద్ద డ్యామ్ ఏది?
5. ఇటీవల మృతి చెందిన సుధా కర్మాకర్ ఏ రంగానికి చెందినవారు?

సమాధానాలు 7లో

రేపు రాష్ట్ర బంద్

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించే రాష్ట్ర బంద్‌కు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. ఇప్పటికే వైసిపి, కాంగ్రెస్, పలు ప్రజాసంఘాలు ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.విజయవాడ గవర్నర్‌పేటలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం బంద్ ప్రచార పోస్టర్‌ను సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. సిపిఎం పశ్చిమ కృష్ణా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పోలారి పాల్గొన్నారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. దాసరి భవన్‌లో ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఎపి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు, క్యాపిటల్ రీజియన్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ కౌన్సిల్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.వి.రమణరావు, కె.రాజేంద్ర పాల్గొన్నారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడ బస్‌స్టేషన్ మెయిన్ డిపో ఎదుట ధర్నా చేశారు.

శ్రీకాకుళంలోని క్రాంతి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వామపక్ష నాయకులు మాట్లాడారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.రాజశేఖర్ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్వతీపురం, బొబ్బిలిలో సిపిఎం ఆధ్వర్యాన కరప్రతాల ద్వారా ప్రచారం చేశారు. విశాఖ జిల్లా కార్యాలయంలోనూ, పితాపురం కాలనీలో ఉన్న కార్యాలయంలోనూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలో సన్నాహక సమావేశాలు, పోస్టర్ ఆవిష్కరణలు నిర్వహించాయి. బంద్‌కు విద్యార్థి సంఘాల జెఎసి మద్దతు తెలిపింది. కాకినాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యాసంస్థల బంద్



కర్నూలు మండలం స్టాంటన్‌పురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం కార్యకర్తలు

పోస్టర్‌ను ఆవిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో వివిధ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లాలో పలుచోట్ల ప్రెస్‌మీట్లు, ర్యాలీలు నిర్వహించారు. తిరువూరులో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గుంటూరు జిల్లాలో వామపక్షాల ఆధ్వర్యంలో శంకర్ విలాస్ సెంటర్ నుండి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించారు. మంగళగిరిలో నాన్ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తిరుపతి నాలుగుకాళ్ల మండపం వద్ద వామపక్ష నాయకులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకమిటి సభ్యులు కందారపు మురళి, జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య, నాయకులు చైతన్య పాల్గొన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో పాదయాత్రలు, మోటారు సైకిల్ ర్యాలీలు, కరపత్రాలు పంపిణీ పెద్దఎత్తున సాగింది.

వామపక్షాల బంద్‌కు వైసిపి మద్దతు : అంబటి

వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే రాష్ట్ర బంద్‌కు వైసిపి సంపూర్ణ మద్దతు ఇస్తుందని, వైసిపి నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు చెప్పారు. గుంటూరులోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా అన్యాయం చేస్తోందని, బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేకహోదా కోసం తమ పార్టీ కట్టుబడి ఉందని, అనేక స్థాయిల్లో పోరాటాలు చేశామని చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించకపోవటం వల్లే తమ పార్టీ బంద్‌కు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. టిడిపి ప్రభుత్వం స్వప్రయోజనాల కోసం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోవటం లేదని మండిపడ్డ అంబటి విభజన చట్టంలో పేర్కొన్న అంశాలన్నింటి సాధనకోసం వైసిపి పోరాడుతుందని పేర్కొన్నారు. విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక ప్యాకేజికి నిధుల కేటాయింపు, తదితర కేంద్ర హామీల సాధన కోసం నిరంతరం పోరాడతామన్నారు.

8 నుంచి లక్నోలో విద్యుత్తు పొదుపుపై సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్తు పొదుపు అంశంతో ఉత్తమ విధానాలపై ఈనెల 8 నుంచి రెండు రోజుల పాటు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బిఇఇ) ఆధ్వర్యంలో లక్నోలో సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో విద్యుత్తు రంగంలో ఎపి అనుసరిస్తున్న విధానాలను ప్రదర్శించనున్నట్లు ఇంధన శాఖ అధికారులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోలర్ పంపుసెట్లు, రైతులకు ఇంధన సామర్థ్య మోటర్లు, కోర్టుల్లో భవనాలపై సౌర విద్యుత్తు ఉత్పత్తి, ఎల్ఇడి వీధి దీపాలు తదితర అంశాలను ఈ సదస్సులో అధికారులు వివరించనున్నారు. దేశ వ్యాప్తంగా 2022 నాటికి 132 బిలియన్ యూనిట్లు విద్యుత్తును పొదుపు చేయడంతో రూ.53 వేల కోట్లు ఆదా చేయాలని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ అంశంలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను మిగిలిన రాష్ట్రాలు అమలు చేయడంతో కర్బన ఉద్గారాల వినియోగం తగ్గి వాతావరణ పరిశోధన పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఇంధన శాఖ తీసుకున్న చర్యల కారణంగా 133 మిలియన్ యూనిట్లు పొదుపు సాధ్యమైందన్నారు.

కోటను తవ్వేస్తుంటే ఏం చేస్తున్నారు?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

గుప్త నిధులున్నాయని చెప్పి కర్నూలు జిల్లాలోని చారిత్రమైన చెన్నంపల్లికోటను తవ్వేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని హైకోర్టు ప్రశ్నించింది. కర్నూలు జిల్లాలోని తుగ్గలి మండలంలోని చెన్నంపల్లికోటను తవ్వేస్తున్నారంటూ వైద్యుడు బ్రహ్మారెడ్డి రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి మంగళవారం విచారణ జరిపింది. గుర్తు తెలియని వ్యక్తులు కోటలో తవ్వకాలు జరిపారని గనుల శాఖ లాయర్ అంగీకరించారు. వారిని తొలగించి కలెక్టర్ అనుమతితో గనుల శాఖే తవ్వకాలు జరుపుతోందని కూడా ఒప్పుకున్నారు. దీనిపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ తీవ్ర ఆక్షేపణ తెలిపింది. తవ్వకాల్లో మినరల్స్ ఉన్నాయా, బంగారం ఉందా.. అనేది ఇక్కడ పాయింటే కాదని, ఏ చట్ట ప్రకారం కోటను తవ్వుతున్నారని గట్టిగా అడిగింది. రక్షిత కట్టడాల జాబితాలో కోట లేదని లాయర్ బదులిచ్చారు. దీనిపై కలెక్టర్, పురావస్తుశాఖ, పోలీసు, రెవెన్యూశాఖ అధికారులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని బెంచ్ ఆదేశించింది. విచారణ 3 వారాలకు వాయిదా పడింది.

ఎస్‌వి భక్తిఛానల్ నిధుల దుర్వినియోగం నిజమే

హైకోర్టుకు తెలిపిన సిఇఒ తరపు న్యాయవాది

ప్రజాశక్తి - హైదరాబాద్

తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న ఎస్‌విబిసి (శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్) నిధుల స్వాహా ఆరోపణల కేసులో ఆ ఛానల్ సిఇఒ, పూర్వపు జర్నలిస్టు ఎవి నర్సింహారావు హైకోర్టులో దొరికిపోయారు. పిటిషనర్ ఆరోపణల్లో ఉన్నట్లుగా రూ.4.4 కోట్లు దుర్వినియోగం కాలేదని, రూ.2.02 కోట్లే అదీ ఒక ప్రోగ్రామ్‌కు చెందిన ఖర్చులో మాత్రమే జరిగిందని విజిలెన్స్ నివేదిక చెబుతోందని స్వయంగా సిఇఒ తరపు న్యాయవాది సురేందర్‌రావు చెప్పారు. దాంతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ స్పందిస్తూ.. రూ.2.02 కోట్లంటే తక్కువ మొత్తం అనుకుంటున్నారా అని ఛానల్ సిఇఒను ప్రశ్నించింది. పిటిషనర్ కోర్టుకు రావడం వల్ల ఈ విషయం తమ దష్టికి వచ్చింది. తిరుపతి లాంటి స్వతంత్ర సంస్థలో నిధుల దుర్వినియోగం జరిగితే చిన్న మొత్తమేనని, పిటిషనర్ కక్ష పూరితంగా కేసు వేశారనడం సబబు కాదని బెంచ్ అభిప్రాయపడింది. సిఇఒపై వచ్చిన ఆరోపణలకు వివరణలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఎపి సర్కార్‌తోపాటు టిటిడినీ బెంచ్ ఆదేశించింది. నర్సింహారావు అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసినా ప్రభుత్వంగానీ, టిటిడిగాగానీ పట్టించుకోవడం లేదని, ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ తిరుపతికి చెందిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి వేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఇతర ప్రతివాదులైన దేవదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, టిటిడి ఈవో, ఎస్‌విబిసి ఎండిలతోపాటు వ్యక్తిగత హోదాలో ఛానల్ సిఇఒ నర్సింహారావులకు నోటీసులిచ్చింది. విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుడి మృతిపై విచారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విధి నిర్వహణలో జరిగే విద్యుత్తు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోనున్నట్లు ఎపి ఎస్పీడీసీఎల్ సిఎండి ఎంఎం నాయక్ తెలిపారు. అనంతపురం జిల్లా దాదాలూరు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా కాంట్రాక్టు కార్మికుడు విద్యుత్తు షాక్‌తో ధనుంజయ మృతి చెందిన ఘటనపై ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌కు వివరాలు మంగళవారం అందజేశారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామన్నారు. లైన్ ఇన్స్‌పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లును తక్షణం సస్పెండ్ చేసినట్లు, సబ్ ఇంజనీరును శ్రీనివాసరెడ్డిని బదిలీ చేసినట్లు చెప్పారు. షిఫ్ట్ ఆపరేటర్ పాత్రపై విచారణ కొనసాగు తోందన్నారు. కర్నూలు సిఇ పీరయ్య విచారణ నివేదికను 24 గంటల్లో అందజేస్తారని, ఈ నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. బాధిత కుటుంబానికి సంస్థ నుంచి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేసినట్లు తెలిపారు.

వైద్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులకు 50 శాతం వేతనాలు పెంపు : కామినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య శాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు 50 శాతం మేర వేతనాలను పెంచనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు కాలువ శ్రీనివా సులు, గంటా శ్రీనివాసరావులు, నారాయణ, జవహర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్న 19,325 కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు పెరగనున్నాయని, దీని వల్ల ప్రభుత్వంపై అదనంగా రూ.219.24 కోట్ల భారం పడనుందన్నారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రూ.12 వేల కన్నా తక్కువ జీతం తీసుకున్న వారికి 50 శాతం మేర జీతం పెంచాలని నిర్ణయిం చామన్నారు. పిజి, మెడికల్ పిజి, పిడి డిప్లమో, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చదివే విద్యార్థులకు రెండేళ్లుగా రావాల్సిన ఉపకారవేతనాలతో పాటు ఈ ఏడాది ఉపకార వేతనాలను చెల్లిస్తామన్నారు. సీనియర్ రెసిడెంట్ల వేతనాల పెంపునకు జీవో జారీ చేశామన్నారు.

పనులు చేపట్టని సంస్థలకు నోటీసులు :మంత్రి గంటా

అమరావతిలో కేటాయించిన భూముల్లో పనులు ప్రారంభించని సంస్థలకు త్వరలో నోటీసులివ్వనున్నట్టు మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. సంస్థలకు భూముల కేటాయింపులపై ఆర్థిక మంత్రి యనమల అధ్యక్షతన మంత్రి వర్గ సమావేశం నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో దేశ, అంతర్జాతీయ స్థాయి గల ఎనిమిది విద్యా సంస్థలకు డేస్కాలర్స్, రెసిడెన్సీ ఆధారంగా భూముల్ని కేటాయించామన్నారు. భూములు కేటాయించిన విద్యా సంస్థల్లో చిన్మయ్ మిషన్ స్కూల్, స్కాటిస్ హై ఇంటర్నేషనల్ స్కూల్, రేయాన్ గ్లోబల్ స్కూల్, పొడార్ స్కూల్, గ్లండెల్ అకాడమీ, హెరిటేజ్ ఎక్స్‌పర్మెంటల్ లెర్నింగ్ స్కూల్, సద్భావన, గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఉన్నాయన్నారు. యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకులకు, ట్రాన్స్‌కోకు సంబంధించి సబ్ స్టేషస్టేషన్‌కు భూముల్ని కేటాయించామన్నారు. ఇంత వరకూ భూముల్ని కేటాయించిన సంస్థల్లో ఎన్ని సంస్థలు సేవల్ని ప్రారంభించాయన్న దానిపై సమీక్ష నిర్వహించనున్నామని తెలిపారు.

టెక్నాలజీ అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలు

సిఐఐ రోడ్‌షోలో లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టెక్నాలజీ అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలందిచడమే లక్ష్యమని ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సిఐఐ ఆధ్వర్యంలో న్యూయార్క్‌లో నిర్వహించిన ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ అండ్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తరువాత లక్ష్యాలు పెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. ఇ-ప్రగతి ప్లాట్‌ఫార్మ్ ద్వారా ప్రభుత్వ సమాచారమంతా ఒకే వేదికపైకి తీసుకొచ్చి సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పరిశ్రమలు పెట్టేందుకు అనుమతుల్ని త్వరితగతిన ఇస్తున్నామని, భూముల్ని కేటాయించడంతో పాటు రాయితీలు, సబ్సిడీలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అద్భుతమైన నైపుణ్యం ఉన్న యువత ఉన్నారని, ఎపిలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.



విజయనగరం రైల్వే స్టేషన్లో హెరిటేజ్ భవనాన్ని ప్రారంభిస్తున్న రైల్వే జిఎం ఉమేష్‌సింగ్

ప్రత్యేకం

భావనపాడుకు ఒక్కరే

- కొత్త టెండర్లకు అధికారుల విముఖత
- ఆదానీకే కట్టబెట్టేందుకే నిర్ణయం

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు హార్బర్ నిర్మాణ బాధ్యతను అదానీ సంస్థకే కట్టబెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్మాణానికి కేవలం ఒకే ఒక్క బిడ్ దాఖలైనప్పటికీ, ఆ సంస్థకే ఇవ్వాలని భావిస్తున్నారు. ఇక భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి కొత్తగా పిలవనున్న టెండర్ ప్రక్రియపై అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ రెండు కీలక ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం భిన్న నిర్ణయాలకు వెళ్లడం ఆశ్చర్యం కలిగిస్తోంది. భావనపాడు టెండర్లు పిలిచిన తరువాత ఆదానీ సంస్థ ఒక్కటే ముందుకొచ్చింది. తనకు వచ్చే ఆదాయంలో కేవలం 0.5 శాతం మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చేందుకు ప్రతిపాదించింది. సాధారణ పరిస్థితుల్లో అయితే ఒకే సంస్థ టెండర్ దాఖలుచేస్తే ఆ నోటిఫికేషన్‌ను రద్దుచేసి, మళ్లీ టెండర్లు ఆహ్వానించాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఆదానీకే టెండర్ ఖరారు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ముందుగా ఈ సంస్థ తనకు వచ్చిన ఆదాయంలో 0.5 శాతం ఇచ్చేందుకు ముందుకొచ్చినప్పటికీ, తరువాత ప్రభుత్వం ఆ సంస్థతో అనేక దఫాలుగా చర్చలు సాగించింది. చివరకు 2.8 శాతం వాటాకు రెండు వర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. అందుకే ఈ టెండర్‌నే ఖరారు చేయాలని భావిస్తున్నట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆ సంస్థకు ఇచ్చే భూమి విలువలో లీజు మొత్తంగా తొలుత రెండుశాతాన్ని చెల్లించాలన్న ఒప్పందానికి వచ్చారు. ఆ తరువాత ఆరు శాతం వరకు వరుసగా పెంచుకోవాలని నిర్ణయించారు. అంతకు ముందుగా ప్రభుత్వం సేకరించి ఇచ్చే భూమికి ఆదానీ సంస్థే ప్రభుత్వం తరపున ధర చెల్లిస్తుంది. అనంతరం ఆదాయంలో వాటాగా చెల్లించే 2.8 శాతం నిధుల నుంచి కొంత మినహాయించుకుని, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించేలా ఒప్పందం తయారుచేసుకున్నారు. టెండర్ ఖరారుపై పూర్తి మార్గదర్శకాలు సిద్ధం చేశారని, త్వరలోనే ఆదానీ, ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదుర్చుకుంటారని అధికారులు చెబుతున్నారు.

భోగాపురం టెండర్‌పై ఇంకా అనిశ్చితే

భోగాపురం విమానాశ్రయ నిర్మాణంపై అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉంది. ముందుగా పిలిచిన టెండర్లలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టెండర్‌ను దక్కించుకున్నప్పటికీ, తరువాత ఆ టెండర్‌ను రద్దు చేయాలని నిర్ణయించారు. కేవలం జిఎంఆర్‌కు మేలు చేసేందుకే ఈ చర్యకు సిద్ధపడ్డారని విమర్శలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త టెండర్ ఎప్పుడు పిలుస్తారన్నదానిపైనా స్పష్టత రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎఎఐకి మింగుడుపడడం లేదు. దక్కిన టెండర్ రద్దు కావడంపై ఎఎఐతోపాటు, కేంద్రంలో ఆ శాఖను చూస్తున్న అశోక్‌గజపతి రాజు కూడా అసహనంగానే ఉన్నారు. అందుకే కొత్త టెండర్ పిలవడానికి ముందుగా ఎఎఐని బుజ్జగించాల్సి అవసరాన్ని కూడా రాష్ట్ర అధికారులు గుర్తు చేస్తున్నారు. కేంద్ర వార్షిక బడ్జెట్ నేపథ్యంలో ఇప్పటికే ఢిల్లీ, విజయవాడల మధ్య సంబంధాలు క్షీణించగా, భోగాపురం కారణంగా పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారరాదన్న భావాన్ని కూడా అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తం

లబ్ధిదారులు స్థిరపడే వరకు సాయం అందించాలి: సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల నుంచి రుణాలు, రాయితీలు పొందుతున్న లబ్ధిదారులు నిలదొక్కుకునేంత వరకు సాయం అందించాలని సిఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో అన్ని సంక్షేమ శాఖలకు చెందిన కార్పొరేషన్లు, ఫెడరేషన్లపై సిఎం సమీక్ష నిర్వహించారు.

రేపు 'కటిక పూలు' ఆవిష్కరణ

ఇండస్ మార్టిన్ రచించిన 'కటిక పూలు' పుస్తక ఆవిష్కరణ సభ ఈనెల 8న విజయవాడలో జరుగుతుందని నిర్వహణ కమిటీ సభ్యులు కె సత్యరంజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత్ శోషన్ మంచ్ కన్వీనర్ వి శ్రీనివాసరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, తొలిప్రతి స్వీకర్తగా సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గుర్రాల శ్రీనివాస్, పుస్తక సమీక్షకులుగా కోయి కోటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు వొరప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ గోపీనాథ్, ఖాదర్ మొహియుద్దీన్, చల్లపల్లి స్వరూపరాణి పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

బాలయోగికి అదనపు బాధ్యతలు

గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు బివి బాలయోగికి అదే శాఖలోని ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్, ట్రైనింగ్ మిషన్ (టిసిఆర్‌అండ్‌టిఎం) విభాగానికి డైరెక్టర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(టిసిఆర్‌అండ్‌టిఐ)ను రెండు విభాగాలుగా 2016లో ప్రభుత్వం విభజించింది. అందులో టిసిఆర్‌అండ్‌టిఐ ఒకటి కాగా, టిసిఆర్ అండ్ టిఎం మరొకటి.

'కూనేరు' ప్రమాదంపై కొనసాగుతోన్న దర్యాప్తు

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జిఎం ఉమేష్‌సింగ్

ప్రజాశక్తి- విజయనగరం/శ్రీకాకుళం

గతేడాది జనవరిలో జరిగిన కూనేరు రైలు ప్రమాద ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఉమేష్‌సింగ్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన విజయనగరం జిల్లాలోని విజయనగరం, చీపురుపల్లి రైల్వేస్టేషన్లను, శ్రీకాకుళంరోడ్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. విజయనగరం రైల్వేస్టేషన్లో రెండోనంబర్ ప్లాట్‌ఫారంపై నూతనంగా నిర్మించిన హెరిటేజ్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి ఒడిశాలోని పూండి స్టేషన్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని రైల్వే జిఎంను ప్రభుత్వ విప్ కూన రవికుమార్ కోరారు. గుణుపూర్ ప్యాసింజర్ రైలును దూసి రైల్వేస్టేషన్లో నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే టన్నెల్, ఫుట్‌వే బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరారు. పూండీలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలపై పలువురు ఆయా స్టేషన్లలో జిఎంకు వినతిపత్రాలు అందజేశారు.

కర్నూలు జిల్లాలో భారీగా ఎస్ఐల బదిలీలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలు జిల్లా వ్యాప్తంగా 71 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ మంగళవారం కర్నూలు రేంజ్ డిఐజి ఘట్టమనేని శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఎస్పీ గోపీనాథ్ జెట్టి ప్రతిపాదనల మేరకు డిఐజి ఎస్ఐ, విఆర్‌లో ఉన్న వారికి కూడా పోస్టింగ్ కల్పించారు. బదిలీ అయిన ఎస్ఐలు సంబంధింత పోలీసు స్టేషన్‌లో రిపోర్టు చేసుకోవాలని డిఐజి ఉత్తర్వులలో సూచించారు.



విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన తరుణీ తరంగాలు కార్యక్రమంలో ప్రదర్శించిన లఘుచిత్రాలలో మొదటి బహుమతి సాధించిన మేరి స్టెల్లా కాలేజీ

అంతరంగాలను వెలువరించేందుకే తరుణీతరంగాలు

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

మహిళలకు అవకాశమిస్తే ఆకాశమే హద్దుగా దూసుకుపోతారని వెల్లడించింది తరుణీతరంగాలు. అతివల ఆశయాలకు నూతన ఉత్సాహాన్నిచ్చింది. విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు ఇలా అంతరాలు లేకుండా అంతరంగాలను వెలువరించేందుకు వేదికగా నిలిచింది. విజయవాడలో మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో రెండురోజుల పాటు నిర్వహించిన తరుణీ తరంగాల కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి.

సమాజంలో చైతన్యం తీసుకువచ్చి వ్యవస్థను మార్చే శక్తి మహిళలకు ఉందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ డి.విజయభాస్కర్ అన్నారు. 'సాధికారత దిశగా మహిళ' అనే అంశంపై రెండో రోజు నిర్వహించిన సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడాకారిణి బి.చంద్రిక మాట్లాడుతూ ఆడపిల్లలు చిన్న విషయాలకు ఎక్కువగా ప్రభావితమై ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలతో నిర్వహించిన "ఓపెన్ ఫోరం' మహిళల ఆశయాలు వెల్లడైయాయి. ఈ కార్యక్రమంలో తరుణీ తరంగాలు అధ్యక్షులు డాక్టర్ రావి శారద, ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, స్వరూపరాణి, వి.నాగలక్ష్మి, నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కెసి కెనాల్‌కు ఈ కష్టమేంటి?



కర్నూలు నగరంలోని కెసి కెనాల్ (ఫైల్)

సంక్షోభంలోకి లక్ష ఎకరాల అయకట్టు

వాటా నీళ్లున్నా ఇవ్వని దుస్థితి

తుంగభద్ర డ్యాంలోనే 4.50 టిఎంసిల నిల్వ

అందోళనలో రైతాంగం

ప్రజాశక్తి కర్నూలు ప్రతినిధి

కర్నూలు, కడప జిల్లాల్లో సాగు, తాగునీటిని అందించే కెసి కెనాల్ కింద వుండే అయకట్టును ప్రభుత్వమే సంక్షోభంలోకి నెట్టేస్తోంది. ఈ కెనాల్‌కు సంబం ధించి వాటా నీరు అందుబాటులో వున్నప్పటికీ నీళ్ళివ్వకుండా పంటలపై నిర్లక్ష్యం వహిస్తుండటం పట్ల ప్రభుత్వ తీరుపై రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దాదాపు లక్ష ఎకరాల అయకట్టు సంక్షోభంలోకి పోయింది. బ్రిటిష్ హయంలో కర్నూలు, కడప జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు నిర్మించిన కెసి కెనాల్‌కు మొదట్లో సుంకేసుల బ్యారేజ్ నుంచి నీటిని అందిస్తున్నారు. సుంకేసుల నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని తీసుకుంటే ఆ నీళ్ల చివరి అయకట్టు దాకా వుండే కడప వరకు వెళ్లేవి. అయితే పోతిరెడ్డిపాడు నుంచి మల్యాల వద్ద ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కెసిలోకి నీటిని తీసుకునే వెసలుబాట ఉన్నా కెసి కెనాల్ కింద అయకట్టు ఎండిపోతోంది. ప్రస్తుతం కెనాల్ కింద వరి 73 వేల ఎకరాలు, అరుతడి పంటలు 27 వేల ఎకరాలు కలిపి లక్ష ఎకరాలకుపైగా అయకట్టు వుంది. కెసి కెనాల్ కింద మార్చి చివరి దాకా నీళ్లు ఇస్తే రైతులు సాగు చేసిన ఈ పంటలన్నీ చేతికొస్తాయి. నవంబర్‌లో జరిగిన ఐఎబి సమావేశంలో కెసి కెనాల్ కింద ఫిబ్రవరి చివరిదాకా నీటిని ఇస్తామని తీర్మానం చేసింది. మార్చిదాకా నీళ్ల అవసరం వున్నా ఫిబ్రవరి చివరిదాకా నీళ్ల ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఫిబ్రవరి ప్రారంభంలోనే కెనాల్‌లోకి నీటి విడుదల నిలిపేసింది. ఈ కెనాల్ కింద 150 కిలోమీటర్ల దాకా వుండే 37,700 ఎకరాలకు మార్చి చివరిదాకా దాదాపుగా 2.50 టిఎంసిలు నీరు అవసరమవుతుంది. అలాగే 150 కిలోమీటర్ల నుంచి కడప దాకా దాదాపుగా 4 టిఎంసిలు నీరు అవసరమవుతుంది. కేవలం సాగునీటి అవసరాల కోసం అనుకున్నా కెనాల్‌లో 1600 క్యూసెక్కుల ప్రవాహం వుంటే కానీ చివరి అయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. సుంకేసుల నుంచి కనీసం 500 క్యూసెక్కుల ప్రవాహం వుండాల్సి వుండగా రెండు రోజులుగా నీటి విడుదలను నిలిపివేశారు. మల్యాల వద్ద కేవలం ఒక్క పంపు ద్వారా 330 క్యూసెక్కులను, ముచ్చుమర్రి వద్ద 250 క్యూసెక్కులను మాత్రమే వదులుతున్నారు. 1600 క్యూసెక్కుల ప్రవాహం అవసరం వుంటే ప్రస్తుతం 580 క్యూసెక్కులు మాత్రమే వదులుతుండడంతో అవి ఏమూలకు సరిపోని పరిస్థితి వుంది. ఈ నీటి ప్రవాహంతోనే కర్నూలు, నందికోట్కూరు, నంద్యాల పట్టణాలతోపాటు పలు గ్రామాలకు తాగునీటిని తీసుకుంటున్నారు. ఈ కెనాల్‌కు బచావత్ అవార్డ్‌లో కేటాయించిన నీటి కోటా ప్రకారం తీసుకున్నా నీరు అందుబాటులోనే వుంది. తుంగభద్ర డ్యాంలో కెనాల్‌కు సంబంధించి 5.37 టిఎంసిల నీటి వాటా వచ్చింది. ఇందులో నుంచి ఇప్పటిదాకా కేవలం 1 టిఎంసి నీటిని మాత్రమే అందించారు. ఇంకా 4.37 టిఎంసిల నీరు తుంగభద్ర డ్యాంలో వుంది. ఈ నీటి నుంచి కెసి కెనాల్‌కు 3 టిఎంసిల నీటిని విడుదల చేయాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టినా ఇప్పటి దాకా తుంగభద్ర డ్యాం నుంచి నీటిని విడుదల చేయలేదు. ప్రభుత్వం కెనాల్‌కు నీటిని విడుదల చేయకపోతే లక్ష ఎకరాల్లో వుండే వరి, పత్తి, మిరప, మొక్కజొన్న లాంటి పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికైనా తుంగభద్ర డ్యాం నుంచి, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కెసి కెనాల్‌లోకి నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంచార్జి మంత్రుల వల్లే కెసికి అన్యాయం జరుగుతోంది



కర్నూలు జిల్లా ఇంచార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు, అనంతపురం జిల్లా ఇంచార్జి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వైఖరి వల్లే కెసి కెనాల్‌కు తీవ్ర అన్యాయం జరుగుతోంది. పట్టిసీమతో రాయలసీమకు సంవత్సరం పొడువునా నీళ్ల ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కెసి కెనాల్‌కు ఎందుకు నీళ్ల బంద్ చేశారో చెప్పాలి. కర్నూలుకు నీళ్ల ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం ఎంతవరకు సబబు.

- గౌరు చరిత, పాణ్యం ఎమ్మెల్యే

వాటా నీళ్లున్నా ఇవ్వకపోవడం సరికాదు



కెసి కెనాల్‌కు బచావత్ అవార్డ్ కేటాయించిన నీళ్ల అందుబాటులో ఉన్నా ఇవ్వకపోడం అన్యాయం. కెసి కెనాల్ వాటాకు సంబంధించిన నీళ్ల తుంగభద్ర డ్యాంలో 4.50 టిఎంసిల దాకా వుంది. ఈ నీటిని కెసి కెనాల్ అయకట్టుకు ఎందుకివ్వరు.

- సుబ్బరాయుడు, సాగునీటి రంగ నిపుణులు

మార్చిదాకా నీళ్లిచ్చి పంటలను కాపాడాలి



కెసి కెనాల్ కింద ప్రభుత్వమే ఫిబ్రవరి చివరి దాకా నీళ్ల ఇస్తామని చెప్పి జనవరిలోనే నీటి విడుదలను అపేయడం సరైంది కాదు. మార్చి చివరి దాకా కెసికి నీళ్లివ్వకపోతే దీని కింద వుండే అయకట్టు ఎండిపోయే ప్రమాదం వుంది.

- టి.రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం

నిరుపేదలకు 'బహిరంగ' శిక్ష

మరుగుదొడ్లు లేవని పింఛన్లు, రేషన్ నిలిపివేత

ఒడిఎఫ్ లక్ష్యం కోసం ప్రభుత్వ నిర్వాకం



పింఛన్లు ఆపేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న బూర్జ మండలం లక్షుమయ్యపేట వృద్ధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

బహిరంగ మలవిసర్జన రహిత (ఒడిఎఫ్) జిల్లాగా మార్చే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పేదలకు కష్టాలను మిగుల్చుతున్నాయి. మరుగుదొడ్లను నిర్మించుకోని కుటుంబాలకు రేషన్, పింఛను నిలిపేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఫిబ్రవరి నెలకు సంబంధించి లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ సరుకులు నిలిపి వేశారు. దీంతో పింఛన్లు, రేషన్ సరుకులు వస్తే గానీ పూట గడవని నిరుపేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో 3,64,865 కుటుంబాలకు మరుగుదొడ్లు లేవని అధికారులు గుర్తించారు. వీటిని పూర్తి చేయడం ద్వారా ఈ ఏడాది మార్చి 31 నాటికి ఒడిఎఫ్ జిల్లాగా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వాటిలో ఇప్పటివరకూ 84,024 మరుగుదొడ్లు మాత్రమే పూర్తయ్యాయి. 45,888 మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. ఇంకా 2,34,453 మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యంలో రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా అత్యంత వెనుకబడి ఉండటాన్ని కలెక్టర్ల కాన్ఫరెన్సుల్లోనూ, వీడియో కాన్ఫరెన్స్‌లోనూ చంద్రబాబునాయుడు పలుమార్లు జిల్లా అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

నిలిచిపోయిన 'సంక్షేమం'

సిఎం ఆదేశాల దృష్ట్యా అధికారులు మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఉధృతం చేసేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మరుగుదొడ్లను నిర్మించుకోని కుటుంబాలకు ఈ నెల పింఛన్లు, రేషన్ సరుకులను ఆపేశారు. గ్రామ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి మరుగుదొడ్లు ఉన్నవారికి మాత్రమే పింఛను అందజేస్తున్నారు. మరుగుదొడ్లు ఉన్నాయని మండల రెవెన్యూ అధికారులు ధ్రువీకరిస్తూ పత్రం అందజేస్తేనే రేషన్ సరుకులు అందిస్తున్నారు. దీంతో, ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, పరాయిపంచన ఉంటూ బతుకీడుస్తున్న పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎవరి ఆసరా లేకుండా ఉంటున్న తాము మరుగుదొడ్లను ఎలా నిర్మించుకుంటామని వారు ప్రశ్నిస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు మినహాయింపు!

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో వంద మంది సర్పంచులకు, వెయ్యిమంది వార్డు మెంబర్లకు మరుగుదొడ్లు లేవు. నిరుపేదలకు రేషన్, పింఛన్లు నిలిపేస్తున్న అధికారులు వారి జోలికి వెళ్లడం లేదు. 70 మంది వరకూ కింది స్థాయి ప్రభుత్వోద్యోగులకు మరుగుదొడ్లు లేవు.

రూ.పది లక్షల విలువైన ఎర్రచందనం పట్టివేత

ప్రజాశక్తి- గంట్యాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా గంట్యాడ మండలం రామవరం గ్రామంలో ఓ ఇంట్లో మూడున్నర టన్నుల ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. పది లక్షలు ఉంటుందని వారు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని కె.రామకృష్ణరాజు ఇంట్లో ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు చిత్తూరు జిల్లాలోని టాస్క్‌ఫోర్స్‌కు సమాచారమందింది. సోమవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆ ఇంటికి ఆనుకొని ఉన్న గోదాములో సోదా చేశారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలను లారీలో చిత్తూరుకు తరలించారు. ఇంటి యజమాని రామకృష్ణను అదుపులోకి తీసుకొని వారితో తీసుకెళ్లారు. అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. జిల్లా అటవీ శాఖాధికారి జి.లక్ష్మణ్ మంగళవారం రామవరంలోని రామకృష్ణరాజు ఇంటిని పరిశీలించారు. రామకృష్ణ సోదరుడు కె.సత్యరాజశర్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ ఇంటి వద్ద ఉన్న గోదామును బుద్ధరాజు సునీల్‌వర్మరాజుకు అద్దెకిచ్చామని, ఆయన ఇక్కడ కర్రల వ్యాపారం చేస్తున్నారని తమకు తెలియదని చెప్పారు. సోదరుడు రామకృష్ణ, తాను విజయనగరంలో తాత్కాలికంగా అద్దెకు ఉంటున్నామని తెలిపారు. అటవీ శాఖ సిబ్బంది ఆ గోదాములో తనిఖీలు చేయగా మిగిలిపోయిన మరో చిన్న ఎర్రచందనం ముక్కలు లభించాయి. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్సుకు తెలియజేస్తామని డిఎఫ్ఒ తెలిపారు.

మానవత్వం లేని మోడీ

మహిళా ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

ప్రజాశక్తి-తిరుపతి సిటి



తండ్రి తాగుడు మానలేదని ఇటీవల ఆత్మహత్య చేసుకున్న భార్గవి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నన్నపనేని రాజకుమారి, ఐద్వానేతలు

విభజన వల్ల నష్టపోయిన ఎపి బడ్జెట్లో అన్యాయం జరిగిందని, ప్రధాని నరేంద్రమోడీకి మానవత్వం లేదని నిరూపించుకున్నారని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి విమర్శించారు. తిరుపతి పర్యటనలో భాగంగా మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కొన్ని రాష్ట్రాలకు మాత్రమే అధికంగా నిధులను కేటాయించి, మరికొన్ని రాష్ట్రాలను ప్రధాని గాలికొదిలేశారన్నారు. ఎన్నికల సందర్భంగా తిరుపతిలోని వెంకన్నసాక్షిగా నరేంద్రమోడీ రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని, నాలుగేళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇకనైనా మించిపోయింది లేదని, ప్రధాని తన తప్పు తెలుసుకుని పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి ఆంధ్రప్రదేశ్‌కు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆంధ్రుల ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ 'రాజేష్‌పై నాన్‌బెయిలబుల్‌కేసు పెట్టాలని, మొదటిరాత్రి భార్యకు నరకం చూపించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలనే మాటకు తాను కట్టుబడి ఉన్నాను' అని పేర్కొన్నారు. అనంతరం బిసి మహిళా హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెర్లోపల్లిలో ఇటీవల తండ్రి తాగుడు మానలేదన్న బాధతో ఆత్మహత్య చేసుకున్న భార్గవి (15) కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెతో పాటు ఎంఎల్ఎ సుగుణమ్మ, వైద్య విభాగం నాయకురాలు డాక్టర్ సుధారాణి, ఐద్వా నేతలు సాయిలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

11స్టార్ ప్లాన్ అమలు చేయాలి

పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ రామాంజనేయులు

ప్రజాశక్తి - నంద్యాల (కర్నూలు)

11 అంశాలతో ప్రత్యేకంగా రూపొందించిన 11స్టార్ పథకాన్ని గ్రామాల్లో అధికారులు, సర్పంచ్‌లు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా సెంచూనరి హాల్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజంపేట, కడప, జమ్మలమడుగు డివిజన్లలో సర్పంచ్‌లతో పథకం అమలుపై ముఖాముఖి నిర్వహించారు. సంతృప్తికరంగా పనులు సాగుతున్నాయని, కర్నూలు జిల్లాలో కూడా పథక అమలుకు కంకణబద్దులై పనిచేసి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

గతంలో కేవలం ఫైనాన్స్, పంచాయతీ నిధులతో మాత్రమే అభివృద్ధి పనులు జరగాల్సి ఉండేదని, నేడు ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీకి అధిక నిధులు వస్తున్నాయని వీటితో గ్రామాల అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రధాని అంత్యోదయ మిషన్ పెట్టామని దీని ద్వారా ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం, ఆరోగ్యం, ఆనందమయ జీవితం, హింసలు లేని సమాజాన్ని నిర్మించాలన్నదే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. గ్రామ సర్పంచి, పంచాయతీ రాజ్ శాఖ, ఇతర అన్ని శాఖల అధికారులు తమవంతు బాధ్యతగా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో జెడి ఉమా మహేశ్వరమ్మ, డిపిఒ పార్వతి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ఆయేషా హత్య కేసు పునర్విచారణ ప్రారంభం

కాలేజ్, హాస్టల్‌ను పరిశీలించిన సిట్ బృందం

ఉదయం నుంచి రాత్రి వరకు విచారణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (విజయవాడ)/ అమరావతి బ్యూరో

11 సంవత్సరాల క్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బి ఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసు మళ్లీ పునర్విచారణ ప్రారంభమైంది. ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో డిఐజి శ్రీకాంత్ ఆధ్వర్యంలోని సిట్ బృందం మంగళవారం దుర్గా లేడీస్ హాస్టల్‌తో పాటు నిమ్రా కాలేజ్‌ను పరిశీలించింది. ఉదయం నుంచి రాత్రి వరకు కొందరిని విచారించింది. 2007 డిసెంబర్ 27న ఘటన జరిగిన తరువాత నుంచి ఈ కేసులో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. పదుల సంఖ్యలో అనుమానితులను విచారించిన పోలీసులు చివరికి సత్యంబాబు హత్య చేసినట్లు నిర్ధారించారు. కొందరు రాజకీయ నేతల సంబంధీకులు ఉన్నట్లు విమర్శలు రావడంతో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించింది. తొలుత ఈ కేసులో కింది కోర్టు సత్యంబాబుకు యావజ్జీవ శిక్ష విధించగా, తరువాత హైకోర్టు సత్యంబాబును నిర్దోషిగా ప్రకటించి గతేడాది ఏప్రిల్ 30న విడుదల చేసింది. దీంతో పోలీస్ శాఖకు ఆయేషా మీరా హత్యకేసు సవాల్‌గా మారింది. దోషులను పట్టుకోవాలంటూ కొంతమంది సామాజిక కార్యకర్తలు హైకోర్టులో పిల్ చేయడంతో మరింత ఒత్తిడి పెరిగింది. అసలు దోషులను పట్టుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. దీంతో విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతంసవాంగ్ నేతత్వంలో కేసు పునర్విచారణ చేయడానికి ప్రత్యేక బందం (సిట్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విచారణ హైకోర్టు ఆధ్వర్యంలో జరగాలని కోర్టు ఆదేశించడంతో సిట్ అధికారి విశాఖ రేంజ్ డిఐజి శ్రీకాంత్ కేసు పూర్వపరాలను పరిశీలించి తన బందంతో మంగళవారం దర్యాప్తు ప్రారంభించారు. విచారణ మరికొన్ని రోజులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. హైకోర్టు ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందన్నందున కేసుకు సంబంధించిన సమాచారం బయటపెట్టే అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేకం

సర్క్యూట్ హౌస్ ఉన్నా..

నక్షత్రాల హోటళ్లలోనే మంత్రుల బస

నోవాటెల్ హోటల్‌కు రూ.10 కోట్లు బకాయి



విశాఖ ఆర్కేబీచ్ సమీపంలో ఉన్న నోవాటెల్ హోటల్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖలో మంత్రుల పర్యటనలు చాలా ఖరీదుగా మారిపోయాయి. ప్రభుత్వం నిర్మించిన సర్క్యూట్ గెస్ట్‌హౌస్ ఉన్నా ఐదు నక్షత్రాల హోటళ్లలోనే బస చేస్తున్నారు. విలాసాల్లో మునిగితేలుతూ దర్పం ప్రదర్శిస్తున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వం విశాఖలోని స్టార్ హోటల్ నోవాటెల్‌కు రూ.10 కోట్లు బకాయి పడినట్లు సమాచారం. మంత్రి ఎవరైనా ఫైవ్‌స్టార్ హోటల్‌లో దిగితే రోజుకు రూ. లక్ష నుంచి రెండు లక్షలు బిల్లు అవుతోందని అధికారులు చెబుతున్నారు.

విశాఖ నగరం జిల్లా పర్యటనలకు వచ్చే మంత్రులు ప్రజా సమస్యల పరిష్కారం కంటే పిక్నిక్‌లాగా భావిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. ఏదో తూతూ మంత్రంగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించి తర్వాత స్టార్ హోటల్‌లో ప్రైవసీగా గడుపుతున్నారు. విశాఖకు తరుచూ వస్తున్న మంత్రుల్లో నిమ్మకాయల చినరాజప్ప, కామినేని శ్రీనివాస్, కింజరాపు అచ్చెంన్నాయుడు, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమ, పి.నారాయణ, పరిటాల సునీత, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి వారు ఉన్నారు. వీరిలో కొంతమంది విశాఖలో ఏదైనా ప్రయివేటు కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంటే సొంత ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తుందని, దాన్ని అధికారిక కార్యక్రమంగా మారుస్తున్నారు. బండారు సత్యనారాయణమూర్తి కుమార్తె వివాహం సందర్భంగా నగరంలో దాదాపుగా అర డజనుకు పైగా మంత్రులు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి మొత్తం ఖర్చును ప్రభుత్వంపైనే వేశారు.

ప్రయివేటు వ్యవహారాలకే నక్షత్రాల హోటళ్లలో బస

ఫైవ్ స్టార్‌లో అయితే ప్రయివేటు వ్యవహారాలు, సెటిల్‌మెంట్లు కూడా చేసుకోవచ్చన్న ఉద్దేశంతోనే మంత్రులు ఫైవ్ స్టార్ హోటళ్ల వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. అదే సర్క్యూట్ హౌస్‌లో అయితే దందాలు, సెటిల్‌మెంట్ల వ్యవహారాలు బయటకు పొక్కే వీలుంటుందన్న భయం ఉంటుంది.

చంద్రబాబే ఆదర్శమా..!

'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్న సామెత ముఖ్యమంత్రికి.. మంత్రులకు అతికినట్లు సరిపోతుంది. రాష్ట్రం ఆదాయం కోల్పోయింది.. అప్పుల్లో ఉన్నాం అంటూనే ప్రపంచంలో ఏ సదస్సులున్నా రాష్ట్రంలోకి అందునా విశాఖకు ముఖ్యమంత్రి ఆహ్వానిస్తున్నారు. నెలకు ఒకటి లేదా రెండు అంతర్జాతీయ సదస్సులు నిర్వహించమని సిఎం చెప్పినట్లు ఇటీవల మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. దీంతో ప్రపంచ స్థాయి, జాతీయ స్థాయి సదస్సులకు నోవాటెల్, తాజ్ గేట్‌వేలను కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిపోయాయి. చంద్రబాబు కూడా తరుచూ ప్రత్యేక విమానాల్లో ప్రపంచ దేశాలను చుట్టొస్తున్నారు. మరోవైపు మూడేళ్ల పాటు ఆయన కుటుంబాన్ని హైదరాబాద్‌లోని పార్క్‌హయత్‌లో ఉంచి కోట్లాది రూపాయలు అద్దెలు చెల్లించారు. ఆయన అలా ఉంటే మంత్రులు మరోలా ఎందుకు ఒంటారు. అందుకే సర్క్యూట్ హౌస్‌ను కాదని విశాఖలోని ఖరీదైన హోటళ్లలో బస చేస్తున్నారు.

సంక్షిప్తం

అమృత యూనివర్సిటీకి నేడు సిఎం శంకుస్థాపన

మంగళగిరి రూరల్ (గుంటూరు):రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లులో అమృత యూనివర్సిటీకి సిఎం చంద్రబాబు బుధవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను గుంటూరు అర్బన్ ఎస్‌పి విజయరావు మంగళవారం పరిశీలించారు. అమృత యూనివర్సిటీకి 150 ఎకరాలను కేటాయించిన నేపథ్యంలో శంకుస్థాపనకు సిఎంతోపాటు మంత్రులు గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ, కామినేని శ్రీనివాసరావు, పుల్లారావు, తదితరులు హాజరుకానున్నారు.

త్వరలో అంబేద్కర్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీలు : మంత్రి

గుంటూరు సిటీ ప్రతినిధి:రాష్ట్రంలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు నిరంతరం శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రతి జిల్లాలోనూ అంబేద్కర్ స్కిల్ అండ్ ట్రైనింగ్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఆనందబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని ఎస్సీ కార్పొరేషన్ల ఇడిలతో ఆయన గుంటూరులో మంగళవారం సమీక్షించారు. ఈ నెలాఖరుకు 2017-18 సంవత్సరానికి సంబంధించి యూనిట్ల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలని, 2016-17 సంవత్సరానికి సంబంధించి యూనిట్ల గ్రౌండింగ్ వారం, పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

కారు ఢీకొని జింక మృతి

సీతానగరం (విజయనగరం జిల్లా): విజయనగరం జిల్లా సీతానగరం మండలం అప్పయ్యపేట, జోగింపేట గ్రామాల మధ్య మంగళవారం కారు ఢీకొని జింక మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం... అప్పయ్యపేట సమీపంలోని కొండలపైనుంచి వచ్చి పొలాల వైపు వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతున్న జింకను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. నీరు తాగేందుకు పొలాల్లోకి జింక వస్తుండగా ప్రమాదం జరిగినట్లు అటవీ శాఖాధికారులు భావిస్తున్నారు.

కత్తి పద్మారావుకు పితృవియోగం

ప్రజాశక్తి-పొన్నూరు (గుంటూరు జిల్లా)

దళిత తాత్వికవేత్త, బహుగ్రంథకర్త కత్తి పద్మారావు తండ్రి కత్తి సుబ్బారావు(95) మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు లుంబిని వనంలో మృతి చెందారు. మూడురోజుల కిందట ఆయన అస్వస్థతకు గురయ్యారు. వైద్యులు ఇంటివద్దనే వైద్యసేవలు అందించే ప్రయత్నం చేశారు. వృద్ధాప్యం కారణంగా మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం 11.00 గంటలకు పొన్నూరులో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

రాష్ట్రంలో 4,600 టన్నుల ఎర్రచందనం నిల్వలు

2019 నాటికి హరితాంధ్రప్రదేశ్ : శిద్దా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో ప్రస్తుతం 4,600 టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయని, కేంద్రం అనుమతులు రాగానే వేలం వేస్తామని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి సిద్ధా రాఘవరావు తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్అండ్‌బి అతిథి గృహంలో అటవీ శాఖాధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రచందనం నిల్వలను ఎప్పటికప్పుడు వేలం నిర్వహించి ఆదాయం రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వేలం నిర్వహించేందుకు కేంద్రం నుంచి అనుమతి ఆలస్యమవుతుందని చెప్పారు. అటవీ ప్రాంతంలో చెక్‌డ్యాములు, వాటర్‌షెడ్‌ల నిర్మాణం, వన్య ప్రాణుల సంరక్షణ, భూగర్భ జలాలను పెంపొందించేందుకు రూ.500 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 20 కోట్ల మొక్కలను నాటామని చెప్పారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో జాతీయ రహదారుల పక్కన 19 అటవీ నర్సరీలు ఉన్నాయని అన్నారు. వీటి అభివృద్ధికి ఒక్కో నర్సరీకి రూ.3 కోట్లు చొప్పున కేటాయిస్తామన్నారు. 2019 నాటికి హరితాంధ్రను సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ కలిగించిందని తెలిపారు. కేబినెట్‌లో కేంద్ర బడ్జెట్‌పై చర్చించామని తెలిపారు.

సంపాదకీయం

మాల్దీవుల సంక్షోభం

మనకు పొరుగునే ఉన్న మాల్దీవుల్లో అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాది చివరిలో జరగనుండగా ప్రభుత్వానికి, న్యాయ వ్యవస్థకు మధ్య తలెత్తిన ఘర్షణ ఈ చిన్న పర్యాటక దేశాన్ని తీవ్ర రాజకీయ సంక్షోభంలోకి నెట్టడం దురదృష్టకరం. దేశంలో శాంతిని కాపాడేందుకు పదిహేను రోజుల పాటు ఎమర్జన్సీ విధిస్తున్నట్లు అధ్యక్షుడు యమీన్ ప్రకటించడం, ఆ వెంటనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా ఇద్దరు న్యాయమూర్తులను అవినీతికి పాల్పడ్డారన్న అభియోగంపై అరెస్టు గావించడం, ప్రభుత్వానికి, ప్రతిపక్ష నిరసనకారులకు మధ్య ఘర్షణతో రాజధాని మాలే ఉద్రిక్తంగా మారడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్య ప్రియులకు ఆందోళనకు గురిచేసేవే. క్రిమినల్, ఉగ్రవాద ఆరోపణల కింద జైలు పాలై, ప్రస్తుతం లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న మాజీ అధ్యక్షుడు నషీద్‌తో సహా తొమ్మిది మంది ప్రతిపక్ష నాయకులపై గతంలో విధించిన శిక్షలను రద్దు చేయడంతోబాటు, అనర్హత వేటు పడిన మరో 12 మంది ప్రతిపక్ష ఎంపీల సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ గత గురువారం సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో మొదలైన ఈ సంక్షోభం ఎమర్జన్సీ విధింపుతో పతాక స్థాయికి చేరింది. సైన్యం, పోలీసులు కోర్టు ఉత్వర్వుకు వ్యతిరేకంగా, అధ్యక్షునికి మద్దతుగా నిలవడం గమనార్హం. యమీన్ చర్య అప్రజాస్వామికమని అమెరికా, బ్రిటన్, కెనడా ఖండించాయి. అంత తీవ్ర స్వరంతో కాకున్నా భారత్ కూడా యమీన్ చర్యపై అసమ్మతి తెలిపింది. మిగతా దేశాలు వేచి చూసే ధోరణిని అనుసరిస్తున్నాయి.

2012 ఎన్నికల్లో నషీద్‌ను ఓడించి యమీన్ అధ్యక్ష పదవి చేపట్టినప్పటి నుంచి ఆయనను గద్దె దించడమే లక్ష్యమని ప్రకటించినవారిలో అధ్యక్షుని సవతి సోదరుడు మహ్మూద్ గయూమ్ ప్రముఖుడు. ఈయన మూడు దశాబ్దాల పాటు దేశాన్ని నిరంకుశంగా పాలించాడు. 2008లో బహుళపార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో తొలిసారి జరిగిన ఎన్నికల్లో మాల్దీవ్స్ డెమొక్రటిక్ పార్టీ (ఎండిపి) నేత అయిన నషీద్ చేతిలో గయూమ్ ఓడిపోయాడు. 2012 ఎన్నికల్లో నషీద్‌ను యమీన్ ఓడించాడు. ఉగ్రవాద చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణపై పదమూడేళ్ల జైలు శిక్ష పడింది. కొద్ది కాలం శిక్ష అనుభవించి, తరువాత అమెరికా సాయంతో ఆయన ప్రవాసంపై లండన్‌కు వెళ్లిపోయాడు. యమీన్, గయూమ్, నషీద్ ఎవరు అధికారంలో వున్నా మాల్దీవుల ప్రజలకు ఒరిగిందేమీ లేదు. మాల్దీవుల పాలకవర్గాల్లో తలెత్తిన అంతర్గత విభేదాలు సంక్షోభ చిచ్చును రగిలిస్తే, పశ్చిమ దేశాలు దీనికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. తూర్పు ఆసియా వ్యవహారాలను చూసే అమెరికా విదేశాంగశాఖ సహాయ మంత్రి అలీస్ వెల్స్ ఇటీవల అమెరికన్ కాంగ్రెస్ ఆసియా-పసిఫిక్ సబ్ కమిటీకి సమర్పించిన నివేదికలో దక్షిణాసియాపై పట్టు పెంచుకోవాలంటే మాల్దీవుల్లో జోక్యం తప్పనిసరి అని వాదించారు. మాల్దీవుల జనాభా నాలుగు లక్షలకు మించి వుండదు. వైశాల్యం కూడా చాలా తక్కువే. అయినా, ఈ ప్రాంతం ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకోవడానికి కారణం అది భౌగోళికంగా, వ్యూహాత్మకంగా కీలకమైన స్థానంలో వుండడమే. తూర్పు ఆసియా, దక్షిణాసియా, మధ్య ప్రాచ్యం, ఆస్ట్రేలియా, భారత్, చైనా, జపాన్ దక్షిణ కొరియా తదితర దేశాల నౌకలు, చమురు కంటైనర్లు చాలా వరకు ఈ దీవుల గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. మాల్దీవుల భద్రత కోసం యమీన్ ప్రభుత్వం అటు అమెరికాతో, ఇటు భారత్, చైనాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఆ క్రమంలోనే వన్ బెల్ట్ వన్ రోడ్డు ప్రాజెక్టులో చేరడానికి అంగీకరిస్తూ చైనాతో గత ఏడాది ఒప్పందం కుదుర్చుకుంది. చైనాను ఒంటరిపాటు చేయాలని చూస్తున్న ట్రంప్ సర్కారుకు ఇది రుచించలేదు. ఇటీవల యమీన్ ప్రభుత్వం చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం కూడా అమెరికా ఆగ్రహానికి కారణమై ఉండవచ్చు. యమీన్ ప్రభుత్వాన్ని కూలదోసి, దాని స్థానే కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలన్నది అమెరికా పన్నాగం. అమెరికా ఇండో-పసిఫిక్ వ్యూహంలో భాగస్వామిగా చేరడంలో అత్యుత్సాహం చూపిన మోడీ ప్రభుత్వం, మాల్దీవుల సంక్షోభంలోనూ అమెరికాకు వంతపాడే వైఖరిని అనుసరిస్తోంది. యమీన్ అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి విదేశీ పర్యటన భారత్‌తోనే ప్రారంభించారు. మోడీ మాత్రం శ్రీలంక, షిచెల్లీస్ పర్యటన అనంతరం మాల్దీవులను సందర్శించాల్సి వుండగా, అకస్మాత్తుగా రద్దు చేసుకున్నారు. అమెరికా మెప్పుకోసం మాల్దీవుల సంక్షోభంలో తొందరపడి భారత్ జోక్యం చేసుకోవడం మన దేశానికే నష్టం చేకూర్చే అవకాశం ఉంది.

ఇదీ విషయం



కృష్ణానదీ తీరంలో
రాబందుల పాగా...
రాజధాని ముసుగులో
అనుక్షణం దగా దగా!

రాజెక్కడ రాజ్యమెక్కడ
భూదందా సాగుతోంది...
రైతు కాళ్ళ కింద నేల
నిరంతరం కదులుతోంది!

- కొల్లూరు వెంకట్


విశ్లేషణ

పోరాడే యూనియన్‌కు పట్టం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎన్నికలు

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ గుర్తింపు ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత వున్నది. ఫిబ్రవరి 5వ తేదీన గుర్తింపు యూనియన్ ఎన్నికలు జరిగాయి. సిఐటియు ప్యానల్ 3784 ఓట్లతో ఘన విజయం సాధించింది. ఎఐటియుసి ప్యానల్‌పై 550 ఓట్లు, ఐఎన్‌టియుసి(ఇంటక్)పై 188 ఓట్లు ఆధిక్యతతో సిఐటియు గెలిపొందింది. స్వతంత్రంగా పోటీ చేసిన టిఎన్‌టియుసికి 206 ఓట్లు, బిజెపి రాష్ట్ర మంత్రులతో సహా రంగంలోకి దిగి ప్రచారం చేసిన బి.ఎం.ఎస్‌కు 126 ఓట్లు మాత్రమే వచ్చాయి.

విశాఖ స్టీల్‌ను ప్రయివేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వుంది. దీనిని ఎదిరించి సమరశీల పోరాటం చేయగల సత్తా సిఐటియుకు మాత్రమే వుంది. స్థానిక సమస్యలపై ఇంటక్ నాయకత్వం స్టీల్ కార్మికులకు ద్రోహం చేసింది. ఇంటి అద్దె అలవెన్స్‌పై పెట్టిన షరతుల కారణంగా కార్మికుల్లోను, కొత్త ఉద్యోగుల్లోను తీవ్ర వ్యతిరేకత పెరిగింది. అందువల్ల 2015 గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు, ఎఐటియుసిలు కలిసి పోటీ చేసిన ప్యానల్‌పై ఇంటక్ 1037 ఓట్ల మెజారిటీతో నెగ్గింది. కాని 2018 ఎన్నికలో ఇంటక్ తమ మెజార్టీ కోల్పోంది. సిఐటియు ప్యానల్‌పై ఓడిపోయింది. యాజమాన్యంతో కలిసి ఇంటక్ కార్మికులకు హాని చేసే అంశాలపై అవగాహనకు వచ్చింది. దీనిని సిఐటియు అడుగడుగునా వ్యతిరేకించింది. కార్మికులు దీనిని గుర్తించారు. కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధితో పని చేస్తుందని సిఐటియుని గెలిపించారు. విశాఖపట్నంలో ప్రభుత్వ రంగ పరిరక్షణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నది. గత ఆగస్టు నుండి ఈ ఉద్యమం రోజు రోజుకు ఉధృతమౌతున్నది. కార్మికులు, ప్రజలు, మేధావుల మద్దతు కూడగడుతున్నది. డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా లక్ష మంది ప్రజలు ప్రజా బ్యాలెట్‌లో పాల్గొన్నారు. 5 లక్షల మంది ప్రజలు డిసిఐ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాల ఉద్యమం సాగుతున్నది. నిరాహార దీక్షలు, ర్యాలీలు, ధర్నాలతో విశాఖ నగరం దద్దరిల్లుతుంది. కార్మికులు, అధికారులతో కలిసి డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగిస్తున్న ఉద్యమం యావత్తు కార్మిక వర్గాన్ని ఆకర్షిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌లో ముంచుకొస్తున్న ప్రయివేటీకరణను ఎదిరించగల సత్తా సిఐటియుకు వున్నదని స్టీల్‌ప్లాంట్ ఎన్నికల్లో కార్మికులు గుర్తించారు.



సిహెచ్ నరసింగరావు

సిఐటియు ఆది నుంచి ప్రభుత్వ విధానాలు, కార్మిక సమస్యలపైనే కేంద్రీకరించి ఎన్నికల్లో ప్రచారం చేసింది. గతంలో ఇతర ట్రేడ్ యూనియన్లు కూడా సమస్యల పైనే కేంద్రీకరించి పోటీకి దిగేవి. ఇవి ఈసారి వ్యక్తులు, కులాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చాయి. సిఐటియు వ్యక్తుల యూనియన్ కాదు. కుల సంఘాలను నడపడానికి పూర్తి వ్యతిరేకం. ఇతర సంఘాలు వ్యక్తుల చుట్టూ తిప్పడం, కులాలను నడపడం రివాజు. ఇంటక్ చౌకబారు, నీచ ప్రచారాలకు కూడా దిగజారింది. వీటికి తోడు స్టీల్‌ప్లాంట్‌లో వారం రోజుల పాటు మద్యాన్ని వరదలా పారించింది. దీనిని అధికారులు, పోలీసులు అడ్డుకోలేకపోయారు. తమ యూనియన్ సభ్యుల మీద కూడా విశ్వాసం లేకుండా రాత్రింబవళ్ళు ప్లాంట్‌ని మద్యంతో ముంచెత్తింది. టిడిపి స్థానిక ఎమ్మెల్యే నాయకత్వంలో 600 మందికి డబ్బులు పంచారు. అయినా వారికి వచ్చిన ఓట్లు 206 మాత్రమే. టిడిపి నాయకత్వం రాష్ట్రంలో అధికారంలో వున్నా లేకున్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రారంభం నుంచి సిఐటియు నిజాయితీగా పని చేస్తుందని బహిరంగంగా సమర్థించింది. 1991లో సిఐటియు మొదటి సారి నెగ్గిన ఎన్నికల్లో ... వుడా చైర్మన్ గంగిరెడ్డి స్వయంగా గేటు మీటింగుకు వచ్చి సిఐటియును గెలిపించాలని పిలుపునిచ్చారు. 2015 గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయిన కాలంలో ఇంటక్‌ను టిడిపి ఎమ్మెల్యే బలపర్చారు. మంత్రి గంటాను గేట్ మీటింగుకు పిలిచారు. ఇంటక్ గెలుపుకు టిడిపి ప్రభుత్వం అండగా నిలిచింది. 2018 గుర్తింపు ఎన్నికల్లో ఇంటక్‌ను గెలిపించాలని శతవిధాలా టిడిపి ఎమ్మెల్యే ప్రయత్నించారు. మూడు గ్రూపులుగా వున్న టిఎన్‌టియుసి ఏకగ్రీవంగా ఐఎన్‌టియుసికి మద్దతివ్వడానికి వ్యతిరేకించారు. గత్యంతరం లేక ఎమ్మెల్యే నాయకత్వంలో రెండు గ్రూపులు కలిసి స్వతంత్రంగా పోటీ చేశాయి. బొడ్డు పైడిరాజు నాయకత్వం సిఐటియును బలపర్చింది.

సిఐటియు వామపక్ష ఐక్యతకు ప్రాధాన్యతనిచ్చింది. గత 3 ఎన్నికల్లో సిఐటియు, ఎఐటియుసి కలిసి పోటీ చేసి రెండు సార్లు విజయం సాధించాయి. ఒకసారి ఓడిపోయాయి. 2008 మొదటిసారి సిఐటియు, ఎఐటియుసిలు ఐక్య ప్యానల్‌గా పోటీ చేసి 60 శాతం ఓట్లు సాధించాయి. దానికి ముందు 2005 గుర్తింపు ఎన్నికల్లో సిఐటియుకు 4069 (35 శాతం) ఎఐటియుసికి 2429 (21 శాతం) ఓట్లు వచ్చాయి. అయినా గుర్తింపు యూనియన్ ఆఫీసు బేరర్లలో 55 శాతం మరియు 45 శాతం చొప్పున సిఐటియు, ఎఐటియుసిలు భాగస్వాములుగా వున్నాయి. తరువాత 50 శాతం సమాన హోదా ఇవ్వాలని పట్టుబట్టాయి. 2018 గుర్తింపు ఎన్నికల్లోను మూడు నెలల ముందు నుంచి సిఐటియు ఐక్యంగా ఎఐటియుసితో కలిసి పోటీ చేయడానికి ప్రయత్నించింది. ఎఐటియుసి నాయకత్వం స్పందించకపోవడంతో సిఐటియు స్వతంత్రంగా పోటీ చేయవలసి వచ్చింది. ఇతర కొన్ని చిన్న సంఘాలను కలుపుకున్నది. ఎఐటియుసి ముందు నుంచి వైఎస్ఆర్‌టియు వైపు మొగ్గు చూపింది. 2015లో 907 ఓట్లు తెచ్చుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులైన విజయ సాయిరెడ్డి, నాగిరెడ్డి ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. అయినా 2018లో ఎఐటియుసికి మూడవ స్థానం దక్కింది.

బిజెపి నాయకత్వం స్టీల్‌ప్లాంట్ ఎన్నికలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. రాష్ట్ర బిజెపి మంత్రి మాణిక్యాలరావు పర్యటించారు. స్థానిక ఎం.పి, ఎమ్మెల్సీలు హరిబాబు, మాధవ్ స్టీల్ ఎన్నికల్లో ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేశారు. ఆర్ఎస్ఎస్ అధికారుల అండదండలు పొందారు. కాని వారికి వచ్చిన ఓట్లు 126 మాత్రమే. గత 30 సంవత్సరాలలోను బిఎంఎస్‌కు వందకు లోపుగాను, లేదా వందకు కొంచెం పైగా మాత్రమే ఓట్లు వచ్చాయి. దేశంలో అన్ని భారీ పరిశ్రమలలోను వారికి ఎక్కడా బలం లేదు. దొంగ లెక్కలు చూపించి దేశంలో మొదటి సంఘంగా ప్రభుత్వ గుర్తింపు పొందింది. కాని శిఖండి పాత్రవహించి ప్రయివేటీ కరణకు అనుకూలంగా ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నది. కీలక సందర్భాలలో కార్మికులకు తీవ్రంగా ద్రోహం చేస్తున్నది. "బాల్కో, జింక్"లను ప్రయివేటీ కరించిన ఘనత వీరిదే. ప్రతి కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలో అరెస్సెస్ వారిని స్వతంత్ర డైరెక్టర్లుగా నియమిస్తున్నది. వారు పరిశ్రమల అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్నారు. వారితో బిఎంఎస్ లాలూచీ పడుతున్నది. విశాఖ పోర్టులో 8వ యూనియన్‌గా వున్న బిఎంఎస్‌ను గుర్తించడం కోసం 8 యూనియన్లను కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తున్నది. అధికారంలో వున్న బిజెపిని అడ్డం పెట్టుకొని తమ బలం పెంచుకోవాలని ప్రయత్నిస్తున్న ది. కాని కార్మిక వర్గానికి ద్రోహం చేస్తున్న బిజెపి దాని అనుకూల బిఎంఎస్‌కు విశాఖ స్టీల్ కార్మికులు తగిన విధంగా బుద్ధి చెప్పడం కార్మిక చైతన్యానికి నిదర్శనం.



గుర్తింపు ఎన్నికలు పూర్తి అయ్యాయి. కాని కార్మిక సంఘాల ముందు కేంద్ర ప్రభుత్వ దాడి ప్రధాన సవాల్‌గా వుంది.కార్మిక హక్కులపై దాడి చేస్తున్నది. విశాఖస్టీల్‌ను 10 శాతం ప్రయివేటీకరిస్తామని ప్రభుత్వం సవాల్ చేస్తున్నది. కుండకు కన్నం పడితే 10 శాతం వంద శాతం అవుతుంది. హిందుస్థాన్ జింక్ ఆ విధంగానే అయింది.

గుర్తింపు ఎన్నికలు పూర్తి అయ్యాయి. కాని కార్మిక సంఘాల ముందు కేంద్ర ప్రభుత్వ దాడి ప్రధాన సవాల్‌గా వుంది. బిజెపి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేయాలని, ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేట్‌పరం చేయాలని కయ్యానికి కాలు దువ్వుతున్నది. కార్మిక హక్కులపై దాడి చేస్తున్నది. విశాఖస్టీల్‌ను 10 శాతం ప్రయివేటీకరిస్తామని ప్రభుత్వం సవాల్ చేస్తున్నది. కుండకు కన్నం పడితే 10 శాతం వంద శాతం అవుతుంది. హిందుస్థాన్ జింక్ ఆ విధంగానే అయింది. 10 శాతం నుంచి ప్రారంభించి నేడు పూర్తిగా ప్రయివేట్‌పరం అయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్. అన్ని తరగతుల కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, ఆఫీసర్లకు కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్వహించడం ద్వారా ప్రయివేటీకరణ విధానాలను అడ్డుకోగలం. గుర్తింపు సంఘం బాధ్యతతో ఐక్య ఉద్యమాలు నిర్మించడానికి పూనుకుంటుందని హామీ ఇస్తున్నాం.

(రచయిత స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు (సిఐటియు)

చర్చ

మీ-సేవా అవినీతి!



రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేలకు పైగా మీ-సేవా కేంద్రాలు ఉన్నాయి. అయితే కొన్నిచోట్ల ఇవి అవినీతికి నిలయాలుగా మారాయి. సేవా రుసుము పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారు. డిజిటల్ ఇండియా, ఫైబర్ గ్రిడ్ పేర్లతో పారదర్శకంగా సేవలను అందించాల్సిన మీ-సేవా కేంద్రాలు బాధ్యత విస్మరిస్తున్నాయి. ప్రతి జిల్లాలో దాదాపు షుమారు 400 నుండి 500కి పైగా కేంద్రాలు ఉన్నాయి. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా వీటిని ఏర్పాటు చేశారు. విద్యుత్ బిల్లుల నుండి అడంగళ్ సర్వే నెంబరు తెలుసుకునే వరకు ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా వీటిని ఆశ్రయించక తప్పదు. మండల స్థాయిలో తహశీల్దార్, పట్టణాల్లో సర్వీసు ప్రొవైడర్లు, సమన్వయ కర్తలకు తనిఖీ అధికారాలు ఇచ్చినా పర్యవేక్షణ కొరవడింది. దీంతో అనేక జిల్లాల్లో మీసేవా కేంద్రాలు లంచాలకు నిలయాలుగా మారాయి. కొందరు మీ సేవా నిర్వాహకులు ఎక్కడపడితే అక్కడ దళారులను ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. మీ-సేవా సర్వీస్ ప్రొవైడర్లు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ నుంచి ఈ-గవర్నెన్స్ ద్వారా వీటిని పర్యవేక్షించాలన్న నిబంధన వుంది. అయినా ఏ జిల్లాలో కూడా తనిఖీలు చేయలేదు. ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదు. కొన్ని ధ్రువపత్రాల కోసం సేవా రుసుముకు అదనంగా నాలుగు రెట్లు వసూలు చేస్తున్నా ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆధార్ చిరునామా మార్పులు, వంటగ్యాస్ కనెక్షన్ తదితర సేవలకు కేవలం రూ.35లు మాత్రమే సేవా రుసుము వసూలు చేయాలి. ఈ వ్యవహారంలో మీసేవా నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కి ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్ చేయడానికి రూ.125లు నుండి రూ.150ల వరకు వసూలు చేస్తున్నారు. అర్హత లేని వారికి కూడా రాజకీయ పలుకుబడితో అనేక చోట్ల కేంద్రాలను ఇచ్చేశారు. దీంతో వివిధ సేవల కోసం వచ్చే వారికి చుక్కలు చూపిస్తున్నారు. దరఖాస్తుల్లో పేర్లు, చిరునామా ఇంగ్లీషులో తప్పుగా నమోదు చేస్తున్నారు. దీనివల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రాజధాని ప్రాంతాల్లోని మీసేవా కేంద్రాల్లో ఆపరేటర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధ్రువపత్రాలు మంజూరైన తరువాత కూడా వాటిని తీసుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. వాస్తవానికి ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలకు, కొత్త గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డులో మార్పులు, బదిలీలు, సభ్యుల చేరిక, జనన మరణ ఆలస్య రిజిస్ట్రేషన్, ఓ.బి.సి. ధ్రువ పత్రానికి, జనన మరణ ధ్రువపత్రాలకు (అదనపు పత్రానికి రూ.5/-) రూ.35, కరెంట్ అడంగళ్ సర్వే నెంబరు, ఓటరు గుర్తింపు కార్డులో మార్పులకు రూ.25, కొత్త పట్టాదారు పాసు పుస్తకం రూ.100, ఆధార్ నెంబరు వివరాలు పొందడానికి రూ.15లు వసూలు చేయాలి.

ఆన్‌లైన్ దోపిడీ!

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆన్‌లైన్ ద్వారా భవన నిర్మాణ అనుమతులు పొందే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ విధానం ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఎప్పుడు సర్వర్ ఉంటుందో తెలియని పరిస్థితి. దీనికితోడు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలంటే ముడుపులు చెల్లించాల్సిందే. కొంతమంది లైసెన్స్‌డ్ ఇంజనీర్లు ఆన్‌లైన్ విభాగంలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్లు, ఏ.సి.పి స్థాయి ఉన్నతాధికారి కుమ్మక్కై, ఒక్కొక్క భవనం అనుమతికి వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. గతంలో అనుమతులు నిరాకరించిన భవనాలకు సైతం ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేసేస్తున్నారు. ఇలాంటివి ప్రతి డివిజన్‌కు పదికి తక్కువ కాకుండా ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారుతున్నాయి. అంతేకాదు ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ ఆన్‌లైన్ మాన్యువల్ పొందవచ్చునని రిజిస్ట్రేషన్ అధికారవర్గాలు తెలియజేశాయి. అయితే ఇది ఆచరణలో సాధ్యం కాలేదు.

భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలంటే క్షేత్రస్థాయి తనిఖీలు చేయాల్సి వుంటుంది. అయితే ఆన్‌లైన్‌లో కేవలం పేపరు మీద జీవో ప్రకారం నిబంధనలు అన్నీ ఉన్నట్లు చూపిస్తే సరిపోతుంది. దీంతో సిబ్బంది డబ్బు తీసుకొని ఆన్‌లైన్‌లోనే అనుమతులు ఇస్తున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చిన భవనాలను తనిఖీ చేసేందుకు ప్రత్యేక రిస్క్యూ టీం గతంలో రాజధాని ప్రాంతాలలో పర్యటించింది. ఎప్పుడో డైరెక్టర్ ఆఫ్ టౌన్ & కంట్రీ ప్లానింగ్ శాఖ నేతృత్వంలోని రిస్క్యూ టీమ్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు. ఇది సాధ్యమా?

- జలీల్ ఖాన్
(రచయిత సెల్ : 9966651800)

జన వాక్యం

ఓట్ల కోసమే

తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ జిల్లాకి మినహాయింపు లేకుండా దళితులపై సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా దాడుల పరంపర కొనసాగుతోంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులే 'ఎవరు మాత్రం దళిత కులంలో పుట్టాలనుకుంటారు? దళితునిగా పుట్టాలనుకుంటారు?' అన్న వ్యాఖ్యలు చేసి కుల వివక్షను ప్రదర్శించారు. దీన్ని సాకుగా తీసుకొని ఆయన అనుయాయులు దళితులపై విరుచుకు పడుతున్నారు. రాష్ట్రంలో ఏదైనా ఒక దాడి జరిగిందన్న వార్తలు వచ్చాయంటే చాలు! అది దళితుల మీదా లేక దళిత మహిళ మీదా జరిగి ఉండొచ్చనే ఊహలకు అద్దంపట్టే విధంగా వుంది పరిస్థితి. ఇప్పటికీ కొన్ని దళిత పేటల్లో రోడ్లు లేవు. తాగునీరు లేదు. దళితులపైన ఇన్ని దాడులు జరుగుతుంటే వారికి రక్షణ కల్పించలేని ప్రభుత్వం 'దళిత తేజం' కార్యక్రమం నిర్వహిం చడంలో అర్థం ఏముంది? ఓటు బ్యాంకు రాజకీయం తప్ప మరింకేమి కాదన్నది అక్షర సత్యం. అందుకే ఇప్పటి కైనా పాలకుల కల్లబొల్లి కబుర్లకు, కపట రాజకీయాలకు మోస పోకుండా దళితులందరూ ఐక్యమవ్వాలి. సామాజిక ఉద్యమాలను తీవ్రం చేయాలి. అప్పుడు మాత్రమే ప్రభుత్వ మోసకారితనాన్ని బట్టబయలు చేయగలుగుతాం.

రాకోటి ఆనంద్, కెవిపియస్ జిల్లా కార్యదర్శి, విజయనగరం.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

చర్చ

సెక్యులర్ దేవుడి దగ్గర బిజెపి మత చిచ్చు

తిరుమల-తిరుపతి దేవస్థానాన్ని కేంద్రంగా చేసుకుని భారతీయ జనతాపార్టీ, సంఘ్ పరివార శక్తులు మత చిచ్చును రేపటానికి పథకం ప్రకారం పావులు కదుపుతున్నాయి. గత కొన్నేళ్లుగా అనేక ప్రయత్నాలు చేసి విఫలమైన బిజెపి, తాజాగా అన్యమతస్తులు ఉద్యోగులుగా టిటిడిలో ఉండరాదని రాద్ధాంతం చేస్తోంది. ఈ రాద్ధాంతానికి టిటిడి ఉద్యోగులకు ఇ.ఓ అనిల్ కుమార్ సింఘాల్ ఇచ్చిన నోటీసులు ఆజ్యం పోశాయి.

టిటిడి యాజమాన్యం 45 మంది ఉద్యోగులను హైందవేతరులుగా గుర్తించి ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించరాదో మూడు వారాలలో తెలియజేయాలని షోకాజ్ నోటీసును జారీ చేసింది. తొలగించటానికి పూనుకున్న ఉద్యోగులలో 36 మంది ముస్లింలు, 9 మంది క్రైస్తవులు ఉన్నారు. హిందువులు కాదని తెలిసే టిటిడి యాజమాన్యం వీరిని ఉద్యోగులుగా తీసుకున్నది. వీరిలో రాబోయే 6 నెలల్లో రిటైరయ్యేవారు, 28 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా ఉండటం విశేషం. పైగా వీరు తమ మతాన్ని, కులాన్ని దాచిపెట్టుకుని ఉద్యోగాలు పొందలేదు. ఇప్పుడు జి.ఓను సాకుగా చూపి నియామకమే వివాదమైందని, తొలగించి తీరాల్సిందేనని యాజమాన్యం పట్టుబడుతున్నది. జి.ఓ రాకముందే నియమితులైన ఉద్యోగులను ఇప్పుడు జి.ఓ పేరు చెప్పి తొలగించాలనుకోవటం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. 1989లో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి మత క్రతువులలో హిందూయేతరులు ఉండరాదని జి.ఓ తెచ్చారు. 2007లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం టిటిడి నిధులతో నడిచే సంస్థలలో హిందూయేతరుల నియామకం వద్దని జి.ఓ ఇచ్చారు. జి.ఓలో టిటిడి నియమ నిబంధనలు వృత్తి రీత్యా అమలు జరపాలని స్పష్టంగా పేర్కొన్నారు.



కందారపు మురళి

అయితే జి.ఓలు రాకముందే టిటిడిలో ఉద్యోగ, నియామకాలు జరిగాయి. టిటిడిలో అన్యమతస్తులు అనేక మంది గతం నుంచి పని చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బిజెపిలు ఓ పథకం ప్రకారం దాడి చేస్తుండటంతో పై జి.ఓలు వెలువడ్డాయి.

అయితే ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలలో స్వామి వారికి నిర్వహించే సేవలలో 'బ్యాక్ సవారీ' ముఖ్యమైంది. అంటే దేవుడి ఉత్సవ విగ్రహాలు వెనుకకు నడిపిస్తారు. ఈ సేవను ప్రవేశపెట్టింది ముస్లిం రాజులే. ముస్లిం రాజులు స్వామి వారికి భక్తితో సమర్పించిన ఆభరణాలను ఇప్పటికీ అలంకరిస్తున్నారు. నాదస్వర బ్రహ్మగా పేరు గాంచిన సుభాన్ కాశీం ఇప్పటికీ తిరుమల ఆస్థాన విద్వాంసుడుగా కొనసాగుతున్నారు. స్వామివారి క్యాలండర్లలో, చిత్రపటాలలో కనిపించే నిలువెత్తు విగ్రహ నమూనాను తయారు చేసిందీ ఓ ముస్లిమే. తిరుపతి గాలి వీధికి చెందిన పటాల గౌస్ సాహెబ్, మహంతుల కాలంలో వెంకటేశ్వర స్వామి చిత్ర పటాలను అమ్మేవారు. స్వామివారికి నైవేద్యం సమర్పించే 'మన్రో గంగాళం' బ్రిటిష్ కాలంలో కడప కలెక్టర్‌గా ఉండి రాయలసీమ జిల్లాలకు ఇన్‌ఛార్జిగా పని చేసిన 'మన్రో' అందజేసింది. ఈయన క్రైస్తవుడు. ఇప్పటికీ మన్రో గంగాళంలోనే స్వామివారికి నైవేద్యం సమర్పించటం ఆనవాయితీ.

తిరుమల స్వామి వారి గోపురం 'ఆనంద నిలయం'కు బంగారు లేపనాన్ని పూసింది తిరుపతి బజారు వీధికి చెందిన టింకరింగ్ పని చేసే



రహీం సాహెబ్. జవ్వాద్ హుస్సేన్ తెలుగు లెక్చరర్‌గా టిటిడి కళాశాలలో పని చేశారు. ఈయన స్వామి వారిపై 700 పేజీల రచనతో పాటు తిరుమల శ్రీవారి వైభవం గురించి పుస్తకాలు రాశారు. జవ్వాద్ హుస్సేన్ మధురమైన తెలుగుకు పెట్టింది పేరు. ఆయన పేరు తెలియని సాహితీ ప్రియులు లేరు. ఆయన తదనంతరం ఆయన కుమారుడు ముస్తాక్ టిటిడిలో ఉద్యోగం పొందారు. ఈయనకు టిటిడి తొలగింపు నోటీసులు ఇచ్చింది. సయ్యద్ భాషా ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో డ్రైవర్. ఈయన తండ్రి సైన్యంలో ఉండి పాకిస్తాన్‌పై యుద్ధం చేసి రాష్ట్రపతి అవార్డ్ పొంది ఉద్యోగం సాధించారు. ఈయన గతించిన తరువాత ఆ ఉద్యోగాన్ని భాషా పొందారు. ఈయనకూ నోటీసు అందింది. సెక్యూరిటీ విభాగంలో పని చేస్తున్న ఆలాం ఆలీ దేశమంతటా తిరిగి శ్రీవారి వైభవాన్ని నాటక రూపంలో ప్రజలకు చాటారు. బర్డ్ ఆసుపత్రిలో పనిచేస్తున్న రషీద్, పగడాల భాగ్యమ్మలు కూడా భక్తులే. ప్రతి శనివారం ఆస్పత్రిలో స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంచుతారు. వీరి పిల్లలు, కుటుంబ సభ్యులు హిందూ సాంప్రదాయాలను పాటిస్తారు. వీరికి కూడా నోటీసులు అందించారు. సందీప్ అనే యువకుడు తిరుమలలో సాంప్రదాయ హిందూ వివాహాన్ని చేసుకున్నారు. తల్లి, తండ్రి హిందువులే. స్కూల్‌లో విద్యాభ్యాసం కోసం క్రిస్టియన్‌గా రాయించారు. తాను హిందువుగా మారటానికి సకల ప్రయత్నాలు చేశారు. పీఠాధిపతుల్ని కూడా కలిశారు. హిందువు కాలేకపోయారు. ఈయనకు టిటిడి నోటీసులిచ్చింది.

టిటిడి నియమాలను పాటించాలని జి.ఓలో ఉంది. నోటీసు అందుకున్న 45 మంది ఉద్యోగులు టిటిడి నియమాలను పాటిస్తామని గతంలోనే ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకార పత్రంపై సంతకాలు చేశారు (ఈ ప్రమాణం టిటిడి ఉద్యోగులందరూ విధిగా చేయాలి). ప్రతి శనివారం పంచెలు కట్టుకుని విధులకు హాజరవుతారు. టిటిడి నియమ నిబంధనలను పాటిస్తున్నా టిటిడి యాజమాన్యం నోటీసులివ్వటమేంటని రిటైర్డు జిల్లా జడ్జి పెనుమూరు గుర్రప్ప ప్రశ్నించారు. అసలు జి.ఓ జారీ చేయటమే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ జి.ఓలను కోర్టులో ఛాలెంజ్ చేయాలని సూచించారు. సంఘ్ పరివార్ శక్తులు అదే పనిగా శ్రీవారిని హిందూ దేవుడిగా ప్రచారం చేస్తుండటం అన్యాయం. ఇతర మతస్తులు దర్శనం చేసుకోవచ్చు కానీ, స్వామివారి భక్తులుగా టిటిడిలో ఉద్యోగం చేయకూడదని తిరకాసు మాటలు చెబుతున్నారు. అయినా ఇన్ని రోజులు రాని ఈ సమస్య ఇప్పుడెందుకు వచ్చిందనే చర్చ మొదలైంది. టిటిడి ఇ.ఓలుగా గతంలో హేమాహేమీలైన సీనియర్ ఐఎఎస్‌లు ఉన్నప్పుడు చేయలేని దుస్సాహసానికి ప్రస్తుత ఇ.ఓఅనిల్ కుమార్ సింఘాల్ ఎందుకు ఒడిగట్టారనే చర్చ జరుగుతోంది.

అసలు ఇ.ఓ సింఘాల్ నియామకమే వివాదాస్పదమైంది. బిజెపి వత్తిడి మేరకు ఉత్తరాదికి చెందిన ఐఏఎస్‌ను నియమించారని కొందరు సీనియర్ అధికారులు ప్రస్తావించారు. ఈ వివాదం ఇంకా సమసిపోలేదు. ఇ.ఓగా సింఘాల్ బాధ్యతలు తీసుకునే రోజున సంఘ్ అధినేత ప్రవీణ్ తొగాడియా తిరుపతి రావటం, ఇ.ఓతో సమావేశం కావటం పత్రికలలో వార్తలు రావటంతో ఇ.ఓ ద్వారా సంఘ్ పరివార్ శక్తులు మత చిచ్చుకు ఆజ్యం పోస్తారేమోనన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఇప్పుడు అది వాస్తవ రూపం దాల్చింది. హిందూయేతరులు టిటిడిలో ఉద్యోగాలు చేయకూడదని బిజెపి నేతలు ఇ.ఓకు వినతి పత్రం ఇవ్వటం విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్‌లు ప్రకటనలు చేయటం ఇ.ఓఅనిల్ సింఘాల్ వెంటనే నోటీసులు ఇవ్వటంతో దీని వెనుక సంఘ్ పరివార్ శక్తుల కుట్ర ఉందని స్పష్టంగా అర్థమైంది.

బిజెపి అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత మత వైషమ్యాలను తిరుపతిలో పెంచటానికి అదే పనిగా ప్రయత్నాలు చేసింది. తిరుపతి నగరాభివృద్ధిలో భాగంగా భూగర్భ డ్రయినేజి నిర్మాణానికి టిటిడి నిధులు రూ.25 కోట్లు వెచ్చించటాన్ని సవాలు చేస్తూ కోర్టుకెక్కి నిలుపుదల చేయించారు. కోర్టు కేసు కొట్టి వేసింది. రూ.25 కోట్లు ఖర్చు కాస్తా రూ.100 కోట్లకు చేరుకుంది. ఐవైఆర్ క్రిష్టారావు ఇఓగా ఉన్న సమయంలో టిటిడి ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు యాజమాన్యం ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు కెక్కింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో వ్యాజ్యం నడుపుతున్నది. చంద్రగిరిలో పేద ముస్లిం బాలికలకు చదువు నేర్పిస్తున్న విద్యా సంస్థను తీవ్రవాద కేంద్రమని ప్రచారం పెట్టి ఆ స్కూలును కొట్టివేయాలని హిందూ-ముస్లింల మధ్య ఘర్షణలు సృష్టించాలని ప్రయత్నించింది. తిరుమల ఏడు కొండలను రెండు కొండలుగా చేయాలన్న కుట్ర సాగుతున్నదని, కొండపై చర్చి నిర్మాణం జరుగుతున్నదని, మెట్లదారిలో ఏసుక్రీస్తు శిలువ పెట్టారని తప్పుడు ప్రచారాలను చేశారు. కరపత్రాలను పంచారు. తిరుచానూరు మాస్టర్ ప్లాను పనులు చేపట్టినపుడు ఆ ప్రాంతంలోని మసీదులు, చర్చిలు పడగొట్టాలని ఉద్రిక్తతను పెంచారు.

తిరుపతి వాసులకు వాస్తవం అర్థం అయినా ఈ సమస్యలపై కర్ణాటక రాష్ట్రంలో, ఢిల్లీలో ప్రదర్శనలు జరిగాయి. సంఘ్ పరివార్ శక్తులు ఒక పథకం ప్రకారం తిరుపతిని అయోధ్యలాగా మార్చి దేశమంతటా మత ఉద్రిక్తతలు పెంచాలన్న కుట్ర వీరి మదిలో ఉంది. తాజా పరిణామాలు ఇందుకు ఊతమిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తతతో లేకుంటే ఈ పరివారం ప్రశాంతతకు మారు పేరుగా ఉన్న తిరుపతిలో చిక్కులు సృష్టించవచ్చు. బహుపరాక్.

(రచయిత టిటిడి ఉద్యోగుల పరిరక్షణ వేదిక కన్వీనర్)

ఆడపిల్లల్లో ఈ ధైర్యమే కావాలి!



ఈ నెల 5, 6 తేదీలలో 'తరుణీ తరంగాల' ఆధ్వర్యంలో ఉమెన్ ఫెస్ట్ విజయవాడలోని సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాలలో జరిగాయి. ఈ ఫెస్ట్‌లో సాహిత్య సాంస్కృతిక విభాగాల్లో వందలాది మంది విద్యార్థినులు, మహిళలు తమ సృజనాత్మకతను వెలువరించారు. రేపటి మహిళలైన విద్యార్థినులు అత్యధిక సంఖ్యలో కథా, కవితా, వ్యాసరచనలో పాల్గొనడం ఆహ్వానించదగిన విషయం. ఈ తరానికి తరుణీతరంగాలు మంచి వేదిక ఇచ్చింది. ఈ యువతకు సాహిత్య శిక్షణ అందిస్తే భవిష్యత్తులో గొప్ప రచయితలు, కవయిత్రులు అవుతారనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకు నిలువెత్తు నిదర్శనమే ఈ కవిత. పేద ఇంట్లో పుట్టిన డి.లక్ష్మీ ప్రవళిక ఇంత గొప్ప కవితను వెలువరించి, ప్రథమ బహుమతిని సంపాదించింది. తన తొలికవితలోనే ఇంత గాఢమైన భావాన్ని వ్యక్తీకరించడం చెప్పుకోదగ్గ విశేషం.

తన కష్టాలు, చుట్టూ జరిగే సంఘటనలు నిత్యం టీవీల్లో, పేపర్లో చూస్తూ, బాగా విశ్లేషిస్తుంటుందనీ.. అందుకే ఇంత బాగా రాయగలిగిదనీ ఆమె తల్లి ధనలక్ష్మి 'జీవన'తో చెప్పారు. ఇంట్లో అమ్మకూ ఎదురయ్యే కష్టాలకు కుంగిపోవద్దంటూ ధైర్యమిస్తుందనీ,



తండ్రి శ్రీనివాస్‌కీ సలహాలు ఇస్తుంటుందనీ తల్లి సగర్వంగా చెప్పారు. లక్ష్మీ రాసిన కవిత.. యావత్తు స్త్రీ లోకానికే స్ఫూర్తివంతంగా నిలిచింది. అత్యాచారాలు, అఘాయిత్యాలు జరిగినప్పుడు స్త్రీ కుంగిపోకుండా, ధైర్యంగా ఎదుర్కోవాలనే లక్ష్మీ ప్రవళిక అభిలాష. ఇంత గొప్ప సందేశాన్ని తన కవితతో చెప్పిన లక్ష్మీ ప్రవళిక భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఎదగాలనీ, గొప్ప కవయిత్రిగా, రచయిత్రిగా ఎదగాలని కోరుకుందాం.

- శాంతిశ్రీ

ఈ ధైర్యం చాలు

ఎవరిచ్చారు? ఎవరిచ్చారు? నీకీ అధికారం?
నా జీవితం నాది కాకుండా చేసిన నీ కండకావరం!!
నా జీవితం నాశనం చేసినరోజు
నీ జీవిత పతనానికి మొదటిరోజు
నా కంటి నుండి జారే ప్రతి అశ్రువు
నీ ఒంటి నుండి కారబోయే రక్తపుచుక్కలతో సమానం
ఏదో సాధించానని ఎగిరిపడకు
నా నిస్సహాయత నా ఓటమి అని అనుకోకు
నీ అమ్మలోను నేనే...
నీ అక్కలోను నేనే..
నీ చెల్లిలోను నేనే..
నీ పిల్లలోను నేనే..
ఈ విశ్వం మొత్తం నేనే!!
నా నుంచి తప్పించుకున్నావని మురిసిపడకు
దేవుడి నుంచి తప్పించుకోలేనని బాధపడు
నా జీవితం నీ వలన ముక్కలైంది అని బాధపడను
దాన్ని అతికించుకునే శక్తి నా దగ్గరే ఉందని గర్వపడతా
నా మానాన్ని భంగం చేసిన నీ చేతులు
నా మనసును భంగం చేయని నీ చేష్టలు
ఈ ధైర్యం చాలు ఈ జీవితానికి !
నీ జీవితాన్ని ఎండకట్టడానికి !!

డి. లక్ష్మీ ప్రవళిక
కెబిఎన్ కాలేజీ
బిఎస్‌సి సెకండియర్
ఫోన్: 9177571822

మీ కోసం

క్యారెట్ ఎండిపోయినట్లు అనిపిస్తే ఉప్పు వేసిన నీటిలో గంటసేపు ఉంచి, తీస్తే తాజాగా ఉంటాయి.



జీవన సౌరభం

సమస్య వెనుక సమాధానం
దుఃఖం వెనుక సుఖం
ప్రతి కష్టం వెనుక ఒక అవకాశం
ఎప్పుడూ ఉంటుంది.

నోరూరించే పండు పచ్చళ్లు



పండు మిరపకాయ పేరు వింటేనే నోరు మండిపోతుంది... అలాగే నోరూరిపోతుంది కూడా. ఇక మనసు ఊరుకుంటుందా? సుర్రుమనే ఆ ఘాటును ఒక్కసారి రుచి చూడాలనిపిస్తుంది. ఎంతకారంగా ఉన్నా వేడి వేడి అన్నంలో కాస్తంతా ఎర్రకారం పచ్చడి, నెయ్యి తగిలిస్తే ఆ రుచే వేరు. ఆవురావురమంటూ నాలుగు ముద్దలు కళ్ల వెంట నీళ్లు కారుతున్నా లాగించేస్తాం. నోరు బాగోనప్పుడో, ఇంట్లో కూర వండనప్పుడో పండుమిరప పచ్చడుంటే చాలు. చకచకా అన్నం లాగించేయొచ్చు. ఇంకా గోంగూర, కొబ్బరి, చింతకాయ, టమాటా ... వంటి వాటితో పండుమిరపను కలిపి పట్టే పచ్చళ్లు ఎలా తయారుచేయాలో చూద్దాం పదండి.

మునక్కాయతో



కావల్సిన పదార్థాలు: పండుమిర్చి ముక్కలు- కప్పు, మునక్కాయ ముక్కలు-కప్పు. మెంతులు- టేబుల్ స్పూను, వెల్లుల్లి రెబ్బలు-9, ఉప్పు- రుచికి సరిపడా, నానబెట్టిన చింతపండు-కప్పు, నూనె- అర కప్పు, ఆవాలు- టేబుల్ స్పూను, కరివేపాకు-కొద్దిగా.

తయారుచేసే విధానం: పొయ్యిపై పాన్ పెట్టి అందులో రెండు టేబుల్ స్పూన్ల నూనె, పండుమిర్చి ముక్కలు, మెంతులు, మూడు వెల్లుల్లి రెబ్బలు, టేబుల్ స్పూను ఉప్పు వేసి వేగనివ్వాలి. వేయించిన పండుమిర్చి మిశ్రమాన్ని, చింతపండునీ మిక్సీజార్‌లో వేసి పేస్టు చేసుకోవాలి. ఇప్పుడు పాన్‌లో నూనె వేడిచేసి అందులో ఆవాలు, కరివేపాకు రెమ్మలు, మిగిలిన వెల్లుల్లి రెబ్బలు, మునక్కాయ ముక్కలు వేసి, బాగా వేగనివ్వాలి. ఇందులోకి ముందుగా మిక్సీ చేసి పెట్టుకున్న పండుమిర్చి పేస్టు, ఉప్పు వేసి కలపాలి.

ఇలా తయారైన మిశ్రమాన్ని ఓ జాడీలోకి తీసి పెట్టుకోవాలి. రెండు, మూడు రోజుల తర్వాత జాడీలోంచి తీసి అన్నంలో వేసుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది.

గోంగూరతో



కావలసిన పదార్థాలు: గోంగూర - కేజీ, పండుమిర్చి - 300గ్రా., చింతపండు - 250 గ్రా, ఉప్పు -తగినంత, ఇంగువ - టీ స్పూను, వెల్లుల్లి రేకలు - ఆరు, పసుపు - టీ స్పూను, మెంతులు - మూడు టీ స్పూన్లు, నూనె - పావుకేజీ

తయారుచేసే విధానం: మెంతులను దోరగా వేయించి, పొడి చేసి పక్కన ఉంచాలి. పండుమిర్చిని శుభ్రంగా కడిగి, తడిపోయేవరకూ ఆరనిచ్చి, తొడిమలు తీసి, మిక్సీలో వేసి, మెత్తగా చేసి పక్కన ఉంచాలి. చింతపండు కూడా శుభ్రం చేసి పక్కన ఉంచాలి. గోంగూరను శుభ్రంగా కడిగి, తడిపోయేవరకూ ఆరబెట్టాలి. పాన్‌లో కొద్దిగా నూనెవేసి, కాగాక గోంగూర వేసి వేయించాలి. దీన్ని చల్లారాక మిక్సీ చేసుకోవాలి. ఒక పెద్ద పాత్రలో మెత్తగా చేసి ఉంచుకున్న పండుమిర్చి, గోంగూర, చింతపండు వేసి వాటికి ఉప్పు, వెల్లుల్లి రేకలు, పసుపు, మెంతిపొడి వేసి బాగా కలపాలి. పాన్‌లో నూనె వేసి కాగాక, ఇంగువ వేసి, దించేసుకోవాలి. ఇది చల్లారిన తరువాత పచ్చడిలో వేసి బాగా కలిపి, జాడీలో నిల్వ చేసుకోవాలి. వాడుకునే ముందు కావల్సినంత తీసుకుని, తాలింపు వేసుకోవాలి. అప్పుడు తాజాగా, రుచిగా బాగుంటుంది.

కొబ్బరితో



కావలసిన పదార్థాలు: పండుమిర్చి - 200గ్రా, కొబ్బరితురుము - కప్పు, వెల్లుల్లి రేకలు - 10, అల్లం తురుము - టీ స్పూను, ఆవపొడి - అరకప్పు, ఎండుమిర్చి - ఆరు, ఆవాలు - టేబుల్ స్పూను, పసుపు - టీ స్పూను, చింతపండు - కొద్దిగా, మెంతిపొడి - అరటేబుల్ స్పూను, పల్లీనూనె - 300 మి.లీ., ధనియాలపొడి - టీ స్పూను, జీలకర్ర పొడి - టీ స్పూను, ఉప్పు - తగినంత, ఇంగువ - టీ స్పూను

తయారుచేసే విధానం: పండుమిర్చిని శుభ్రంగా కడిగి, ముక్కలుగా కట్ చేసుకోవాలి. పాన్‌లో మూడు టేబుల్‌స్పూన్ల నూనె వేసి, కాగాక పండుమిర్చి ముక్కలు, కొబ్బరితురుము వేసి వేయించాలి. చల్లారాక, ఉప్పు జత చేసి మిక్సీ పట్టాలి. అల్లం తురుము, చింతపండూ జత చేసి, మెత్తగా చేసి పక్కన ఉంచాలి. పాన్‌లో నూనె వేసి కాగాక ఆవాలు, వెల్లుల్లి రేకలు, ఇంగువ, ఎండుమిర్చి వేసి వేయించాలి. దీనిలో పండుమిర్చి, కొబ్బరిపేస్ట్ వేయాలి. చివరగా ఆవపొడి, మెంతిపొడి ధనియాలపొడి, జీలకర్ర పొడి, పసుపు వేసి, కలిపి కొద్దిసేపయ్యాక దింపేయాలి. చల్లారాక జాడీలో భద్రపరచుకోవాలి.

పండుమిర్చి గుత్తి పచ్చడి



కావలసిన పదార్థాలు : పండుమిర్చి -మూడు కేజీలు, వాము - 100గ్రా, జీలకర్ర - 100 గ్రా, సోంపు- 100 గ్రా, ఎండుమిర్చి - 100 గ్రా. మెంతులు - 100 గ్రా, ఇంగువ - టేబుల్ స్పూను, కలౌంజీ - 100 గ్రా, ఉప్పు - 200గ్రా, ఆమ్‌చూర్ - 150 గ్రా, ఆవనూనె - కేజీ, వైట్ వెనిగర్ - 200మి.లీ.

తయారుచేసే విధానం : పండుమిర్చిని శుభ్రంగా కడిగి, తడి పోయేవరకూ గాలిలో ఆరబెట్టి, తొడిమలు తీసేయాలి. గింజలు తీసి పక్కన ఉంచాలి. పాన్‌లో వాము, జీలకర్ర, సోంపు, ఎండుమిర్చి, మెంతులు వేసి వేయించి, చల్లారాక మిక్సీలో వేసి పొడి చేయాలి ఉప్పు, ఆమ్‌చూర్ జతచేసి మరోమారు మిక్సీ పట్టాలి. పండుమిర్చి గింజలనూ మిక్సీలో వేసి, మెత్తగా చేసి పక్కన ఉంచాలి. రెండు పొడులకు కలౌంజీ జత చేసి, ఆవనూనె, వైట్ వెనిగర్ వేయాలి. (వీటిని కలిపేటప్పుడు గ్లౌజ్ వేసుకుంటే మంచిది. లేదంటే చేతులు మండుతాయి) నూనె, ఇంగువ వేసి బాగా కలిపి, ఈ మిశ్రమాన్ని రెండు మూడు రోజులు ఎండలో ఉంచాలి. ఈ మిశ్రమాన్ని కట్ చేసి ఉంచుకున్న పండుమిర్చిలో స్టఫ్ చేసి, నాలుగు రోజులు ఎండలో ఉంచాక, మిగిలిన నూనెను వాటి మీద పోసి జాడీలో నిల్వ చేసుకోవాలి. వేడి వేడి అన్నంలోకి చాలా బాగుంటాయి.

చింతకాయతో



కావలసిన పదార్థాలు: పండుమిర్చి - 100 గ్రా, చింతకాయలు - 100 గ్రా, శనగపప్పు - టీ స్పూను, జీలకర్ర - అర టీస్పూను, కరివేపాకు - ఒక రెమ్మ, వెల్లుల్లి రెబ్బలు - ఐదు, ఇంగువ - చిటికెడు, ఆవాలు - అర టీ స్పూను, నూనె - రెండు టేబుల్ స్పూన్లు, ఎండుమిర్చి - రెండు, ఉప్పు- 25 గ్రా. పసుపు - టీ స్పూను, మినపప్పు - టీ స్పూను

తయారుచేసే విధానం : చింతకాయలను కడిగి ఆరబోసి, తడి పోయాక దంచి, గింజలు, ఈనెలు, పైతొక్క వేరు చేయాలి. పండుమిర్చిని శుభ్రంగా కడిగి, తడిపోయేవరకూ ఆరనిచ్చి, తొడిమలు తీసి, మిర్చిని మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. చింతకాయల పేస్ట్, ఉప్పు, పసుపు, వెల్లుల్లి రెబ్బలు వేసి మరోమారు తిప్పి తీసేయాలి. పాన్‌లో నూనె కాగాక ఆవాలు, జీలకర్ర, మినపప్పు, శనగపప్పు, ఎండుమిర్చి వేసి బాగా వేగాక, ఇంగువ, కరివేపాకు జత చేసి, వేగాక పచ్చడిలో వేసి కలపాలి.

విటమిన్- సి అధికం

పండుమిర్చిలో కెరోటినాయిడ్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఇవి యాంటీఆక్సిడెంట్స్‌గా పనిచేస్తాయి. వీటిలో విటమిన్-సి 200 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. పండుమిర్చి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది చింతకాయ కాంబినేషన్‌లో మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అంతేకాక ఎక్కువ పోషకాలను శరీరానికి ఇస్తుంది. దీనిలో టమాటా కాంబినేషన్ యాంటీ క్యాన్సర్‌గా పనిచేస్తుంది. కొబ్బరి కాంబినేషన్‌లో పొట్టచుట్టూ కొవ్వు తగ్గడానికి ఉపయోగపడుతుంది.



- జానకి బడుగు,
పోషకాహార నిపుణులు.

పర్వతాల దారుల్లో .. రైట్ రైట్ !

సమతలంగా ఉన్న దారిలో ఎలాంటి వాహనాన్నైనా నడుపుకొంటూ రాకపోకలు సాగించడం చాలా సులభం. అదే ఎగుడుదిగుడుగా ఉంటే కొంత కష్టమైనా ఫర్వాలేదు. కానీ ఎత్తయిన కొండ మీదున్న రహదారైతే చాలా కష్టమే.



దానిపై వాహనాన్ని నడపడం. ఎందుకంటే అది వంకర టింకరగా ఉండడమే కాదు, వంపూ ఎక్కువగానే ఉంటుంది. దీంతో ఆ రోడ్డుపై సాధారణ కార్ల వంటి వాహనాల్లో ప్రయాణించాలన్నా, అసలు ఎలాంటి వాహనాలను నడపాలన్నా గుండెల్లో గుబులు పుట్టకతప్పదు. చాలా అప్రమత్తంగా వాహనాన్ని నడపాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అదుపు తప్పి, వేల అడుగుల లోతు లోయలో పడిపోవాల్సిందే. అందుకనే ఆ ప్రాంతంలో వాహనాల్లో ప్రయాణించే వారు దారి పొడవునా జంకుతూనే ఉంటారు. అలాంటిది ఆ రోడ్డుపై ఇక భారీ వాహనాలను నడిపేవారికి ఎంతటి భయం ఉంటుందో మనం ఇట్టే అర్థంచేసుకోవచ్చు. అయినప్పటికీ ఎలాంటి జంకూ లేకుండా ఆ మహిళ ఏకంగా భారీ ట్రక్‌ను నడిపిస్తోంది. అక్కడి పురుష డ్రైవర్లే విస్తుపోయేలా తన చాకచక్యాన్ని ప్రదర్శిస్తోంది.

ఆమె పేరు పూనమ్ నెగి. వయస్సు 23 సంవత్సరాలు మాత్రమే. కానీ ట్రక్ డ్రైవింగ్‌లో మాత్రం చాలా ఎక్స్‌పర్ట్. ఎన్నో సంవత్సరాలుగా ట్రక్ నడిపే పురుష డ్రైవర్లకే ఆమె సవాల్ విసురుతోంది. ఎందుకంటే ఆమె ఉంటున్న హిమాచల్‌ప్రదేశ్ ప్రాంతంలోని ఖార్‌దుంగ్‌లా పాస్ అనే పర్వతశ్రేణిపై రహదారి 17,582 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఆ రహదారి అంత ఎత్తులో ఉండడంతో చాలా భయాన్ని కలిగిస్తుంటుంది. ట్రక్ డ్రైవర్లు అయితే ఆ రహదారిపై వెళ్లడానికి సాధారణంగా అయితే సాహసం చేయరు. కానీ పూనమ్ నెగ్గి మాత్రం అలా కాదు. ఆ రహదారిపై చాలా అలవోకగా వెళ్తుంది. అంతటి డ్రైవింగ్ స్కిల్ ఆమె సొంతం. అది కూడా ఆమె భారీ ట్రక్కును నడిపిస్తుంది. దీంతో ఆమె ధైర్యానికి, డ్రైవింగ్ స్కిల్‌కు తోటి పురుష డ్రైవర్లు మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు.



ఇప్పుడు పూనమ్ నెగి భారీ ట్రక్కులను పర్వతాలపై అవలీలగా నడుపుతూ పేరు తెచ్చుకుంది.. కానీ ఒకప్పుడు ఆమెను చూసి అంతా నవ్వారు. కారణమేమిటంటే సాధారణంగా ట్రక్ డ్రైవింగ్ అంటే మన దేశంలో ఎక్కువగా పురుషులే అందులో పనిచేస్తారు. మహిళలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటిది ఓ మహిళ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడం.. భారీ ట్రక్ డ్రైవింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవడంతో చుట్టుపక్కల ఉన్న వారు మొదట్లో ఎగతాళి చేశారు. అయితే ఇప్పుడు ఆమె డ్రైవింగ్ స్కిల్ చూసిన తరువాత నవ్వినవారే ఆమెను మెచ్చుకుంటున్నారు. ఇక పూనమ్ యాక్సిడెంట్లు ఎక్కువగా అయ్యే సిమ్లా కిన్నార్ హైవేపై కూడా చాలా అవలీలగా ట్రక్‌ను నడిపేస్తున్నారు. అక్కడ పక్కనే సట్లజ్ నదీ ప్రవాహమూఎక్కువగానే ఉంటుంది. అయినా పూనమ్ ట్రక్‌లో దూసుకెళ్తుంది. దీంతో ఆమె ఇప్పుడు అక్కడ ఓ సెలబ్రిటీలా అయిపోయింది. పూనమ్ ధైర్యాన్ని, ట్రక్ డ్రైవింగ్ నైపుణ్యాన్ని మనమూ అభినందిద్దాం. ★

సెన్సెక్స్ ⬇ 516
34,195

నిఫ్టీ ⬆ 168
10,499

రూపాయి ⬆ 18 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.25

కార్పొరేట్ల కోసం..

పరిశ్రమ వర్గాలకు 2015లో ఇచ్చిన హామీ మేరకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి దశల వారిగా తగ్గిస్తామని మంత్రి అరుణ్ జైట్లీ హామీ ఇచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన ఫిక్కీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌లో మంత్రి మాట్లాడుతూ అయితే కార్పొరేట్ వర్గాలకు ఇచ్చే ప్రోత్సాహకాలు అన్నీ ముగిసిన తర్వాతే ఇది సాధ్యపడుతుందన్నారు.



ఎగిసిన బంగారం

40వేలకు చేరిన వెండి

ముంబయి : ప్రపంచ మార్కెట్లలో బలహీన పరిణామాలు చోటు చేసుకోవడంతో బంగారంపై పెట్టుబడులు పెరుగుతు న్నాయి. ఇదే క్రమంలో దేశీయంగా వచ్చే పెళ్లిళ్ల సీజన్ అవసరాల నిమిత్తం స్థానిక వర్తకులు కూడా ముందస్తు అవసరాల కోసం పసిడి కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో మంగళవారం బంగారం ధర 14 మాసాల గరిష్ఠ స్థాయికి చేరింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.330 పెరిగి వరుసగా రూ.31,600, రూ.31,450కు చేరింది. 2016 నవంబర్ 19న బంగారం ధర ఈ స్థాయిలో నమోదయ్యింది. కిలో వెండిపై రూ.500 ప్రియమై రూ.40,000కు చేరింది. అంతర్జాతీయంగా వరుసగా నాలుగో సెషన్‌లోనూ బంగారం ధర పెరిగి ఒక్క ఔన్స్ ధర 1,340 డాలర్లకు చేరింది.

డిమాండ్‌లో 9% వృద్ధి

గతేడాది భారత్‌లో పసిడికి 9శాతం డిమాండ్ పెరిగిందని ప్రపంచ బంగారం కౌన్సిల్ (డబ్ల్యూజిసి) ఒకన నివేదిక వెల్లడిం చింది. ఈ రిపోర్టు ప్రకారం 2017లో 727 టన్నుల బంగారం క్రయ విక్రయాలు జరిగాయి. 2016లో ఇది 666 టన్నులుగా ఉంది. ధన త్రయోదశి సెంటిమెంట్, గతంతో పోలిస్తే ధర కాస్త తగ్గడం, జిఎస్‌టి, జిడిపి వృద్ధి అంచనాలు తదితర కారణాల వల్ల డిమాండ్ పెరిగిందని డబ్లూజిసి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సోమసుందరమ్ తెలిపారు.

లాభాల్లోనూ 'హీరో'నే..

న్యూఢిల్లీ: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ హీరో మోటో కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో 4.27శాతం వృద్ధితో రూ.805 కోట్ల నికర లాభాలు సాధించింది. 2016-17 ఇదే క్యూ3లో రూ.772 కోట్ల లాభాలు ఆర్జించింది. గత క్యూ3లో కంపెనీ నికర ఆదాయం 14.8శాతం పెరిగి రూ.7,305 కోట్ల పెరిగింది. ఇదే సమయంలో 16శాతం వృద్ధితో 17,09,107 వాహనాలను అమ్మకాలు చేసింది. ఒక్కో షేరుపై రూ.55 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

ఫ్యాబ్ ఇండియాపై కేసు

న్యూఢిల్లీ : అక్రమంగా తమ ట్రేడ్‌మార్క్‌ను ఉపయోగించుకుంటున్నారని, దుస్తులను ఖాదీ ట్యాగ్‌తో అమ్ముతున్నారని ఆరోపిస్తూ ఖాదీ, గ్రామ వ్యాపార కమిషన్ (కెవిఐసి) రిటైల్ చైన్ దుస్తుల విక్రయ సంస్థ ఫ్యాబ్ ఇండియాకు నోటీసులు పంపించింది. ట్రేమ్ మార్క్ వివాదం కింద నోటీసులు ఇచ్చింది. ఇందుకుగాను నష్టపరిహారంగా రూ.525 కోట్లను చెల్లించాలని డిమాండ్ చేసింది. లేదంటే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని కెవిఐసి హెచ్చరించింది. అంతేకాదు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కూడా కోరింది. కాగా ఖాదీ కమిషన్ ఆరోపణలను ఫ్యాబ్ ఇండియా కొట్టిపడేసింది.

ఈ వివాదం ఇప్పటిదికాదు. గతంలోనే కెవిఐసి ఫ్యాబ్ ఇండియాకు నోటీసులు పంపించింది. అలాగే వార్తాపత్రిల్లో తప్పుదారి పట్టించే ప్రకటనలు కూడా ఆపేయాలని కూడా హెచ్చరించింది. దీనికి ఫ్యాబ్ ఇండియా సానుకూలంగా స్పందించింది. కాగా మళ్లీ 2017 జనవరిలో ఫ్యాబ్ ఇండియా మళ్లీ పాత రీతిలోనే వ్యవహరిస్తుండటంతో కెవిఐసి మరోసారి నోటీసులిచ్చింది.

వడ్డీ రేట్లు పెరుగొచ్చు : పిఎన్‌బి చీఫ్

న్యూఢిల్లీ : ద్రవ్యోల్బణం ఎగిసిపడటం వల్ల వడ్డీ రేట్లు పెరుగొచ్చని పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) ఎండి సునీల్ మెహతా అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు ద్రవ్యోల్బణం పెరిగిన రేట్లు స్థిరంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఈ పరిస్థితి ఉండకపోవచ్చున్నారు. రిజర్వు బ్యాంకు ఫిబ్రవరి 7న ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.
ఇందులో వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనుంది. 2017 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో పిఎన్‌బి నికర లాభాలు 11.10శాతం పెరిగి 230.11 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయంలో రూ.207.18 కోట్లుగా ఉంది. గత త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.14,123.98 కోట్ల నుంచి రూ.15,257.50 కోట్లకు చేరింది.

పది లక్షల కోట్లు ఆవిరి

• 3 రోజులు..1711 పాయింట్లు నష్టం • రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి • సెన్సెక్స్ మంగళవారం 561 పాయింట్ల పతనం • ఇంట్రా ట్రేడింగ్‌లో 1200 ఫట్ • కొత్తగా అమెరికా భయాలు



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

దేశీయ స్టాక్ మార్కెట్లు కేంద్ర బడ్జెట్ షాకు నుంచి కోలుకోకముందే అమెరికా పరిణామాలు ఉపద్రవంలా ముంచుకొచ్చాయి. ఈ రెండు దెబ్బలతో మంగళవారం కూడా మార్కెట్లు చతికల పడ్డాయి. సెన్సెక్స్ ప్రారంభంలోనే ఏకంగా 1,274 పాయింట్ల పతనంతో 33,500 పాయింట్ల దిగువకు పడిపోయింది. దీంతో కొన్ని సెకన్లలోనే మదుపర్లు రూ.5.40 లక్షల కోట్ల విలువను కోల్పోయారు. అమెరికా మార్కెట్లు గత ఆరు సంవత్సరాల్లో ఎప్పుడూ లేని విధంగా పతనం కావడంతో భారత మార్కెట్లపై ప్రభావం పడింది. దీనికి తోడు దేశీయంగా ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ మదుపర్లను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసిన విషయం తెలిసిందే. మరోవైపు రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లు పెంచనుందన్న అంచనాల్లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. కాగా బడ్జెట్‌లో ఈక్విటీలపై దీర్ఘకాల పెట్టుబడులపై లాభాలు రూ.1 లక్ష దాటితే 10 శాతం పన్ను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించడం మార్కెట్ల నష్టాల కొనసాగింపునకు కారణమైంది. ఈ పరిణామాల వల్ల గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 1711 పాయింట్ల నష్టాన్ని చవి చూసింది. మదుపర్లు దాదాపుగా రూ.10 లక్షల కోట్లు నష్టపోయారు. మార్కెట్లలో మరింత దిద్దుబాటు కొనసాగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రతికూల అంశాలు..

పలు పరిణామాల మధ్య అమెరికా మార్కెట్లు తీవ్ర పోటును ఎదుర్కొన్నాయి. ఈ ప్రభావం భారత, ఇతర ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఎల్‌టిసిజి పన్ను, ద్రవ్యలోటు కూడా భారత మార్కెట్లను పడగొట్టింది. అమెరికా స్టాక్‌మార్కెట్లు డోజోన్స్, ఎస్ అండ్ పి సూచీలు అతిపెద్ద ఇంట్రాడే పతనాలను నమోదుచేశాయి. ద్రవ్యోల్బణ భయాలు పెరుగడంతో ఆర్‌బిఐ కీలక వడ్డీరేటు అయిన రెపోను పెంచే అవకాశాలున్నాయని విశ్లేషణలు జోరందుకున్నాయి. దీంతో మదుపర్లలో మరిన్ని భయాలు చోటు చేసుకోవడం మార్కెట్లను భారీ పతనం వైపు తీసుకెళ్లాయి.

అధికంగా నష్టపోయినవి..

సెన్సెక్స్ 30లో అత్యధికంగా టాటా మోటార్స్ 5.45 శాతం, టిసిఎస్ 3.58 శాతం, కొటాక్ మహీంద్రా బ్యాంకు 2.70 శాతం, ఇన్ఫోసిస్ 2.62 శాతం, హీరో మోటో కార్ప్ 2.52 శాతం, ఇండుస్‌ఇండ్ బ్యాంకు 2.31 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. నిఫ్టీలో రంగాల వారిగా ఐటి 2.90 శాతం, ఫార్మా 2.19 శాతం, ఆటో 1.80 శాతం, ఎఫ్‌ఎంసిజి 1.91 శాతం, రియాల్టీ 1.88 శాతం, పిఎస్‌యు బ్యాంకు 2.11 శాతం, బ్యాంకింగ్ 1.10 శాతం చొప్పున నష్టపోయి మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

రూపాయి విలవిల

వరుసగా పడిపోతున్న మార్కెట్ల వల్ల రూపాయి విలువ ఒత్తిడికి గురై రెండు నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. మంగళవారం సెషన్‌లో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 0.28 శాతం కోల్పో యి 64.25కు దిగజారింది. రూ.64.40 వద్ద మొదలైన రూపీ ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 64.40 కనిష్ట స్థాయిని తాకింది. ప్రస్తుత ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూపాయి విలువ 0.6 శాతం తగ్గింది.

మునుగుతున్న బిట్ కాయిన్

లండన్ : గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ డిజిటల్ కరెన్సీలో సంచలనం రేపిన క్రిప్టో కరెన్సీల బుడగ పేలిపోతోంది. మంగళవారం బిట్ కాయిన్ విలువ 20 శాతం మేర క్షీణించడమే ఇందుకు నిదర్శనం. మూడు నెలల కాలంలో తొలిసారి 6,200 డాలర్ల దిగువకు పతనమైంది. గతేడాది డిసెంబర్ మధ్య నాటికి ఈ కరెన్సీ విలువ 19000 డాలర్ల గరిష్ట స్థాయిని తాకింది. వివిధ దేశాలు ఈ కరెన్సీపై వరుసగా నిషేధాన్ని ప్రకటించడంతో బిట్ కాయిన్ విలువ బిత్తరపోతోంది. భారత్‌లో కూడా దీనిపై నిషేధం ఉందని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించడంతో మరింత ఒత్తిడికి గురైవుతుంది. ఆ కరెన్సీ ఎక్స్ఛేంజ్‌పై జపాన్ అథారిటీలు సోదాలు చేశారు. రుణ భయాలతో పలు కమర్షియల్ లెండర్లు క్రెటిట్ కార్డుల ద్వారా బిట్‌కాయిన్లను కొనుగోలు చేయడాన్ని కస్టమర్లకు నిరాకరించాయి. యూరప్, జపాన్, అమెరికా సెంట్రల్ బ్యాంకులు కూడా బిట్‌కాయిన్లపై ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దీంతో క్రమంగా ఈ కరెన్సీ విలువ క్షీణిస్తోంది.

వారానికి 25 లక్షల పాను కార్డులు

న్యూఢిల్లీ : ప్రతీ వారంలో దాదాపుగా 15-25 లక్షల పాను కార్డులకు దరఖాస్తులు వస్తు న్నాయని ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. కాగా కొన్ని గంటలు లేదా రెండువారాల్లో పాన్ కార్డులను జారీ చేస్తున్నట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం లోకసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. జనవరి 28 నాటికి మొత్తం 20,73,434 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పాన్ కార్డు జారీకి రెండు సర్వీసు ప్రొవైడర్లు ఎన్‌ఎస్‌డిఎల్ ఇ-గోవ్ , యూటిఐఎస్‌ఎస్‌తో కలిసి పని చేస్తున్నా మన్నారు.

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

సాధన ప్రేరణ అని దేనినంటారు?




ఎస్.పి. మనోహర్‌కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

సైకాలజీ (ప్రేరణ)

ఒక వ్యక్తి తను నిర్ధేశించిన గమ్యం చేరుకోవడానికి అతనిని ప్రేరేపించే, ప్రోత్సహించే శక్తి ప్రేరణ. ప్రేరణ ఎలాంటి పరిస్థితుల్లోనైనా వ్యక్తిని గమ్యం వైపుకు నడిపిస్తుంది. ప్రేరణ పొందిన వ్యక్తి ప్రవర్తన గమ్యంవైపు ఉంటుంది. అభ్యసనంలో ప్రేరణ కీలకపాత్రపోషిస్తుంది. అవసరాలు, అభిరుచులు, సహజాతాలు, ప్రోత్సాహకాలు మొదలైనవి ప్రేరణకు కారకాలవుతాయి.

'మోటివేషన్' అనేది **'మొవీర్'** అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. మొవీర్ అనగా కదలిక అని అర్థం. అంటే మనిషిలో చలనం లేదా కదలిక కలుగజేసి ఒక గమ్యం వైపు నడిపించే శక్తి ప్రేరణ.



ప్రేరణకు కొన్ని నిర్వచనాలు

✧ ప్రత్యేకమైన లక్ష్యాలవైపు చర్యను ఉత్తేజపరిచే దృగ్విషయమే ప్రేరణ **- బెర్నార్డ్**

✧ వ్యక్తి తన కృత్య నిర్వహణలో చూపించే శక్తి, ఉత్సాహం, పెంపొందించడానికి దోహదపడే ప్రక్రియే ప్రేరణ **- డెస్సికో**

✧ ప్రేరణ అనేది ఒక గమ్యనిర్ధేశక చర్య **- మేయర్**

✧ అవసరాలను సంతృప్తిపరచుకొనే ప్రక్రియను ప్రేరణ అంటారు **- అబ్రహాం మాస్లో**

ప్రేరణను అవసరాల రీత్యా అబ్రహాం మాస్లో వర్గీకరించాడు. దీనిని అవసరాల అనుక్రమణిక సిద్ధాంతం అంటారు. అబ్రహాం మాస్లో అవసరాల సిద్ధాంతం లేదా ప్రేరణ సిద్ధాంతం అంటారు.

1. నిమ్న క్రమ అవసరాలు : దీనిని మరలా రెండు రకాలుగా వర్గీకరించాడు. శారీరక అవసరాలు, రక్షణ అవసరాలు

2. ఉన్నత క్రమ అవసరాలు : ఈ అవసరాలను ప్రేమసంబధిత అవసరాలు, గుర్తింపు అవసరాలు, ఆత్మ ప్రస్తావన అవసరాలుగా వర్గీకరించాడు. వ్యక్తుల అవసరాల తీవ్రతను బట్టి అబ్రహాం మాస్లో ఒక క్రమపద్ధతిలో అమర్చి, ఆయా అవసరాలను నిచ్చెన మెట్లతో పోల్చిచూపాడు.

1. శారీరక అవసరాలు : ఆహారం, గాలి, నీరు మొదలైనవి

2. రక్షణ అవసరాలు : ఇల్లు, భద్రత, తల్లిదండ్రుల తోడు మొదలైనవి

3. ప్రేమసంబంధిత అవసరాలు : అనురాగం, ఆప్యాయత, ప్రేమ వంటివి.

4. గుర్తింపు అవసరాలు : అంతస్తు, హోదా, గుర్తింపు మొదలైనవి

5. ఆత్మ ప్రస్తావన అవసరం : ఆత్మసంతృప్తి. ఆత్మ ప్రస్తావన అనే మాటను కర్ట్ గోల్డ్ స్టీన్ సిద్ధాంతం నుంచి అబ్రహాం మాస్లో స్వీకరించాడు.

ప్రేరణ అనేది అంతర్గత అభిరుచి, అవసరాల నుంచి ఏర్పడుతుంది. పనిచేయడానికి తోడ్పడే అంతర్గత మానసిక ఛోదక శక్తి, ప్రవర్తనను సిద్ధపరుస్తుంది. అన్ని ప్రవర్తనలకూ మూలాధారం, అన్ని అభ్యసనాలకూ రాచబాట, వ్యక్తి చేత పనిచేయించగలుగుతుంది. వ్యక్తి ప్రవర్తనను గమ్యంపైపుకు నిర్ధేశిస్తుంది. అన్ని అభ్యసనలకూ ప్రాణం వంటిది.

వ్యకి ప్రేరణ పొందినపుడు

గమ్యాన్ని చేరుకోవడానిక ఆతృత, ఉత్సాహాన్ని చూపిస్తాడు. గమ్యాన్ని చేరుకోవడానికి తీవ్రమైన కృషిచేస్తాడు. గమ్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన శక్తి తనలో ఉన్నట్లు భావిస్తాడు. చివరికి గమ్యాన్ని చేరుకుని ఉపశమనం చెందుతాడు.



ప్రేరణ విధులు : అభ్యాసకుని శక్తిమంతునిగా చేస్తుంది. ఆసక్తి రేకెత్తిస్తుంది. వ్యక్తి ప్రవర్తనను లక్ష్యంవైపు నిర్దేశిస్తుంది. లక్ష్యసాధనకు కావాల్సిన ప్రవర్తన ఎంపికకు తోడ్పడుతుంది. అభ్యాసకునిలో అవధానాన్ని కలిగిస్తుంది. శీల నిర్మాణానికి విజ్ఞానార్జనకు దోహదపడుతుంది. గమ్యాన్ని చేరిన తర్వాత తృప్తిని కలిగిస్తుంది.

ప్రేరణ రకాలు

1. అంతర్గత ప్రేరణ : పనిపూర్తిచేయడంలో ఉండే సంతృప్తి కోసం, ఆనందం కోసం, స్వీయ అవసరాలను తీర్చుకోవడం కోసం ఎటువంటి బాహ్య ఉద్దీపన ప్రమేయంలేకుండా ఏదైనా పనిచేయడాన్ని 'అంతర్గత ప్రేరణ' అంటారు. శారీరక అవసరాలైన స్వార్ధచింతన, ఆత్మగౌరవం, కాంక్ష, అభిరుచులు అంతర్గత ప్రేరణకు కారకాలవుతాయి. అంతర్గత ప్రేరణలో ఎవరి బలవంతమూ ఉండదు. బాహ్యఉద్దీపనల ప్రభావం ఉండదు. స్వీయతృప్తి, ఆనందం ఉంటుంది. స్వార్ధచింతన, గౌరవకాంక్ష, సహజాతాలు, శారీరక అవసరాలు ఉంటాయి. అభ్యసించాలనే స్వయంసిద్ధ కోరిక ఉంటుంది. ఇది స్వభావ సిద్ధమైన ప్రవత్తి.

ఉదా : 1. చిన్నపిల్లలు ఆనందం కోసం ఆటలు ఆడుకోవడం
2. అమ్మాయి తన అభిరుచిమేరకు నృత్యం నేర్చుకోవడం.
3. పజిల్స్ పూర్తిచేయడంలో ఉండే వినోదం, ఛాలెంజింగ్‌ను ఆస్వాదించడం కోసం వాటిని పూర్తిచేయడం.

2. బాహ్య ప్రేరణ : ఒక పనిచేయడంలో వ్యక్తి అభిరుచులకు, అవసరాలకు సంబంధంలేకుండా సహకరించే అన్ని ప్రోత్సాహకాలను బాహ్య ప్రేరణ లేదా కృత్రిమ ప్రేరణ అంటారు. పొగడ్త, నింద, శిక్ష, దండన మొదలైనవి బహిర్గత ప్రేరణా కారకాలుగా చెప్పవచ్చు. బాహ్య ప్రతిఫలాన్ని ఆశించి పనిచేయడం, ఇతరులు నిర్ధేశించిన గమ్యం, భయపెట్టి పనిచేయించడం, సాధించాల్సిన గమ్యాలకు బహుమతులు, శిక్షలు ఉంటాయి. బాహ్య ప్రేరణలో ఫలితనియమం ఇమిడి ఉంటుంది.

ఉదా : తండ్రి ఆనందం కోసం పిల్లవాడు సంగీతం నేర్చుకోవడం

3. సాధన ప్రేరణ : ఒక రంగంలో లక్ష్యాలను నిర్ధేశించుకుని కొన్ని శిఖరాలను సాధించాలనే ధ్యేయం వైపుగా కొనిసాగించే చర్యలతో కూడిన ప్రవర్తనను సాధన ప్రేరణ అంటారు. ఇది **మెక్లీలాండ్, ఆట్కిన్‌సన్** ప్రయోగాల ద్వారా వెలుగులోకి వచ్చింది. దీనిని సి.ఐ.ఇ వంటి పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. సి.ఐ.ఇ పరీక్షను రూపొందించిన వారు దత్, రస్తోగి. మెక్లీలాండ్, ఆట్కిన్‌సన్‌లను అనుసరించి అనేక లక్ష్యాలతో సంబంధం ఉండి సాధారణంగా కొన్ని ఉన్నత ప్రమాణాలను సాధించాలనే ధ్యేయం వైపు కొనసాగించే చర్యలతో కూడిన ప్రవర్తనను **సాధన ప్రేరణ** అంటారు. దీనికి ఉదాహరణగా గాంధీజీని చెప్పవచ్చు. అనేక లక్ష్యాలను ఎంచుకొని ఒక్కొక్క లక్ష్యాన్ని పూర్తిచేసుకుంటూ భారతజాతి మొత్తాన్ని ఏకతాటిపైకి తెచ్చి, జాతిమొత్తానికీ నాయకుడు కావడానికి సాధన ప్రేరణ కారకంగా చెప్పవచ్చు.

తరగతి గదిలో ప్రేరణ కలిగించే అంశాలు

1. పొగడ్త - నింద
2. బహుమతి - దండన
3. పోటీ - సహకారం
4. సాఫల్యం - వైఫల్యం
5. కాంక్ష - స్థాయి
6. ఫలితాలు తెలుసుకోవడం

★

తెలుసుకోండి మీ నాలెడ్జ్

1. అవసరాల నుంచి ఏర్పడి గమ్యం వైపుకు నడిపే ప్రవర్తనే - **ప్రేరణ**
2. వ్యక్తికి ఒక పనిని పూర్తిచేయడం కోసం ఉత్సాహాన్ని, శక్తిని కలుగజేసే మానసిక శక్తి - **ప్రేరణ**
3. ఒక పనిని పూర్తిచేయడానికి పురిగొల్పే మానసిక ఛోదక శక్తి - **ప్రేరణ**
4. అభ్యసనానికి రాచబాట - **ప్రేరణ**
5. అభ్యసనానికి మూలాధారం ప్రేరణ అన్నవారు - **అబ్రహాం మాస్లో**
6. అన్ని రకాల ప్రవర్తనలకూ మూలాధారం ప్రేరణ అన్నవారు - **ఉడ్‌వర్త్**
7. మోటివేషన్ అనే పదానికి మూలమైన లాటిన్ పదం - **మొవీర్**
8. వ్యక్తిని దీర్ఘకాలిక ప్రగతిపథంలోకి తీసుకొనివెళ్లే ప్రేరణ - **అంతర్గత ప్రేరణ**
9. విద్యార్థులలో ఉపాధ్యాయుడు పెంపొందించాల్సిన ప్రేరణ - **అంతర్గత ప్రేరణ**
10. ఉపాధ్యాయులకు ఇచ్చే అవార్డులు, ఇంక్రిమెట్లు వారిలో కలుగజేసే ప్రేరణ - **బహిర్గత ప్రేరణ**
11. సాధనా ప్రేరణ గురించి మొదట వివరించిన శాస్త్రవేత్తలు - **మెక్లీలాండ్, ఆట్కిన్‌సన్**
12. అనేక ఉన్నత లక్ష్యాలను సాధించాలి అని వ్యక్తికి కార్యదీక్షతను, పట్టుదలను కలిగించే ప్రేరణ - **సాధనా ప్రేరణ**
13. ప్రేరణ వీటితో ముడిపడి ఉంటుంది - **అవసరాలు**
14. అవసరాల అనుక్రమణిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు - **అబ్రహాం మాస్లో**
15. పొగడ్త, నిందలపై ప్రయోగాలు చేసి, నింద కంటే పొగడ్త చాలా శక్తివంతమైనదని నిరూపించినది - **ఎలిజబెట్ హార్లాక్**
16. ఎలుకలపై ప్రయోగాలచేసి ప్రేరణ ప్రాముఖ్యాన్ని ప్రయోగపూర్వకంగా నిరూపించింది - **ఎలిజబెత్ హార్లాక్**
17. బహుమతులు-దండనలపై ప్రయోగాలు చేసి దండన కన్నా బహుమతి శక్తివంతమైన ప్రేరకాలు అని నిరూపించినది - **థార్న్‌డైక్**
18. వ్యక్తి శారీరక మనుగడకు అవసరమైనవి - **ప్రాథమిక అవసరాలు**
19. వ్యక్తి మానసిక మనుగడకు లేదా ఉన్నతంగా జీవించడానికి అవసరమయ్యేవి - **గౌణ అవసరాలు**
20. ఒక సాధారణ వ్యక్తి ఒక గొప్ప శాస్త్రవేత్తగా, తరువాత భారత రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలాంలోని ఏ ప్రేరణ వీరిని ఆ స్థాయికి తీసుకెళ్లింది - **సాధనా ప్రేరణ**

ఉద్యోగాలు

ఐవోసీఎల్‌లో 98 ఖాళీలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కు చెందిన సదరన్ రీజియన్ మార్కెటింగ్ డివిజన్ .. 98 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : జూనియర్ ఆపరేటర్ గ్రేడ్ (1)-51 , జూనియర్ ఆపరేటర్ (ఏవియే షన్) గ్రేడ్ (1)-46, జూనియర్ చార్జ్‌మ్యాన్ గ్రేడ్ (3)-1.

రాష్ట్రాలు/రీజియన్ల వారీ ఖాళీలు : ఆంధ్రప్రదేశ్-12 (జూనియర్ ఆపరేటర్-10, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-1, చార్జ్‌మ్యాన్-1), తెలంగాణ- (జూనియర్ ఆపరేటర్-6, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-5), కరా?టక-(జూనియర్ ఆపరేటర్-21, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-7), కేరళ- (జూనియర్ ఆపరేటర్-2, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-1), తమిళనాడు అండ్ పుదుచ్చేరి- (జూనియర్ ఆపరేటర్-12, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-32).

అర్హతలు : జూనియర్ ఆపరేటర్‌కు పదోతరగతితోపాటు ఐటీఐ (ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/ ఎలక్ట్రీషియన్/ మెషినిస్ట్/ఫిట్టర్), జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)కు కనీసం 45 శాతం (ఎస్సీ/ ఎస్టీ 40 శాతం) మార్కులతో ఇంటర్మీడియట్. అలాగే హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, చార్జ్‌మ్యాన్ పోస్టులకు కనీసం 50 శాతం (ఎస్సీ/ ఎస్టీ-45 శాతం) మార్కులతో ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ సివిల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్). అన్ని పోస్టులకూ సంబంధిత రంగాల్లో కనీసం ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు : 2018, జనవరి 31 నాటికి 18-26 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : రాతపరీక్ష, స్కిల్ ప్రొఫేషియెన్సీ ఫిజికల్ టెస్ట్ (ఎస్‌పీపీటీ).

రాతపరీక్ష విధానం : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెక్నికల్ నాలెడ్జ్ (సంబంధిత సబ్జెక్టు), జనరల్ ఆప్టిట్యూడ్ ఇన్‌క్లూడింగ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీస్, బేసిక్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్కిల్స్ అనే నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్) పోస్టులకు మాత్రం టెక్నికల్ నాలెడ్జ్ విభాగం ఉండదు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీరు?లై వారి మెరిట్ జాబితా నుంచి 1:2 నిష్పత్తిలో ఎస్‌పీపీటీకి ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు : జనరల్/ ఓబీసీ-రూ. 150.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'పోస్ట్ బాక్స్ నెం.3321, నుంగంబాక్కం ఎండీవో, చెన్నై-600034, తమిళనాడు' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : ఫిబ్రవరి 10, 2018.

హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 16, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.iocl.com

గ్రామీణ డాక్ సేవక్స్ ఉద్యోగుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి గవర్నరుపేట (విజయవాడ)

గ్రామీణ డాక్ సేవక్స్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో విజయవాడ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాల నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద బకాయిల పంపిణీలో పనిచేస్తున్న ఉద్యోగులకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాలు మూడేళ్లు గడిచినా చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండి పడ్డారు. ఆల్ ఇండియా డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దోమా రఘుబాబు, రావు పాల్గొన్నారు.



పోరంకిలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్ల ధర్నా

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి- యంత్రాగం

ఉద్యోగ భద్రత, వేతనాలు పెంచాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లు ధర్నా చేపట్టారు.వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కృష్ణా జిల్లాలో గుడివాడ పిహెచ్‌సి ఎదుట, మొవ్వలో ధర్నా నిర్వహించారు. పెడనలో పిహెచ్‌సి వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. పోరంకిలోని జన్మభూమి ఆసుపత్రి వద్ద ఆశావర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు.విశాఖలో చోడవరం, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, వడ్డాది, డుంబ్రిగుడ, అనంతగిరి, రాంబిల్లి, పాయకరావుపేట, నక్కపల్లి, నర్సీపట్నం, నాతవరం మండలాల్లోని ప్రభుత్వాసుపత్రులు, పిహెచ్‌సిల వద్ద ఆందోళన చేపట్టారు. వైద్యాధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం కింతలి పిహెచ్‌సి; రాజాం మండలం బొద్దాం, పొగిరి పిహెచ్‌సిల ఎదుట ధర్నా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి మండలం లాగరాయి, రాజవొమ్మంగి పిహెచ్‌సిల వద్ద ధర్నా చేపట్టారు. తమను రెగ్యులర్ ఉద్యోగులు మాదిరిగా గుర్తించాలని నినదించారు. అనంతరం లాగరాయి, రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారులు పి.మహేష్‌రెడ్డి, మోనిషాలకు వినతి పత్రాలు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో పిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్లు ధర్నాలు చేపట్టి వైద్యాధికారులకు వినతులు అందించారు. భీమడోలు మండలం గుండుగొలను పిహెచ్‌సి వద్ద కార్యకర్తలు ధర్నా చేశారు. తాడేపల్లిగూడెం, చాగల్లు పరిధిలోని పిహెచ్‌సిల వద్ద ఆశాలు ధర్నా చేపట్టి వైద్యాధికారులకు వినతిపత్రాలు అందించారు. ప్రకాశం జిల్లా చీరాలలో సిఐటియు ఆధ్వర్యంలో చీరాల,యర్రగొండపాలెం, కనిగిరి, హెచ్ఎంపాడులలో ధర్నా నిర్వహించారు.

భూ కుంభకోణంపై విచారణకు డిమాండ్

- క్రిడా కార్యాలయం ముందు సిపిఎం ధర్నా
- కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పరిధిలో జరిగిన భూ కుంభకోణంపై విచారణ జరిపించాలని సిపిఎం రాజధాని ప్రాంత సమన్వయ కమిటీ కన్వీనర్ సిహెచ్.బాబూరావు కోరారు. మందడంలో రూ.3.50 కోట్ల విలువైన భూ కుంభకోణంపై విచారణ జరిపించాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం విజయవాడలో సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మంచి రాజధాని ప్రజల రాజధాని కావాలని రైతులు, వ్యవసాయ కార్మికులు త్యాగం చేసి భూమిని ఇస్తే అక్కడ అవినీతి రాజ్యమేలుతోందన్నారు. మొత్తంగా రాజధాని ప్రాంతంలో సుమారు 2వేల ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని, గుర్తింపులేని (అన్‌నౌన్) భూములు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయని తెలిపారు. ఈ అవినీతిలో పాలకులు, అధికారులు అంతా భాగస్వాములేనని, వేల కోట్లు దోచుకున్నారని తెలిపారు. నిజమైన రైతులు మాత్రం నష్టపోయారని పేర్కొన్నారు. రాజధాని వ్యవహారంలో రెవెన్యూ, సిఆర్‌డిఏ అధికారులు కోట్లు సంపాదించారని తెలిపారు. దీనిపై వెంటనే విచారణ జరిపించి అందరిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకవైపు రైతుల త్యాగంతో భూములు రాజధాని కోసం ఇస్తే వాటిని కార్పొరేట్ సంస్థలకు నామమాత్ర ధరకు ధారాదత్తం చేస్తున్నారని, ఇది సరైంది కాదని పేర్కొన్నారు. సచివాలయం కూతవేటు దూరంలో అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. జనం రాజధాని బ్రాండ్ ఇమేజ్ కోరుకుంటున్నారని, పత్రాలను, ఇక్కడి తంతును చూస్తే అవినీతికి బ్రాండ్ ఇమేజ్ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అసైన్డ్ భూములు అమ్ముకున్నారని, రిజిస్ట్రేషన్ చేయకూడని భూములు రిజిస్ట్రేషన్ చేశారని తలిపారు. దొండపాడులో 6.24 ఎకరాలు అన్యాక్రాంతమైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి దోపిడీకి తెర లేపారని విమర్శించారు. దీనిపై వెంటనే న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్లాట్ల కేటాయింపుల్లో కూడా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారని పేర్కొన్నారు. కావాల్సిన వారికి ఎమ్మెల్యేలు, ఎంపిలకు కార్నర్ ప్లాట్లు కేటాయించారని, ఎవరికి ఎక్కడ కావాలో అక్కడ ఇచ్చారని, ఇది కూడా పెద్ద కుంభకోణమని తెలిపారు. తమకు జరిగిన అన్యాయాలపై రైతులు అడుగుతుంటే సమాధానం చెప్పేవారు కరువయ్యారన్నారు. గతంలో పూలింగుకు భూములు ఇవ్వాలని కోరిన నారాయణ, పుల్లారావు ప్రస్తుతం రాజధాని పరిధిలో కనిపించడం లేదని తెలిపారు. అనంతరం కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.విష్ణువర్ధన్, ఎం.రవి, కామినేని రమేష్, నవీన్, రమణ, నాగరాజు, నరసింహారావు, శ్రీలక్ష్మి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని సిఆర్‌డిఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

నిందితులపై క్రిమినల్ కేసులు : శ్రీధర్

మందడంలో భూ కుంభకోణానికి పాల్పడిన నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని సిఆర్‌డిఏ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. గౌస్‌ఖాన్ అనే వ్యక్తికి భూమి లేకుండానే, రికార్డులు లేకుండానే భూములు కేటాయించారని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ ఈ వ్యవహారం మొత్తం రెండు గంటల్లోనే చేశాడని తెలిపారు. అంతర్గత విచారణలో ఈ వ్యవహారం బయటకు వచ్చిందని పేర్కొన్నారు. ఈ భూములు రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేశామని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు ఉండి ఉండొచ్చని, వారి సాయం లేకుండా కంప్యూటర్ ఆపరేటర్ ఏమీ చేయలేరని తెలిపారు. దీనిపై విచారణకు షాన్‌మోహన్‌ను విచారణ అధికారిగా నియమించామన్నారు. గౌస్‌ఖాన్‌కు కేటాయించిన భూమిని వెనక్కు తీసుకుంటామన్నారు. రాజధాని పరిధిలో ఎటువంటి అక్రమాలూ జరగలేదని తెలిపారు. దీనిపై మూడు రోజుల్లో నివేదిక వస్తుందన్నారు. కాంపిటెంట్ అధికారిపైనా విచారణ చేస్తున్నామని చెప్పారు. ప్లాట్ల కేటాయింపులో ఎటువంటి అవినీతి, అక్రమాలు లేవని, పారదర్శకంగా చేశామని పేర్కొన్నారు. 59000 ప్లాట్లు రైతులకు కేటాయిస్తున్నామన్నారు. అనంతరం మాతా అమృతానందమయి యూనివర్సిటీకి కురగల్లు, నవులూరు మధ్యలో భూములు కేటాయించామని, వాటికి బుధవారం ఉదయం శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు.

రాలిన మరో విద్యా కుసుమం

ఉరి వేసుకోని విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - జమ్మలమడుగు (కడప)

చదువుల ఒత్తిడి భరించలేక అమాయక విద్యార్థులు తనువు చాలిస్తున్నారు. ఇటీవల సింహాద్రిపురం, కడపలో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య ఘటనలను మరువకముందే జమ్మలమడుగులో మరో విద్యా కుసుమం నేలరాలింది. కారణాలు ఏవైనా కడప జిల్లాలో విద్యార్థుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. కడప జిల్లా జమ్మలమడుగు పట్టణంలోని పద్మావతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సందీప్‌కుమార్(14) ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బంధువుల కథనం మేరకు.. బలిశెట్టి తులశయ్యకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు ఉపేంద్ర కుమార్ తిరుపతిలో ఇంటర్ చదువుతున్నాడు. రెండో కుమారుడు సందీప్‌కుమార్ జమ్మలమడుగులో పదో తరగతి చదువుతున్నాడు. తులశయ్య గండికోట వద్ద క్యాంటిన్ నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏమైందో ఏమో సందీప్‌కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చదువులో ఒత్తిడే అని కొందరు, బాగా చదువుతాడని మరి కొందరు అంటున్నారు. తల్లి కూడా నాలుగైదు సంవత్సరాలుగా వారి వద్ద లేదని తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడి వల్లే చనిపోయాడని తెలుస్తోంది. సోమవారం రాత్రి ఉరి వేసుకుంటే చనిపోతారా నాన్నా అంటూ సందీప్ కుమార్ తన తండ్రిని అడిగితే.. చనిపోతారని చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మృతి చెందిన సందీప్‌కుమార్ ఇంటికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు వెళ్లి నివాళులర్పించారు.

మోడీ ఇంటి వద్ద ధర్నా చేసే దమ్ముందా

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయకపోతే శ్రీకాకుళంలో ధర్నా పెడతామని సిఎం చంద్రబాబు అంటున్నారనీ, ఆ ధర్నా శ్రీకాకుళంలో కాదని మోడీ ఇంటి వద్ద చేపట్టాలనీ ఆ దమ్ము, ధైర్యం చంద్రబాబుకు ఉందా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. ఢిల్లీలో ఆరుగురు ఎంపీలు గాంధీ విగ్రహం ముందు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలపడం మోసమేనని అన్నారు. మిగితా ఎంపీలు నిద్రపోతున్నారా.. లేకుంటే చికెన్ తినడానికి వెళ్ళారా అంటూ దుయ్యబట్టారు. ఈనెల 8న బంద్‌కు అన్ని పక్షాలు మద్దతు తెలియజేస్తున్నాయన్నారు. టిడిపి కూడా బంద్‌కు మద్దతు ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయాన్ని నిర్మించేందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కృషి ప్రారంభించాయన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు ఆర్ వెంకయ్య, సిపిఐ జిల్లా నాయకులు యంయల్ నారాయణ ఉన్నారు.

పెదగొట్టిపాడులో దళిత మహిళల దీక్ష

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)

తమకు న్యాయం చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో దళిత మహిళలు మంగళవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి ఘటనలో తప్పించుకు తిరుగుతున్న ప్రధాన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వీరిపై ఐపిసి 307, 354/ఎ, 325 తదితర సెక్షన్ల కేసులు నమోదు చేయాలని ఎస్సీ కమిషన్ సభ్యులు కె.రాములు ఇటీవల ఇక్కడ పర్యటించిన సందర్భంలో ఆదేశించారని గుర్తు చేశారు. అయినా ఇప్పటివరకు పోలీసులు స్పందించలేదన్నారు. దీక్షల్లో జొన్నలగడ్డ జయభాగ్యమ్మ, జె.ఆమని, వి.నాగమణి, కె.మరియమ్మ, కె.సయోమి, మరో 11 మంది కూర్చున్నారు.

నేటి నుంచి భీమవరం ఫెస్ట్

- ప్రారంభం కానున్న ప్రజాసాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్



సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని నేటి నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ప్రజాసాంస్కృతిక సంబరాలు, పుస్తక ప్రదర్శన ప్రారంభమవుతుందని సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా (డెల్టా) కమిటీ కార్యదర్శి బి.బలరాం తెలిపారు. జువ్వలపాలెం రోడ్డులో నటరాజ్ థియేటర్ పక్కనే ఉన్న గ్రౌండ్‌లో కళాప్రదర్శన, పుస్తక ప్రదర్శన నాలుగు రోజులపాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు 'భీమవరం ఫెస్ట్' అని నామకరణం చేసి ఫెస్ట్ లోగోను విడుదల చేశారు. ప్రజా కళాకారిణి అమరజీవి తొట్టెంపూడి ప్రభావతి కళావేదికపై నాలుగు రోజులపాటు సాయంత్రం ఆరు గంటల నుండి పది గంటలకు వరకు ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 7న తొలిరోజు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటులు, నిర్మాత బివి నారాయణరావు, మాజీ ఎంఎల్‌సి బొమ్మిడి నారాయణరావు, సినీ దర్శకులు బాబ్జి (రఘుపతి వెంకయ్య చిత్రం ఫేమ్), భీమవరం మున్సిపల్ చైర్మన్ కొటికలపూడి గోవిందరావు, సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు మంతెన సీతారాం హాజరవుతారని చెప్పారు. రెండోరోజు ఉత్సవాల్లో ప్రముఖ సినీ దర్శకులు సి.ఉమామహేశ్వరరావు (అంకురం చిత్ర దర్శకులు), స్థానిక ప్రముఖులు కొత్తపల్లి కోదండరామ గాంధీరాజు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో మన్య విప్లవం (పశ్చిమగోదావరి జిల్లా), యముడిది పోయింది (తూర్పుగోదావరి జిల్లా), రాజకీయ గారడీ (విశాఖ), డామిట్ కథ అడ్డం తిరిగింది (గుంటూరు), ఏ కులం నీది (నెల్లూరు), తప్పెటగుళ్ల (విశాఖ), చెమట చుక్క (తూర్పుగోదావరి), ఓ భార్య ఓ భర్త, ఇంకో అది (కృష్ణాజిల్లా), గురజాడ-మా అడుగుజాడ (పశ్చిమగోదావరి జిల్లా) థింసా నృత్యం (విశాఖ రూరల్), సుందరయ్య చరితం (తూర్పుగోదావరి జిల్లా) కుర్రాల్లోయ్ (విశాఖ) ప్రదర్శనలు కళాత్మకంగా ఇవ్వబోతున్నట్లు చెప్పారు. 9, 10 తేదీల్లో ఫెస్ట్ వివరాలు తరువాత వెల్లడిస్తామని చెప్పారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై భీమవరం ఫెస్ట్‌లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తిచేశారు.


శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంలో రహదారిపై బైఠాయించిన మహిళలు

మరుగుదొడ్డి నిర్మించలేదని పింఛను, రేషన్ ఆపేస్తారా?

మహిళల ఆగ్రహం - ప్రధాన రహదారిపై బైఠాయింపు

ప్రజాశక్తి- వీరఘట్టం(శ్రీకాకుళం జిల్లా)

మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టలేదన్న పేరిట పింఛను, రేషన్ ఆపేస్తారా అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిలుపుదల చేసిన పింఛన్లు, రేషన్‌ను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆ మండల కేంద్రంలో మహిళలు మంగళవారం ధర్నా చేశారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలమైన తాము ప్రభుత్వం ఇచ్చే రేషన్, పింఛనుపై ఆధారపడి బతుకుతున్నామన్నారు. ఉండడానికే సరైన ఇళ్లు లేవని, ఇక మరుగుదొడ్లు ఎలా నిర్మించుకోవాలని ప్రశ్నించారు. స్థలం లేని వారికి ప్రభుత్వమే మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పింఛన్లు ఆపడం, మరుగుదొడ్డి నిర్మిస్తేనే ప్రభుత్వ పథకాలను అందిస్తామని అధికారులు చెబుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలను ఆపేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న మహిళల వద్దకు తహశీల్దార్ ఎం.వి.రమణ వచ్చారు. స్థలం ఉన్న వారు మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. స్థలం లేని వారి గురించి ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తామన్నారు.

కర్రపెండలం దుంప గిట్టుబాటు ధరపై చర్చలు విఫలం

ప్రజాశక్తి-పెద్దాపురం (తూర్పుగోదావరి)

కర్ర పెండలం దుంప పంటకు గిట్టుబాటు ధరపై తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో రైతు ప్రతినిధులకు, సగ్గుబియ్యం మిల్లుల యజమానులకు మధ్య మంగళవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో రైతులు రాస్తారోకో చేపట్టారు.

ప్రజ్ఞ

జవాబులు

1. గోవర్ధన్ యోజన
2. జపాన్ (3 కేజీలు), 3. చంద్రాపూర్ జిల్లా (మహారాష్ట్ర), 4. గాంధీ సాగర్ డ్యామ్ (మధ్యప్రదేశ్‌లో చంబల్ నదిపై)
5. మహారాష్ట్రకు చెందిన థీయేటర్ ఆర్టిస్ట్, డైరెక్టర్

రాష్ట్రానికి తీరని ద్రోహం

కేంద్ర బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి, సీతమ్మధార

ఆంధ్రప్రదేశ్‌కు, ఉత్తరాంధ్రకు ఈ సారి బడ్జెట్‌లో కూడా మోడీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని మంగళవారం విశాఖలోని పౌర గ్రంథాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక (ఎఫ్‌డిఎన్ఎ) చైర్మన్ ప్రొఫెసర్ కెవి.రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఐఎఎస్ ఇఎఎస్ శర్మ, ఐటి సంస్థల యాజమాన్యాల ప్రతినిధి ఒ.నరేష్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ.అజశర్మ, చార్టర్డ్ అకౌంటెడ్ ఎ.ప్రసన్న కుమార్, ఫుడ్ గ్రైన్ డీలర్స్ అసోసియేషన్ సెక్రటరీ సుధాకర్, రిటైర్డ్ డిఎంఅహెచ్ పి.రామారావు, పీపుల్ ఫర్ ఇండియా కన్వీనర్ బిబి.గణేష్, వైజాగ్ రాజకీయ జర్నల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను కూడా అమలు చేయడానికి నాలుగేళ్లుగా నిరాకరించడం ద్రోహం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు బడ్జెట్ కావడంతో న్యాయం జరుగుతుందని, ఆశించిన వారందరికీ నిరుత్సాహానికి గురిచేసిందని తెలిపారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌పై మోసపూరిత ప్రకటనలు తప్ప చేసిందేమీ లేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో స్వయంగా ప్రధానమంత్రి హామీ ఇచ్చి, నేడు సాంకేతిక కారణాలు అడ్డు వస్తున్నాయని చెప్పడం నయవంచనకు పాల్పడటమేనని పేర్కొన్నారు. ఆయుష్మాన్‌భవ, వ్యవసాయానికి మద్దతు ధర పథకాలు కేవలం మాటలకే పరిమితమని పేర్కొన్నారు. ఈ నెల 8న ఈ డిమాండ్ల సాధనకై తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు తెలిపారు.

మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ/కాకినాడ

ఎస్‌టి జాబితాలో చేర్చాలని శాంతియుతంగా పోరాటం చేస్తున్న మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని దగ్ధం చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మత్స్యకార ఎస్‌టి సాధన సమితి ఆధ్వర్యాన మత్స్యకారులు శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్‌ను కలిసేందుకు అందరినీ అనుమతించాలన్న మత్స్యకార నాయకుల విజ్ఞప్తిని పోలీసులు తిరస్కరించడంతో కొంతసేపు ఆందోళన చేపట్టి విరమించారు. అనంతరం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద సమావేశమయ్యారు. మత్స్యకార దీక్షా శిబిరంపై దాడి రాజకీయ కుట్ర అని మత్స్యకార నాయకులు సూరాడ రాజారావు విమర్శించారు. మత్స్యకారులకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లాలోని 42 మత్స్యకార గ్రామ పంచాయతీల నుంచి మత్స్యకార కుటుంబాలతో భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం 58వ రోజు దీక్షా శిబిరాన్ని కొనసాగించారు. మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నాయకులు కె.పార్థసారథి సందర్శించి వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రోద్భలంతోనే మత్స్యకారుల దీక్షా శిబిరంపై దాడి జరిగిందని ఆరోపించారు.

మత్స్యకారుల దీక్షలకు పలువురు మద్దతు

తమను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ బాలాజీ చెరువు సెంటర్లోని నెహ్రూ సెంటర్లోని నెహ్రూ విగ్రహం వద్ద మత్స్యకారులు చేపట్టిన నాలుగో రోజు దీక్షలకు పలువురు మద్దతు తెలిపారు. దీక్షల్లో పేర్ల జోగారావు, రజనీకుమార్, గోవిందమ్మ, కె.మల్లిక, పి.లక్ష్మి, కె.లక్ష్మీ, బాలు, గోవిందు శ్రీను, సీతారామయ్య తదితరులు కూర్చున్నారు. బిజెపి నాయకులు ఉంగరాల చినబాబు, పైడా కృష్ణమోహన్, భావనప్రసాద్ తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

సమస్యలపై సంఘాలతో సమావేశం వేయాలి : యుటియఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యలు చర్చించేందుకు ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని యుటిఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయుల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె సాబ్జీ, పి బాబురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు పలు దఫాలు ప్రాతినిధ్యం చేసినా పరిష్కారం కాలేదని వివరించారు. శాసనమండలి సభ్యుల కమిటీలో పాఠశాల విద్యాశాఖ సమస్యలు మూడు మాత్రమే ఎజెండాలో చేర్చారని, కీలకమైనవి లేవని వెల్లడించారు. 2008 డిఎస్సీ ఉపాధ్యాయుల పే ఫిక్సేషన్‌లో తేడాలు సవరించాలని కోరారు. రూ.398ల జీతంతో స్పెషల్ టీచర్స్‌గా పనిచేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని తెలిపారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌పై హైకోర్టు కేసుపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 610 జీవో పరిధిలో ఉన్నవారికి ప్రమోషన్స్ ఇవ్వాలని తెలిపారు. పంచాయితీరాజ్, ఎయిడెడ్, మున్సిపల్ రిటైర్డ్ ఉపాధ్యాయులకు అర్ధజీతపు సెలవు నగదుగా మార్చుకొనే సౌకర్యం అమలు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లోని పండిత, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని తెలిపారు. శాశ్వత బదిలీ కోడ్ రూపొందించాలని పేర్కొన్నారు. అంతరరాష్ట్ర బదిలీల కోసం తెలంగాణ ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. ఎసిఇఆర్‌టి షెడ్యూల్ మార్పు చేయకుండా అమలు చేయాలని సూచించారు. పరీక్ష విధానం సమీక్షించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్‌లో అవసరమని గుర్తించిన పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లిగూడెం

కేంద్రబడ్జెట్‌లో ఏపికి మొండిచెయ్యి చూపడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యాన మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని గాంధీ భవన్ వద్ద ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దుర్గా రామచంద్రరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన చట్టంలోని అంశాలను కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

ఆందోళన

జెట్‌సిటీ పేరుతో మా భూములు లాక్కోవద్దు

తహశీల్దార్ కార్యాలయం ఎదుట జక్కంపూడి దళిత రైతులు ఆందోళన

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

జెట్ సిటీ పేరుతో విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలో దళితులు, పేదరైతుల భూములు బలవంతంగా లాక్కోవడం తగదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని రూరల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట జక్కంపూడి, షాబాద్‌లకు చెందిన దళితులు, పేదరైతులు మంగళవారం ఆందోళన చేశారు. వారికి మద్దతు తెలిపిన అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జక్కంపూడి, షాబాద్ ప్రాంతాల్లో దశాబ్దాల కాలం నుంచి దళితులు, పేదరైతులు కొండ, పోరంబోకు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా టిడిపి ప్రభుత్వం ఆ ప్రాంతంలో ఎకనామిక్స్ టౌన్ షిప్ (జెటౌసిటీ) పేరుతో సర్వే జరిపి, వారి ఆధీనంలో ఉన్న భూములను బలవంతంగా లాక్కొని, అక్కడున్న దళితులను వేరే చోటకు తరలించే కుట్ర జరుగుతోందన్నారు.



విజయవాడలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

జక్కంపూడిలో 374 కుటుంబాలు షాబాద్‌లో 242 కుటుంబాల వారు ఉన్నారని, అందులో 115 దళిత కుటుంబాలన్నాయని వివరించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆయా రైతులకు న్యాయం చేయాలన్నారు. రూరల్ తహశీల్దార్ ఎ.రవీంద్రరావు సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం ఎటువంటి సర్వే జరపడం లేదని, ప్రభుత్వం నుంచి సర్వే నిమిత్తం వచ్చామని ఎవరైనా చెప్పినట్లైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి కె.కళ్యాణ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.చంద్రశేఖర్, నాయకులు విజయకుమార్, నరసింహారావు, రమేశ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎంవి చట్ట సవరణ బిల్లును ఆపాలి

ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి సుందరయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోటారు వాహన చట్ట సవరణ బిల్లును రాజ్యసభలో ఆమోదించకుండా ఆపాలని ఎపిఎస్‌ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య డిమాండ్ చేశారు. ఎంవి చట్ట సవరణ బిల్లును ఆపాలని కోరుతూ విజయవాడ ఆర్టీసి హౌస్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుందరయ్య మాట్లాడుతూ రవాణా రంగానికి సవాల్‌గా ఉన్న ఎంవి చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందితే ఆర్టీసిలన్నీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రవాణా రంగాన్ని విదేశీ కార్పొరేట్లకు ఆహ్వానం పలుకుతూ అగ్రిగేటర్లను అనుమతిస్తూ బిల్లులో సవరణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్లు ద్వారా లైసెన్సుల జారీ, రిజిస్ట్రేషన్ల వంటి రాష్ట్రాల అధికారాలు కేంద్రం చేతుల్లోకి పోతాయని, వ్యక్తిగత వాహనాలు యథేచ్ఛగా పెరిగిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథరామిరెడ్డి, కృష్ణా రీజినల్ అధ్యక్షులు పరమేశ్వరరావు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి వ్యతిరేకంగా బిజెపి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

టిడిపి తీరును తప్పుబడుతూ బిజెపి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి గుంటూరు అర్బన్ అధ్యక్షులు అమ్మిశెట్టి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రశ్నించే బిజెపి నేతలపైన టిడిపి నేతలు, కార్యకర్తలు దాడులు చేస్తున్నారని, మిత్ర ధర్మం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు.

అగ్ని క్షిపణి ప్రయోగం సక్సెస్

బాలాసోర్: అణ్వస్త్ర వాహక సామర్థ్యం కలిగిన స్వల్పశ్రేణి ఖండాంతర క్షిపణి అగ్ని-1ను భారత్ మంగళవారం నాడు విజయవంతంగా ప్రయోగించింది. ఒడిషాతీరంలోని క్షిపణి పరీక్షా కేంద్రం నుండి ఈ పరీక్షను నిర్వహించినట్లు రక్షణశాఖ వర్గాలు వివరించాయి. దాదాపు 700 కి.మీ పరిధిలోని లక్ష్యాన్ని ఈ క్షిపణి సునాయాసంగా ఛేదించిందని ఈ వర్గాలు వెల్లడించాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ సర్ఫేస్-టు-సర్ఫేస్ క్షిపణి ప్రయోగాన్ని భారత సైన్యానికి చెందిన స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్ఎఫ్‌సి) శిక్షణా కార్యకలాపాల్లో భాగంగా నిర్వహించినట్లు ఈ వర్గాలు తెలిపాయి. ఈ క్షిపణిని మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రయోగించారు.

సాదిలో సుష్మాస్వరాజ్

విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్ 6వ తేదీన సాదీ అరేబియా పర్యటనకు వచ్చారు. ఈ రోజు సాదీలో ప్రారంభంకానున్న జనద్రీయ ఫెస్టివల్‌ను ఆమె ప్రారంభిస్తారు.



ప్రభుత్వం 'వన్‌మాన్ షో'...పార్టీ 'టు మెన్ ఆర్మీ'

బిజెపిపై శత్రుఘ్న సిన్హా విసుర్లు

నరసింగ్‌పూర్ (మధ్యప్రదేశ్) : ప్రభుత్వంలో కేంద్ర మంత్రులకు విలువ లేకుండా పోయిందని బిజెపి ఎంపి శత్రుఘ్న సిన్హా సోమవారం ఆరోపించారు. ప్రభుత్వం వన్‌మాన్ షోగాను, పార్టీ టు మాన్ ఆర్మీగాను ఉందని విమర్శించారు. "మేము మాత్రమే కాదు. మీరు, చాలా మంది కూడా ప్రభుత్వ పనితీరును వన్‌మాన్ షో, టూ మాన్ ఆర్మీగా పరిగణిస్తున్నారని పార్టీ, ప్రభుత్వం రెండూ కలిసి నిర్ణయాలు తీసుకోవాలి" అని ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షాతో బిజెపి టు మాన్ ఆర్మీ అయ్యిందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానం చెప్పారు. విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్న కారణంగా అక్కడ నుంచి తరలించిన స్థానిక రైతుల డిమాండ్లకు మద్దతుగా బిజెపి నేత యశ్వంత్ సిన్హా నేతృత్వంలో జరుగుతున్న నిరసన బైఠాయింపుల్లో పాల్గొనేందుకు ఆదివారం సాయంత్రం శత్రుఘ్న సిన్హా ఇక్కడకు చేరుకున్నారు. నాలుగు రోజులుగా జరిగిన ఈ ఆందోళనను సోమవారం అర్ధరాత్రి విరమించారు. మంత్రుల హోదా గణనీయంగా తగ్గిపోయిందని, కేంద్ర మంత్రులలో 80 శాతం మంది పేర్లు కూడా ఎవరికీ తెలియవని సిన్హా వ్యాఖ్యా నించారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో మంత్రులకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేదన్నారు. కేవలం ఆకర్షణీయమైన నినాదాలనే ఇస్తున్నారని, అభివృద్ధి పనులు ఏవీ జరగడం లేదని ప్రజలు భావిస్తే ....ఇటువంటి దానికి గతంలో మనం మూల్యం చెల్లించామంటూ ఆయన గుర్తు చేశారు.

ఉగ్రవాదం పట్ల ఆకర్షితులౌతున్న కాశ్మీరీ యువత

కేంద్ర నివేదికకు భిన్నంగా ముఖ్యమంత్రి ప్రకటన

శ్రీనగర్ : కాశ్మీర్‌లో ఉగ్రవాదంతో చేతులు కలుపుతున్న యువత సంఖ్య గత ఏడాది కాలంలో 44 శాతం మేర పెరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ చెప్పారు. మంగళవారం ఆమె రాష్ట్ర శాసనసభలో మాట్లాడుతూ 2016 నుండి ఉగ్రవాదంవైపు ఆకర్షితులవుతున్న స్థానిక యువకుల సంఖ్య 44 శాతం మేర పెరిగిందన్నారు. 2017లో దాదాపు 126 మందికి పైగా యువకులు వివిధ ఉగ్రవాద గ్రూపుల్లో చేరారని, ఇది అంతకు ముందు ఏడాది కన్నా 38 ఎక్కువ అని ఆమె వివరించారు. అయితే కాశ్మీరీ యువత మిలిటెన్సీతో విసిగిపోయి ప్రభుత్వంతో చేతులు కలిపేందుకు ముందుకు వస్తున్నారంటూ గత నెలలో హోం మంత్రిత్వశాఖ వెల్లడించిన నివేదికకు ముఖ్యమంత్రి ప్రకటన భిన్నంగా వుండటం విశేషం. గత ఏడేళ్ల కాలంలో అత్యధికంగా గత ఏడాదిలోనే వివిధ ఉగ్రవాద సంస్థలు యువతను రిక్రూట్ చేసుకున్నాయని ముఫ్తీ వివరించారు. ఆయా ఉగ్రవాద సంస్థల్లో చేరిన వారి సంఖ్య 2015లో 66గా నమోదు కాగా 2016లో 88, 2017లో 126గా నమోదయిందని ఆమె వివరించారు. జమ్మూ కాశ్మీర్‌ను యుద్ధరంగంగా మార్చవద్దని ఆమె ప్రధాని మోడీ, పాకిస్తాన్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ఆధార్‌ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించలేం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : దుర్వినియోగం జరగడానికి అవకాశాలు వున్నాయనే కారణంతో ఏ చట్టాన్నీ రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించలేమని సుప్రీం కోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. కీలకమైన ఆధార్ కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి చంద్రచూడ్ ఈ వ్యాఖ్య చేశారు. దీనిపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ ఆధార్ చట్టం ఇప్పటికే దుర్వినియోగమైందని, ప్రతిరోజూ దుర్వినియోగం అవుతోందని పేర్కొన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారిత బయోమెట్రిక్ డేటా పౌరుల గోప్యతను ఎలా ముప్పులోకి నెడుతోందో సిబల్ చేసిన వాదనలను ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం వింది. డేటాను నియంత్రించే దేశమే ప్రపంచ దేశాలను నియంత్రించగలుగుతుందని దావోస్ సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రకటనను కపిల్ సిబల్ ఈ సందర్భంగా ఉదహరించారు. ప్రధాని అభిప్రాయంతో తాను కూడా ఏకీభవిస్తున్నానని అన్నారు. ఆధార్ చట్టాన్ని విజయవంతంగా అమలు చేయాలన్న కోర్టు నిర్ణయం వల్ల రాబోయే కాలంలో తీవ్ర పర్యవసానాలు వుంటాయని, భవిష్యత్ తరాలను దెబ్బతీస్తుందని సిబల్ పేర్కొన్నారు. .

ఆధార్‌తో డిపాజిట్లకు ప్రమాదం

న్యూఢిల్లీ : డిపాజిట్‌దారులు బ్యాంకులలో దాచుకున్న డబ్బుకు ఆధార్ అనుసంధానంతో ప్రమాదం ముంచుకొస్తున్నది. ఇతరుల ఆధార్ నంబర్లను వినియోగించి బ్యాంకులలోని డబ్బును మోసపూరితంగా విత్‌డ్రా చేసుకున్న ఘటనలు అక్కడక్కడా జరుగుతున్నాయని రాజ్యసభలో ప్రభుత్వం అంగీకరించింది. ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రసాద్ శుక్లా రాతపూర్వక సమాధానంలో ఈ విషయాలను వెల్లడించారు. కనీసం నాలుగు ప్రభుత్వరంగ బ్యాంకులలో ఆరు ఘటనలలో కోటి యాభైలక్షల రూపాయలను కాజేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

రాజ్యసభలో ప్రజాస్వామ్యం ఖూని

ప్రతిపక్షాల ఆరోపణ

న్యూఢిల్లీ : రాజ్యసభలో తమకు మాట్లాడటానికి అవకాశాన్ని నిరాకరించటం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిందని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడుకు ప్రతిపక్షాలు లేఖరాశాయి. ఈ లేఖపై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షపార్టీలు సంతకం చేశాయి. పార్లమెంటులో తమ వ్యూహం గురించి చర్చించుకోవటానికి సమావేశం అయిన సందర్భంగా ప్రతిపక్షాలు ఈ లేఖను ఛైర్మన్‌కు పంపాయి. బడ్జెట్ సమావేశాలలో మొదటిసారిగా ప్రతిపక్షాలు అన్నీ కలిసి పార్లమెంటును బహిష్కరించిన తర్వాత ఈ సమావేశాన్ని నిర్వహించారు. రాజ్యసభను నిర్వహిస్తున్న తీరుపట్ల తాము ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మొదటి దశగా ఛైర్మన్‌కు మేం లేఖ రాస్తున్నామని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓ బ్రియాన్ చెప్పాడు. ఈ అంశంపై ప్రతిపక్షాలు తగిన వ్యూహాన్ని రూపొందించుకొంటున్నాయని, తమ డిమాండ్లను అంగీకరించకపోతే తరువాతి దశ ఆందోళనకు సిద్ధం కావాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి.

ఎన్‌డిఎ పాలనలో తగ్గుతున్న రైతుల ఆదాయం

తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం

బిజెపి నేత యశ్వంత్ సిన్హా



కోల్‌కతా : నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయం సంక్షోభం తీవ్రమైందని ఒక అధ్యయనం వెల్లడించిందని, సంక్షోభ పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదని బిజెపి నాయకులు యశ్వంత్‌సిన్హా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, . గత నాలుగేళ్లలో రైతుల ఆదాయం 1.30 శాతం క్షీణించిందని ఆయన చెప్పాడు..కోల్‌కతా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో యశ్వంత్ సిన్హా మాట్లాడుతే 'దేశంలో గ్రామీణ ప్రాంత పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. వ్యవసాయ వృద్ధి క్షీణించడం, రైతులు కష్టాల్లో ఉండటం దీనికి కారణాలు. కనీస మద్దతుతో ధరతో పోలిస్తే అందులో మూడో వంతు లేదా 50 శాతం ధర కూడా రైతుకు లభించడం లేదని ఆయన తెలిపారు.

యుపిఎ ప్రభుత్వం తొలి నాలుగేళ్లలో వున్న వ్యవసాయ వృద్ధి 3.8తో పోలిస్తే మోడీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ వృద్ధి 1.9 శాతం తగ్గిందని సిన్హా వివరించారు. అలాగే గతంలో రైతుల ఆదాయంతో పోలిస్తే ఈ నాలుగేళ్లలో వారి ఆదాయం 1.30 శాతం తగ్గిందని కూడా తెలిపారు. 2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెబుతున్నారని, కానీ నాలుగేళ్లలో వారి ఆదాయం క్షీణించిందని, మరో నాలుగేళ్లలో ఏమీ సాధిస్తారని సిన్హా ప్రశ్నించారు. అలాగే ఈ నెల ఒకటిన ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను 'చిత్తు కాగితాలు'గా సిన్హా విమర్శించారు. బడ్జెట్‌లో పేర్కొన్న ప్రతి ప్రతిపాదనకు ఆర్థిక మద్దతు ఉండాలని, లేకపోతే, బడ్జెట్ పత్రాలు చిత్తు కాగితాలుగా మారతాయని ఆయన చెప్పారు.

బిజెపి నుంచి బయటకు వెళ్ళను

బిజెపి నుంచి బయటకు వెళ్లనని యశ్వంత్ సిన్హా తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. పార్టీ నుంచే తాను వెళ్లనని, వాళ్ళే తనను పంపితేనే బయటకు వెళతానని, బిజెపి అధికారంలో లేనప్పుడు 2004 నుంచి 2014 నుంచి పార్టీ కోసం తాను చాలా కష్టపడ్డానని, తాను ఎందుకు బయటకు వెళ్లాలని ప్రశ్నించారు. మోడీకి అనేక లేఖలు రాసానని, కానీ ఎలాంటి ప్రతిస్పందన రాలేదని అన్నారు. బిజెపి ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆరెస్సెస్ నియంత్రణలో ఉన్నతాధికారులు

అస్సాం మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్



గువహతి : రాష్ట్రంలోని ఉన్నతాధికారులను ఆరెస్సెస్ నియంత్రిస్తున్నదని అస్సాం మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ మంగళవారం ఆరోపించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి తదితర కొంతమంది ఉన్నతాధికారులను ఆరెస్సెస్ నియంత్రిస్తున్నదన్నారు. భిన్న మతాలు, సంస్కృతి, భాషలు, జాతులకు నిలయంగా ఉన్న రాష్ట్రంలో ఆరెస్సెస్ హిందుత్వ ఎజెండాను రుద్దేందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కె. పిపర్సేనియా సహాయ పడుతున్నారని గొగోయ్ ఆరోపించారు. "పిపర్సేనియా ఆరెస్సెస్ కోసం పనిచేస్తున్నారన్నది సుస్పష్టం. ఆరెస్సెస్ నేతలతో ఆయన సమావేశమయ్యాడనడానికి, ఆ సంస్థ నిర్వహించిన మీటింగులకు హాజరయ్యారనడానికి తగిన ఆధారాలు ఉన్నాయి." అని గొగోయ్ విలేకరులతో అన్నారు.

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజునే కాంగ్రెస్ పార్టీ సమావేశాలను బహిష్కరించింది. అసెంబ్లీ సెంట్రల్ హాల్‌కు కాషాయరంగు వేసినందుకు నిరసనగా కాంగ్రెస్ బహిష్కరించింది. గవర్నర్ జగదీష్ ముఖితో టీ పార్టీని ఆనవాయితీగా ఈ హాలులోనే జరుపుకుంటారు. కాషాయ టీ పార్టీని జరుపుకునే ఈ హాలుకు "అసెంబ్లీ కాషాయీకరణ" అని కాంగ్రెస్ పార్టీ పేరు పెట్టింది. రాష్ట్ర డిజిపి ముఖేష్ సహాయ్ తటస్థంగా వ్యవహరించే తీరుపై కూడా గొగోయ్ సందేహం వ్యక్తం చేశారు. ముఖేస్ సహాయ్ కూడా ఆరెస్సెస్ ఆదేశాలను పాటిస్తున్నారన్న సందేహం ఉన్నదని కాని అందుకు తగిన ఆధారాలు తన వద్ద లేవని ఆయన అన్నారు. గొగోయ్ ఆరోపణలపై పిపర్సేనియా స్పందించలేదు. సహాయ్ కూడా ఈ ఆరోపణపై స్పందించేందుకు నిరాకరించారు. శాంతి భద్రతలు నిర్వహించే తన విధి పట్ల తాను చాలా స్పష్టంగా ఉన్నానని తాను ఉద్యోగ నిబంధనలకు, దేశ రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న ప్రజా సేవకుడినని సహాయ్ ఈ సందర్భంగా చెప్పారు.

మేం చెత్త ఏరుకునే వాళ్ళం కాదు!

కేంద్రంపై సుప్రీం ఘాటు వ్యాఖ్య

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి మంగళవారం కేంద్ర ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం సమర్పించిన 845 పేజీల అఫిడవిట్‌లో అసమగ్ర సమాచారం ఉండటంపై మండి పడింది. సుప్రీం కోర్టు 'గార్బేజ్ కలెక్టర్ (చెత్త సేకరణదారులు)' కాదని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను రికార్డు చేసేందుకు నిరాకరించింది. చెత్తను తమ ముందు పోగు వేయద్దని మందలించింది. కోర్టును ప్రభావితం చేయ డానికి ప్రయత్నించొద్దని, దానిని తాము ఆమోదించబోమని న్యాయమూర్తులు మదన్ బి లోకుర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉండాలని హెచ్చరించింది. 2016 నాటి ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలలోని అంశాలకు అనుగుణంగా రాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాలు రాష్ట్ర స్థాయి అడ్వయిజరీ బోర్డులను ఏర్పాటు చేశాయో లేదో తెలియచేస్తూ మూడు వారాలలోగా ఒక చార్ట్‌ను తమ ముందుంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఆయా రాష్ట్రాలలో, కేంద్ర పాలిత ప్రాంతాలలో అడ్వయిజరీ బోర్డులను ఏ తేదీన ఏర్పాటు చేశారు, సభ్యుల పేర్లు, వారు ఏవైనా సమావేశాలు నిర్వహిస్తే వాటి వివరాలు చార్ట్‌లో పేర్కొవాలని తెలిపింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం తరపు న్యాయవాది మాట్లాడుతూతాము 845 పేజీల అఫిడవిట్‌ను దాఖలు చేయబోతున్నట్లు చెప్పారు. అయితే ధర్మాసనం అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పలేక పోయారు.

ప్రముఖ మలయాళ కవిపై హిందూత్వ శక్తుల దాడి

కొల్లాం : ప్రముఖ మలయాళ కవి కె. శ్రీకుమార్‌పై దాడి చేసిన ఆరుగురు హిందూత్వ కార్యకర్తల్ని సోమవారం రాత్రి సమయంలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, దాడి చేసిన వారిలో ఒకరు బిజెపిలో సభ్యుడని పోలీసులు వివరించారు. ఒక బహిరంగ సభలో వేదికపైనుండి శ్రీకుమార్ కిందికి దిగుతున్నప్పుడు ఆయనను కొందరు బెదిరించారని పేర్కొన్నారు. అనంతరం ఆయనపై దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దళితులు, నాయర్ కమ్యూనిటికీ మధ్య ఆలయ గోడ ఘర్షణ గురించి బహిరంగ సభలో ఆయన మాట్లాడటంతో విభేదించిన దుండగులు ఈ దాడికి పాల్పడ్డారు. ఇటీవల దళితులు ఈ గోడను "కుల గోడ"గా పేర్కొన్నారని, దళితుల్ని రానీయకుండా ఈ గోడను నిర్మించారని శ్రీకుమార్ ప్రస్తావించారు.

మత్స్యకారుల్ని విడుదల చేయాలంటూ ఆందోళన

చెన్నై : తమిళనాడుకు చెందిన 12మంది మత్స్యకారుల్ని విడుదల చేయాలని డిమాండు చేస్తూ మంగళవారం ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. గత నెలలో శ్రీలంక అధికారులు తలైమన్నార్ సమీపంలో చేపల వేట సాగిస్తుండగా మత్స్యకారుల్ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. శ్రీలంక ప్రాదేశిక జలాల్లో చేపల వేటను నిషేధిస్తూ చట్టాన్ని ప్రతిపాదించిన సమయంలో ఈ అరెస్టులు జరిగాయని అధికారులు తెలిపారు. సుమారు 50 బోట్లను, వలల్ని శ్రీలంక అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తమిళనాడు, పుదుచ్చేరి మత్స్యకారుల సంఘం జనరల్ సెక్రటరీ ఎన్.జె. బోస్ తెలిపారు.

ఒకే సిరంజిని వాడటంతో 21మందికి హెచ్ఐవి

ఆర్ఎంపి వైద్యుని నిర్వాకం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లోని ఒక ప్రాంతంలో ఆర్ఎంపి వైద్యుడు హెచ్ఐవి సోకిన వ్యక్తికి వాడిన సిరంజిని ఇతరులకు వాడటంతో 21మందికి ఆ వ్యాధి సోకినట్లు అధికారులు గుర్తించారు. ఒకే ప్రాంతంలో ఎక్కువ మంది హెచ్ఐవి బాధితులు ఎందుకు ఉన్నారని చేపట్టిన విచారణలో ఈ విషయం వెలుగులోకొచ్చిందని చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఎస్‌పి. చౌదరి తెలిపారు. జనవరి 24, 25, 27 తేదీలలో బంగార్మౌలో ఉన్న ప్రంగనేజ్, చక్మీర్పూర్ ప్రాంతాల్లో వైద్య పరీక్షలు నిర్వహించిం దన్నారు. అందులో భాగంగా 566 మందిని పరీక్షించగా, వారిలో 21మందికి ఎయిడ్స్ సోకినట్లు గుర్తించిందన్నారు. బంగార్మౌకు సమీప గ్రామంలో రాజేంద్రకుమార్ అనే ఆర్ఎంపి వైద్యుడు చికిత్స నిమిత్తం ఒకే సిరంజిని పలువురికి ఉపయోగించడంతో ఎక్కువ మందికి ఆ వ్యాధి సోకిందని నిర్ధారించారు.

మొదటి పేజీ తరువాయి

సోమవారం రాత్రి ప్రకటించారు. ఈ ప్రకటనను న్యాయవ్యవహారాల మంత్రి అజిమా షకూర్ ప్రభుత్వ టీవీ ద్వారా వెల్లడించారు. తమ దేశం అత్యంత సురక్షితంగా వుందని ఆయన మాల్దీవుల ప్రజలు, ఆ దేశాన్ని సందర్శిస్తున్న అంతర్జాతీయ పర్యాటకులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. సోమవారం అర్ధరాత్రి నుండి అమలులోకి వచ్చిన ఎమెర్జెన్సీ నిబంధనల మేరకు కొన్ని హక్కులు నియంత్రింప బడతాయని, సాధారణ ప్రజల దైనందిన జీవితం, సేవలు, వ్యాపారాలపై ఎటువంటి ప్రభావమూ వుండదని అధ్యక్ష కార్యాలయం సోమవారం అర్ధరాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. మాల్దీవుల రాజ్యాంగ నిబంధనల ప్రకారం దేశాధిపతికి వున్న ప్రత్యేక హక్కుల మేరకు ఎమర్జెన్సీ విధించినట్లు స్థానిక మీడియా తన వార్తా కథనాలలో వెల్లడిం చింది. ఎమర్జెన్సీ పర్యాటక రంగాన్ని ఏ మాత్రం ఇబ్బంది పెట్టబోదని, రిసార్ట్స్, విమాన సర్వీసులు, యధావిధిగా పనిచేస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్, ఉపాధ్యక్షుడు అహ్మద్ అదీబ్‌తో సహా పలువురు రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలంటూ మాల్దీవుల సుప్రీంకోర్టు గత వారం ప్రభుత్వాన్ని ఆదేశించటంతో అక్కడ అశాంతికి తెరలేచింది. వారిపై సక్రమమైన రీతిలో న్యాయవిచారణ జరిగే వరకూ వారిని స్వేచ్ఛగా విడుదల చేయాలని సుప్రీంకోర్టు తన ఆదేశాలలోపేర్కొంది. దీనిపై స్పందించిన అధ్యక్షుడు యమీన్ ఈ ఆదేశాల అమలులో ఎదురయ్యే ఇబ్బందులను పేర్కొంటూ సుప్రీంకోర్టుకు మూడు లేఖలను సంధించారు. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌ను అభిశంసించాలని సుప్రీం ఆదేశించే అవకాశాలున్నట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించవద్దంటూ మాల్దీవుల అటార్నీ జనరల్ ఆదివారం నాడు ప్రభుత్వం వ్యవస్థలను ఆదేశించిన విషయం తెలిసిందే.

మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం



మాజీ రక్షణ మంత్రి కల్నల్ నజీమ్

అరెస్ట్ భయంలో ప్రతిపక్ష ఎంపిలు

మాజీ అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్‌తో పాటు ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను, మాజీ ఉపాధ్యక్షుడ్ని కూడా మాల్దీవుల ప్రత్యేక పోలీసు బృందం అరెస్ట్ చేసింది. దీనితో తదుపరి టార్గెట్ తామే కానున్నామంటూ ప్రతిపక్ష ఎంపిలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్షుడు యమీన్ ఎమర్జెన్సీ ప్రకటనను 48 గంటలలోగా పార్లమెంట్ ఆమోదం కోసం పంపాలని, పార్లమెంట్ ఆమోదించకుంటే ఈ ప్రకటన రద్దవుతుందని మాజీ అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది హన్సూసూద్ చెప్పారు. దీనితో వెంటనే ప్రభుత్వం తమను అరెస్ట్ చేస్తుందంటూ ప్రతిపక్ష సభ్యులు భయపడుతున్నారని ఆయన వివరించారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్‌తో పాటు మరో న్యాయమూర్తిని మంగళవారం ఉద యం పోలీసులు అరెస్ట్ చేశారు. తమను ఏ సమయంలో నైనా పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం వుందని ప్రతిపక్ష ఎంపి, న్యాయ వాది ఆలీహుస్సేన్ ఫోన్‌లో మీడియాకు చెప్పారు. సైన్యం పార్ల మెంట్ భవనాన్ని తన ఆధీనంలోకి తీసుకునే అవకాశం వుందని, అధ్యక్షుడు తన ఇష్టం వచ్చినట్లు ఆదేశాలు జారీ చేయవచ్చని ఆయన వివరించారు.

ప్రపంచ దేశాల ఆందోళన

మాల్దీవుల్లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న పరిణామాలపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని భారత్, చైనా, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు అధ్యక్షుడు యమీన్‌పై వత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. మాల్దీవుల పరిస్థితిపై తీవ్రంగా స్పందించిన చైనా అక్కడి పరిస్థితులు సాధ్యమైనంత త్వరలో సద్దుమణుగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేసింది. అక్కడి పరిస్థితులు సద్దు మణిగే వరకూ మాల్దీవుల పర్యటనకు ఎవరూ వెళ్లవద్దని చైనా ప్రభుత్వం తమ దేశ పౌరులకు సూచించింది. విదేశాంగశాఖ ప్రతినిధి గెంగ్ షువాంగ్ మంగళవారం బీజింగ్‌లో మీడియాతో మాట్లాడుతూ మాల్దీవుల్లో పరిస్థితి చక్కబడే వరకూ అక్కడికి వెళ్లాలనుకున్న ఆలోచనలను వాయిదా వేసుకోవాలని పౌరులకు సూచిస్తున్నట్లు చెప్పారు. మాల్దీవుల్లో చైనా సంస్థలను, సిబ్బందిని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మాలేలోని అధికారులను చైనా కోరినట్లు ఆయన వివరించారు.

భారత్ జోక్యం కోరిన నషీద్



ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొం టున్న మాల్దీవుల్లో పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన జోక్యం చేసుకోవాలని ఆ దేశ మరో మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ భారత్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం శ్రీలంకలో వున్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను అక్కడి ప్రభుత్వం వ్యతిరేకించటం అంతా ఓ కుట్ర ప్రకారమే జరుగుతోందన్నారు. యమీన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సైనిక దళాలు దేశ రాజ్యాంగానికి కట్టుబడి వ్యవహరించాలని ఆయన సూచించారు. మాల్దీవుల్లో పరిస్థితిని చక్కదిద్దేందుకు దౌత్యనిపుణులను, వారికి మద్దతుగా సైన్యాన్ని పంపాలని ఆయన ఒక ట్వీట్‌లో భారత్‌ను కోరారు. ముఖ్యంగా అరెస్టయిన రాజకీయ, న్యాయ ప్రముఖులను వెంటనే విడుదల చేయించేందుకు భారత్ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మాల్దీవుల ప్రభుత్వ నేతలు అమెరికన్ బ్యాంకుల ద్వారా నిర్వహించే ఆర్థిక లావాదేవీలను వెంటనే నిలిపివేసే విధంగా అమెరికా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేకం

నిజాల్ని కప్పిపెట్టే ప్రయత్నం

- న్యాయవాదులు పల్లవ్ సిసోడియా, హరీష్ సాల్వేలపై దుష్యంత్ దవే ఆగ్రహం
- లోయా మృతి కేసులో అమిత్ షాను కాపాడటమే వీరి లక్ష్యమని ఆరోపణలు

ముంబయి : సీబీఐ న్యాయమూర్తి బీహెచ్.లోయా మృతి కేసుపై సుప్రీంకోర్టులో వాదోపవాదాలు వాడివేడిగా జరుగుతున్నాయి. ఈకేసుకు సంబంధించి నిజాలు బయటకు రావటం ఇష్టంలేని 'అధికార వర్గాలు' (మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని మోడీ సర్కార్) అనేక కుయుక్తులు పన్నుతున్నాయి. కేసును తప్పుదారి పట్టిస్తూ అసలు కుట్రదారుల్ని తప్పించే వ్యూహాల్ని కొంతమంది (న్యాయవాదులు పల్లవ్ సిసోడియా, హరీష్ సాల్వే) అమలుజేస్తున్నారు. ఈ కేసులో మొదట్నుంచీ గట్టిగా నిలబడుతున్న దుష్యంత్ దవేపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కక్షగట్టింది. ఒక న్యాయవాదిగా ఆయన హక్కులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసుకు...లోయా మృతికి సంబంధముందని దుష్యంత్ దవే సుప్రీం ముందు వాదన వినిపించారు. ఆనాడు సాక్ష్యం చెప్పినవారిని తిరిగి విచారిం చాలని కోరుతున్నారు. తెహసీన్ పూనావాలా అనే వ్యక్తి వేసిన పిల్‌పై సీనియర్ న్యాయవాది వి.గిరి వాదనలు వినిపించారు.

అమిత్ షాను తప్పిం చటం కోసం న్యాయవాదులు సిసోడియా, హరీష్ సాల్వేలు చేస్తున్న ప్రయత్నాల్ని దుష్యంత్ దవే కోర్టు ముందు ఉంచారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందిరా జైసింగ్, వి.గిరి...కూడా సిసోడియా, హరీష్ సాల్వేల వాదనను తీవ్రంగా తప్పుబట్టారు. బాంబే లాయర్స్ అసోసి యేషన్ తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే సుప్రీంలో ఒక దరఖాస్తు దాఖలు చేశారు.

లోయాది సహజ మరణం...అని వాంగ్మూలమిచ్చిన 11మంది సాక్ష్యుల్ని (అప్పటి బాంబే హైకోర్టు ఇద్దరు న్యాయమూర్తులతో సహా) క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని ఈ దరఖాస్తులో దుష్యంత్ దవే సుప్రీంకోర్టును కోరారు. ఆనాడు... కమిషనర్ ఆఫ్ స్టేట్ ఇంటెలిజెన్స్ (సీఎస్ఐ) ముందు స్వచ్ఛందంగా ఈ 11మంది సాక్ష్యం ఇచ్చారా ? అన్నదానిపై దవే అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే లోయా తండ్రి, సోదరి, కుమారుడు ఇచ్చిన వీడియో వాంగ్మూలాల్ని, ఇతర సాక్ష్యాల్ని సమర్పించే అవకాశాన్ని ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టును దవే కోరారు. సుప్రీం ధర్మాసనం కేసును ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది.

తాజాగా ఏం జరిగింది ?

ఈకేసుకు సంబంధించి దాఖలైన పిల్ తరపున పల్లవ్ సిసోడియా వాదనల్ని వినిపించారు. ఈయన గతంలో సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు విచారణ సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తరపున వాదనలు వినిపించారు. ఇప్పుడు జర్నలిస్టు లోనే తరఫున పిల్ దాఖలు చేయటాన్ని ఎలా అర్థం చేసుకోవాలని దుష్యంత్ దవే ప్రశ్నించారు. లోయా మృతిపై కార్వాన్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికా కథనాల్లో వైరుధ్యముందని, దీనికి సంబంధించి నిజానిజాల్ని తేల్చాలని సిసోడియా వాదన వినిపించారు. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌కు, లోయా మృతికి సంబంధం లేదన్నట్టు మాట్లాడారు. దీనిపై సుప్రీం సీనియర్ న్యాయవాదులు ఇందిరా జైసింగ్, దుష్యంత్ దవే స్పందించారు. స్వతంత్ర దర్యాప్తు అవసరం లేదనుకుంటే పిల్ ఎందుకు దాఖలు చేశారని సిసోడియా తీరును తప్పుబట్టారు. అలాగే మహారాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించడానికి వచ్చిన హరీష్ సాల్వే, అమిత్ షాకు అనుకూలంగా వాదనలు చేయటమేంటని దవే, జైసింగ్ ప్రశ్నించారు.

సంక్షిప్తం

కులభూషణ్ జాదవ్‌పై మరో కేసు

ఇస్లామాబాద్ : భారత్ తరపున గూఢచారిగా వచ్చాడంటూ పాకిస్తాన్ అక్రమంగా నిర్బంధించిన కులభూషణ్ జాదవ్‌పై మరో కేసును పెట్టినట్లు 'డాన్' పత్రిక వెల్లడించింది. జాదవ్‌పై ఉగ్రవాదం, మోసం, విద్రోహం కేసులు పెట్టి విచారణ చేపట్టినట్లు పత్రికలో పేర్కొంది. గత సంవత్సరం జాదవ్‌ను అరెస్టు చేసి మరణ శిక్షను విధించిన సంగతి తెలిసిందే. కాగా, భారత్ జోక్యంతో మరణ శిక్షను వాయిదా వేశారు. ప్రస్తుత కేసులో చార్జిషీటు నమోదు చేసినట్లు పేర్కొంది.

తైవాన్‌లో భూకంపం

కూలిన హోటల్‌లో 30 మంది దిగ్భంధం!

తైపీ : తైవాన్‌లో మంగళవారం రాత్రి భూకంపం సంభవించింది. 6.4 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపానికి హులీన్ నగరంలోని ఉన్న హోటల్ నేలమట్టయింది. ఈ హోటల్‌లో 30 మంది చిక్కుకున్నట్లు స్థానిక మీడియాలో వార్తలు వస్తున్నాయి. భూంకపానికి ఈ హోటల్‌తో పాటు, అనేక ఇతర భవంతలు కూడా ధ్వంసమైనట్లు వార్తలు వస్తున్నాయి. తైవాన్‌లో ఆదివారం కూడా 6.1 తీవ్రతతో భూకంపం ఏర్పడింది. 1999లో తైవాన్‌లో 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపంలో 2,400 మంది మృతి చెందారు.

భారత్ నావికులతో ఉన్న ఆయిల్ నౌక విడుదల

ముంబయి : భారత్‌కు చెందిన 22 మంది నావికులతో కూడిన ఆయిల్ ట్యాంకర్ నౌకను సముద్రపు దొంగలు మంగళవారం ఆఫ్రికాకు వాయువ్య ప్రాంతమైన బెనిన్ తీరంలో విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈనెల 1న నౌక కనిపించకుండా పోయిన సంగతి తెలిసిందే. కాగా, నౌకలోని సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మెరీన్ ఎక్స్‌ప్రెస్ నౌకను కెప్టెన్ సురక్షితంగా తీసుకొచ్చినట్లు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ మాలిని శంకర్ తెలిపారు. నైజీరియాలో స్థానిక సంస్థలతో బారత్ చర్చించిందని, దీంతో ఈ నౌక విడుదలకు చేసిన ప్రయత్నాలు ఫలించాయని అధికారి పేర్కొన్నారు.

రోదసిలోకి దూసుకెళ్లిన 'స్పేస్ ఎక్స్'

మియామి : చంద్ర, అరుణగ్రహ యానాన్ని సులభతరం చేయటమే లక్ష్యంగా చేసుకుని నిర్మించిన 'ప్రపంచపు అత్యంత శక్తివంతమైన రాకెట్' స్పేస్ ఎక్స్ ప్రయోగపరీక్ష విజయవంతమైంది. ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ అంతరిక్ష కేంద్రం నుండి మంగళవారం మధ్యాహ్నం (స్థానిక కాలమానం ప్రకారం) 1.30గంటల సమయంలో ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఫాల్కన్ హెవీ పేరుతో నిర్మించిన ఈ రాకెట్ వినియోగంపై నాసా తుది నిర్ణయం తీసుకుంటుందని ఎబ్రీ రిడిల్ ఎయిరోనా టికల్ యూనివర్శిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎరిక్ సీడ్‌హౌస్ వివరించారు.

తీవ్రంగా కురుస్తున్న మంచు



అమెరికాలో తీవ్రంగా మంచు కురుస్తుండటంతో ఉష్ణోగ్రత మైనస్ 15 డిగ్రీలకు పడిపోయింది.

ఉ. కొరియా నేతలతో భేటి : టిల్లర్‌సన్

లిమా : అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ లేదా ఇతర అధికారులు వచ్చే వారం వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా ఉత్తర కొరియా అధికారులతో సమావేశం కావచ్చని విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ తెలిపారు. ప్యాంగ్‌చాంగ్‌లో జరగనున్న ఒలింపిక్స్ క్రీడలకు హాజరయ్యే ఉత్తర కొరియన్లతో సంబంధాలు పెట్టుకోబోమని గతంలోనే వాషింగ్టన్ పేర్కొంది. అయితే, ఉత్తర కొరియా తన అణు కార్యక్రమాన్ని విడనాడేవరకు అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలు జరిపేది లేదని అమెరికా తేల్చి చెప్పింది. ఉత్తర కొరియా ప్రతినిధి బృందంతో సమావేశం కావాలంటూ అందచేసిన ఆహ్వానాన్ని పెరూ పర్యటనలో వున్న పెన్స్ అంగీకరిస్తారా లేదా అని ప్రశ్నించగా ఆ అవకాశాన్ని తోసిపుచ్చలేమని టిల్లర్‌సన్ తెలిపారు. అక్కడ అవకాశం దొరుకుతుందో లేదో చెప్పలేమని, అయితే అవకాశం దొరికితే ఖచ్చితంగా పరిశీలిస్తామని చెప్పారు. శుక్రవారం ఒలింపిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందుగా పెన్స్ అలాస్కా, టోక్యో, సియోల్‌ల్లో పర్యటించనున్నారు. ఉపాధ్యక్షుడైన తర్వాత పెన్స్ ఈ ప్రాంతంలో పర్యటించడం ఇది రెండవసారి. దౌత్య పద్ధతులు, ఆంక్షలు విధించడం ద్వారా ఉత్తర కొరియాపై ఒత్తిడి పెంచాలన్నది అమెరికా వ్యూహంగా వుంది.

కాబూల్ సైనిక స్థావరంపై దాడి : అధికారుల తొలగింపు

కాబూల్ (ఆఫ్ఘనిస్థాన్) : కాబూల్‌లోని సైనిక స్థావరంపై జరిగిన భీకర దాడి ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంతో వ్యవహరించారని పేర్కొంటూ ఇద్దరు జనరల్స్‌తో సహా ఏడుగురు ఆఫ్ఘన్ సైనికాధికారులను ఉద్యోగాల నుంచి తొలగించినట్లు ఆఫ్ఘన్ అధ్యక్షులు అష్రఫ్ ఘని మంగళవారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 29న కాబూల్‌లోని సైనిక స్థావరంపై ఐదుగురు సాయుధులు, ఆత్మాహుతి బాంబర్లు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 11 మంది సైనికులు మృతి చెందగా, 16మందికి గాయాలయ్యాయి. ఈ దాడికి తమదే బాధ్యత అంటూ ఐసిస్ గ్రూప్ ప్రకటించింది. తమ విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఇద్దరు జనరల్స్‌తో సహా ఏడుగురు ఉన్నతస్థాయి అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించామని, దాడి సంఘటనపై మరింత లోతైన దర్యాప్తుకు ఆదేశించామని ఘని ట్వీట్ చేశారు.

పర్యాటకులు, విద్యార్థులకు

ఆరోగ్య సర్‌చార్జి రెట్టింపు చేసిన బ్రిటన్

లండన్ : బ్రిటన్ పర్యాటకులకు, భారత్‌తో సహా ఇతర దేశాల విద్యార్థులకు ఆరోగ్య సర్‌చార్జిని రెట్టింపు చేయాలని భావిస్తున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. యురోపియన్ యూనియన్‌లోని సభ్య దేశాలు కాకుండా ఇతర దేశాల నుండి వచ్చే విద్యార్థులకు ఈ మొత్తం ఏడాదికి 400పౌండ్లకు చేరుకుంది. 2015 ఏప్రిల్‌లో ఈ సర్‌చార్జిని మొదటగా ప్రవేశపెట్టారు.
200 పౌండ్లుగా వున్న ఈ చార్జి 400 పౌండ్లకు పెరగనుంది. విద్యార్థులకు అందచేసే రాయితీ 150 పౌండ్ల నుండి 300 పౌండ్లకు పెరగనుంది. బ్రిటన్‌లో పని చేయడానికి, చదువుకోవడానికి, లేదా కుటుంబ సభ్యులను కలుసుకోవడానికి వచ్చి ఆరు మాసాలకు పైగా వుండాలనుకుంటే వారు ఈ మొత్తాన్ని చెల్లించాల్సి



వుంటుంది. నిధుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఎన్‌హెచ్‌ఎస్) కోసం అదనపు నిధులు సమకూర్చేందుకు గానూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఎస్‌ను సక్రమంగా నిర్వహించాలంటే బ్రిటన్‌కు వచ్చే వారు కూడా ఈ దిశగా కొంత మొత్తాన్ని అందచేయడమే సరైన చర్య అని భావించామని బ్రిటన్ ఇమ్మిగ్రేషన్ మంత్రి కరోలిన్ నోక్స్ తెలిపారు.
ఇతర దేశాల కన్నా బ్రిటన్‌లోనే ఈ సర్‌చార్జి చాలా తక్కువ అని అన్నారు. ఇలా సమకూరిన ఆదాయం మొత్తంగా నేరుగా ఎన్‌హెచ్‌ఎస్‌కు వెళ్లిపోతుందని చెప్పారు. ఆరోగ్య శాఖ అంచనాల ప్రకారం, ఏటా సగటును ఒక వ్యక్తికి 470పౌండ్లను ఎన్‌హెచ్‌ఎస్ ఖర్చు చేస్తోంది. ఇప్పుడు పెంచనున్న చార్జీల వల్ల ఏటా 22కోట్ల పౌండ్లు అదనంగా వస్తుందని అంచనా వేస్తున్నారు.

పాక్‌కు రక్షణయేతర సాయం ఆపండి

అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు

వాషింగ్టన్ : పాకిస్తాన్‌కు రక్షణయేతర సాయాన్ని అందచేయడాన్ని విరమించాలని కోరుతూ అమెరికా ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. తీవ్రవాదులకు సైనిక సాయాన్ని, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని పాక్ అందచేస్తున్నందున ఈ చర్య తీసుకోవాలని అమెరికా నిర్ణయించింది. పాక్‌కు అందచేసేందుకు ఉద్దేశించబడిన ఆ మొత్తాన్నంతటినీ అమెరికాలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మళ్లించాలని ఆ బిల్లు కోరుతోంది. కాంగ్రెస్ సభ్యులు మార్క్ శాన్‌ఫర్డ్, థామస్ మస్సీలు బిల్లును ప్రవేశపెట్టారు. అమెరికా పౌరులు చెల్లిస్తున్న పన్నుల మొత్తాన్ని పాకిస్తాన్‌కు పంపకుండా అమెరికా విదేశాంగ శాఖను, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యుఎస్ ఎయిడ్)ను ఈ బిల్లును నిషేధిస్తోంది. అందుకు బదులుగా ఈ నిధులను హైవే ట్రస్ట్ ఫండ్‌కు బదలాయించి అమెరికాలో రహదారుల నిర్మాణానికి ఉపయోగించాలని కోరుతోంది. పాకిస్తాన్ అంతా తెలిసే తీవ్రవాదులకు అన్ని రకాల వనరులను సమకూరుస్తోందని వారు విమర్శించారు. కావాలని తీవ్రవాద సంస్థలకు సాయపడే పాకిస్తాన్‌కు మనం సాయపడరాదని మస్సీ కోరారు. విదేశాలకు ఇటువంటి సాయం అందచేయడానికి బదులు మన దేశంలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి ఉపయోగించడం మంచిదని వ్యాఖ్యానించారు. ఇతర దేశాలకు మద్దతుగా నిలవాలని మన ప్రజలు కోరుకుంటున్నపుడు వారు చెల్లించే పన్ను మొత్తాలతో తీవ్రవాదులకు సాయపడడం ఎంత మాత్రమూ సముచితం కాదని అన్నారు.

అమెరికా బాటలోనే సౌదీ

విదేశీ కార్మికుల నిషేధానికి సన్నద్ధం

న్యూఢిల్లీ: అమెరికా బాటలోనే సౌదీ అరేబియా కూడా పయనించనుందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. స్థానికులకే ఉద్యోగాలంటూ ట్రంప్ అనుసరించిన విధానాన్నే సౌదీ కూడా అనుసరించే ప్రయత్నం చేస్తోంది. తాజాగా తమ పౌరులకే ఉద్యోగాలు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. 12 కీలక రంగాల్లో విదేశీయులు పనిచేయడానికి వీల్లేదని సౌదీ అడ్డు కట్టవేసింది. ఈ విధానానికి కార్మిక మంత్రి అలీ బిన్ నసీర్ అల్ ఘపీస్ ఆమోదముద్ర వేశారని ప్రభాత్ ఖబర్ పత్రిక వెల్లడించింది. దీంతో సౌదీలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న 1.2 కోట్ల మంది విదేశీయులపై ప్రభావం పడనుంది. కాగా, వీరిలో అత్యధికులు తక్కువ వేతనాలతో వివిధ వత్తుల్లో పనిచేసే కార్మికులే ఉన్నారు.

ముడుపుల కుంభకోణంలో గ్రీక్ మాజీ ప్రధానులు, మంత్రులకూ ప్రమేయం

ఏథెన్స్ : స్విస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ నొవార్టిస్ నుండి ముడుపులు అందుకున్న అవినీతి కుంభకోణంలో ఇద్దరు మాజీ గ్రీక్ ప్రధానులు, ఎనిమిది మంది మాజీ మంత్రులకు కూడా ప్రమేయముందని భావిస్తున్నట్లు న్యాయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందుగా 2006 నుండి 2015 మధ్య కాలంలో అధికారంలో వున్న మాజీ మంత్రులకు కూడా ప్రమేయముందని అనుమానిస్తున్న ఈ ముడుపుల కుంభకోణానికి సంబంధించిన ఫైళ్ళను తక్షణమే అందచేయాలని గ్రీక్ అవినీతి నిరోధక ప్రాసిక్యూటర్లు పార్లమెంట్‌ను కోరారు. అయితే ఆ మంత్రులు ఎవరన్నదీ పేర్లు వెల్లడించలేదు. నొవార్టిస్ గ్రీక్ శాఖ మేనేజర్‌పై అవినీతి దర్యాప్తు ప్రారంభించేందుకు మేజిస్ట్రేట్లు చర్యలు తీసుకున్నారు. ఆయన్ని దేశం వీడి వెళ్ళవద్దని ఆదేశాలు కూడా జారీ చేశారు. ఆరోగ్య రంగానికి సంబంధించిన కుంభకోణాలపై దర్యాప్తు చేపట్టేందుకు అనుకూలంగా గతేడాది ఏప్రిల్‌లో గ్రీస్ పార్లమెంట్ ఓటు వేసింది. వైద్య పరికరాలు, మందులు సరఫరా చేసేందుకు ఆస్పత్రిలపై అధికంగా భారాలు మోపేందుకు హెల్త్ కాంట్రాక్టర్లను ప్రభుత్వం అనుమతించింది. ఇందుకు బదులుగా ప్రభుత్వం వారినుండి ముడుపులు తీసుకుంది. ఈ సమయంలో నొవార్టిస్ వేలాదిమంది డాక్టర్లకు, ఉద్యోగులకు తమ ఉత్పత్తులు విక్రయించేలా ముడుపులు అందచేసింది.

విదేశీ శాస్త్ర పరిశోధనలపై ఫిలిప్పైన్స్ నిషేధం

తీర ప్రాంతంలో అనధికారిక నౌకలను తరిమికొట్టాలని ఆదేశం

మణిలా: తమ దేశంలో పసిఫిక్ తీర ప్రాంతంలో కొనసాగుతున్న అన్ని రకాల విదేశీ శాస్త్ర పరిశోధనలపై నిషేధం విధిస్తున్నట్లు అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్ట్ ప్రకటించారు. తీర ప్రాంతంలో అనుమతి లేని నౌకలు కన్పిస్తే తరిమి కొట్టాలని ఆయన నౌకాదళాన్ని ఆదేశించారు. ఇప్పటికే చైనాతో సముద్ర తీర ప్రాంత పరిశోధనలపై ఒప్పందం కుదుర్చుకున్న ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు జారీ చేసిన తాజా ఆదేశాలు వివాదాస్పదంగా మారాయి. అధ్యక్షుడు డ్యూటెర్ట్ ఈ ఆకస్మిక చర్యపై ప్రభుత్వం నుండి ఎటువంటి వివరణా వెలువడలేదు. ఇటీవలి కాలంలో చైనాతో మరింత సాన్నిహిత్యం పెంచుకుంటూ ఆ దేశం నుండి రుణాలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్న డ్యూటెర్ట్ చేసిన ఈ ప్రకటన పలు దేశాలకు విస్మయం కలిగించింది. 2012లో 'ఫిలిప్పైన్స్ పగడపుదీవి'గా ఐరాస ప్రకటించిన బెన్‌హమ్ రైజ్ ప్రాంతాన్ని ఫిలిప్పైన్స్ ప్రభుత్వం గత ఏడాది 'ఫిలిప్పైన్స్ రైజ్'గా పేరు మార్చిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం జరిగిన కేబినెట్ భేటీలో అధ్యక్షుడు డ్యూటెర్ట్ మాట్లాడుతూ ఫిలిప్పైన్స్ రైజ్ తమదేనని, ఇప్పటి వరకూ ఈ ప్రాంతంకోసం ఎవరు ఏ ప్రయత్నాలు చేసినా వాటికి ఇప్పటితో తెరపడాల్సిందేనని స్పష్టం చేశారు. దాదాపు గ్రీస్ అంత వైశాల్యంలో వుండే ఈ ప్రాంతంలో జీవ వైవిధ్యంతోపాటు టునా చేపలు పుష్కలంగా లభిస్తాయి. అమెరికా, జపాన్ శాస్త్రవేత్తలు ఈ ప్రాంతాన్ని పలుమార్లు సర్వే చేశారు. అయితే ఈ ప్రాంతంపై పరిశోధనల కోసం గత 17 ఏళ్ల కాలంలో 18 సార్లు అధికారికంగా చైనా విజ్ఞప్తి చేసినప్పటికీ ఫిలిప్పైన్స్ నేతలు వాటిని పక్కన పెట్టారు. ఈ ప్రాంతంలో తమ శాస్త్ర పరిశోధనలకు అనుమతించాలంటూ చైనా ఇటీవల మరోసారి విజ్ఞప్తి చేసింది. చైనాతో సాన్నిహిత్యం కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ దీనిని ఏ మాత్రం పట్టించుకోని డ్యూటెర్ట్ తీర ప్రాంతంలో అనధికారికంగా ఎటువంటి నౌకలు పడవలు కన్పించినా వాటిని తరిమి కొట్టాలని ఆదేశించారు. ఈ ప్రాంతంపై పెట్రోలింగ్ నిర్వహించాలని ఆయన వాయుసేనకు సూచించారు. జాతీయ భద్రతను దృష్టిలో వుంచుకుని అధ్యక్షుడు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు అధ్యక్షభవనం ప్రతినిధి హారీ రోక్ వివరించారు. ఈ ప్రాంతంలో చైనా ఫిలిప్పైన్స్ శాస్త్రవేత్తలు ఉమ్మడిగా పరిశోధనలు చేస్తారంటూ ఇటీవలి చైనా పర్యటనలో డ్యూటెర్ట్ చేసిన వ్యాఖ్యలపై రోక్ ఎటువంటి వివరణా ఇవ్వలేదు. కాగా దీనిపై చైనా ప్రభుత్వం వెంటనే స్పందించలేదు.

మొదటి పేజీ తరువాయి

న్యాయం జరిగే వరకూ పోరాటం

తోడు పార్లమెంటులోనూ ఎంపిలు నిరసనలు చేపట్టంలో కేంద్రంలో కదలిక వచ్చిందని, ఈ ఒత్తిడికి సడలింపునిస్తే కేంద్రం తప్పుకుంటుందని అన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆందోళనను కొనసాగించాలని సూచించారు. అయితే మంగళవారం రాత్రికి అందరూ చప్పబడిపోయారు. వీటితోపాటు బడ్జెట్ విషయంలో కేంద్రంపై వివిధ పత్రికలు, ఛానళ్లలో వస్తున్న వార్తలు, సర్వేలపైనా చర్చించారు. ప్రతిపక్షం విషయంలో తీసుకోవాల్సిన ఎత్తుగడపై మాట్లాడారు. దీంతోపాటు చంద్రబాబు విదేశీ పర్యటన, రాజధాని పరిధిలో భూ కేటాయింపుల అంశంపైనా చర్చించారు. భూ కేటాయింపుల ఉప సంఘం సమావేశమవుతున్న నేపథ్యంలో దానిపైనా సుదీర్ఘంగా చర్చించారు.

శ్రీనగర్ ఆసుపత్రిపై ఉగ్ర కాల్పులు

ప్రమేయముంది. ఎన్నికల విధుల్లో ఉన్న ఒక ఉపాధ్యాయుడ్ని కూడా హత్య చేశాడు. దాదాపు ఏడుగురు పోలీసులను హతమార్చినట్లు కూడా సమాచారం. జమ్మూ కాశ్మీర్ రాజధాని శ్రీనగర్‌కు 36 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుల్వామాలోని కోర్టు సమీపంలో ముగ్గురితో సహా మొత్తం ఏడుగురిని నవీద్ జట్ హతమార్చాడు. కాశ్మీర్‌లోని లష్కర్ తోయిబాకు నేతృత్వం వహిస్తున్న అబు కాశిమ్‌కు నవవీద్ అత్యంత సన్నిహితుడు. అబూ కాశీమ్‌ను 2015లో భద్రతా బలగాలు హతమార్చాయి. నవీద్ పాకిస్తాన్‌లోని ముల్తాకు చెందిన వాడు.

గందరగోళంలో నీట్

నీట్‌ను మొదటి నుంచి వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా మరో వివాదంలో చిక్కుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. గరిష్ట వయసు నిర్ధారణ విషయంలో తర్జనభర్జన సాగుతుండటంతో నోటిఫికేషన్ విడుదలలో జాప్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌ను కలిసిన ఎన్ఐఓఎస్ బృందం తమ విద్యార్థులను నీట్‌కు అనుమతించాలని కోరారు. మంత్రి సూచనతో ఈ ఏడాది నుంచి నీట్ పరీక్షకు ఎన్ఐఓఎస్ విద్యార్థులను అనుమతించాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఈ నెల 22న ఎంసిఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. నీట్–2018కి ఎన్ఐఓఎస్ విద్యార్థులను అనుమతిస్తామని పేర్కొనటంతో పాటు జనరల్ విద్యార్థులకు గరిష్ట వయసును 25గా, రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థులకు 30 సంవత్సరాలుగా పేర్కొనటం వివాదాస్పదమైంది. ఎంసిఐ విడుదల చేసిన ప్రకటనలో మెడికల్ ఎడ్యుకేషన్, రెగ్యులేషన్ –1997 చట్టానికి వ్యతిరేకంగా ఉంటంతో న్యాయపరంగా ఇబ్బందులు తలెత్తినట్లయ్యింది. దీంతో ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిత్వశాఖ ఎంసిఐని సూచించింది. కానీ ఎంసిఐ ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో నోటిఫికేషన్ విడుదలలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. నీట్–2018కి సంబంధించి నోటిఫికేష్ విడుదలలో జరుగుతున్న జాప్యంపై విద్యార్థుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలు

శాసన మండలి సభ్యుల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం నిధులతో ఇప్పటిదాకా నడుస్తున్న ఆదర్శ ఉన్నత పాఠశాలలు ఇక రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించే పాఠశాలలుగా మారనున్నాయి. వీటి ప్రత్యేకతను, స్వయంప్రతి పత్తిని కొనసాగిస్తూనే సొసైటీ నుంచి తప్పించి రాష్ట్ర ప్రభుత్వం వీటిని నిర్వహిస్తుంది. దీంతో వీటి అభివృద్ధికి రాష్ట్ర నిధులు లభించడంతోపాటు ఉపాధ్యాయులకు, సిబ్బందికి 010 పద్దు ద్వారా జీతాలు, ఇతర సౌకర్యాలు లభిస్తాయి. శాసన మండలి సభ్యులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం కమిటీ సమావేశం జరిగింది. మండల విద్యాశాఖాధికారులు తమ వేతనాలను తామే డ్రా చేసుకునేందుకు, వీరి కార్యాలయాన్ని తగిన సిబ్బందితో పరిపుష్టం చేసేందుకు కూడా కమిటీ సిఫార్సు చేసింది. దీనితోపాటు ఇక ఎయిడెడ్, ప్రాథమిక పాఠశాలల టీచర్ల జీతాలు మండల విద్యాశాఖాధికారులు, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల టీచర్ల జీతాలను డిప్యూటీ డిఇఓలు డ్రా చేస్తారు.

మోడీ సర్కారువన్నీ వైఫల్యాలే

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న మోడీది వైఫల్యాల సర్కారు అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు వ్యాఖ్యానించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తానన్న మోడీ.. 70 లక్షల మందిని నిరుద్యోగులుగా మార్చారని విమర్శించారు. స్వయం ఉపాధిని కూడా తమ గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ)లో జరుగుతున్న సిపిఎం తెలంగాణ రెండో రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రం మాటల గారడీ బడ్జెట్ ప్రవేశపెట్టిందని విమర్శించారు. ఈ బడ్జెట్ అందర్నీ నిరాశపరిచిందని, సామాన్యులకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. బడ్జెట్ ధన్యవాద ప్రసంగంలో ప్రధాని మోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా కొత్త రాజకీయాలను, పకోడి రాజకీయాలు అంటూ తెరమీదికి తెచ్చి గౌరవ ప్రదమైన పకోడీల వ్యాపారులను అవమానపర్చారని విమర్శించారు. వ్యవస్థీకృత ఉపాధి కల్పిస్తామని అధికారంలోకి వచ్చామన్నా.. పాలకులు స్వయం ఉపాధిని కూడా తమ ఘనతగా చెప్పుకుంటున్నారని వ్యాఖ్యానించారు. స్వయం ఉపాధి చూపించేందుకైతే మోడీ, మన్మోహన్, కెసిఆర్, చంద్రబాబు ఎందుకని ప్రశ్నించారు. 2014 నుంచి ఎంత మందికి ఉపాధి సృష్టించిందో పార్లమెంటుకు పత్రం సమర్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

విభజన చట్టం అమలులో వైఫల్యం

ఏపి పునర్విభజన చట్టం అమలు చేయడంలో



బిజెపి పూర్తిగా వైఫల్యం చెందిందని రాఘవులు విమర్శించారు. ఆనాడు కాంగ్రెస్ కన్నా ఎక్కువ హామీలను బిజెపి ఇచ్చిందన్నారు. బిజెపి సర్కారు మూడున్నరేళ్ల పాలనలో ఏం చేయలేదన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన వాగ్దాలను ఒమ్ము చేసిందన్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చట్టం అమలుపై కేంద్రంపై ఒత్తిడి పెంచకుండా కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపికి ఏం చేయలేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శించారు.

ఏడు తీర్మానాలకు ఆమోదం

తెలంగాణలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని ప్రభుత్వాన్ని సిపిఎం తెలంగాణ రెండో రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. కాలపరిమితి ముగిసిన షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్స్ జీవోలను సవరించాలని కోరింది. మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్ర మహాసభల్లో మంగళవారం ఏడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించాలని, కనీస వేతనాలు పెంచాలనే తీర్మానాన్ని చుక్క రాములు ప్రవేశపెట్టగా, పాలడుగు భాస్కర్ బలపరిచారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలన్న తీర్మానాన్ని బి వెంకట్ ప్రవేశపెట్టగా, జి భాస్కర్ బలపరిచారు. బాలికలు, మహిళలపై పెరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలనే తీర్మానాన్ని బుగ్గవీటి సరళ ప్రవేశపెడితే, పి ప్రభావతి బలపరిచారు. చేతివృత్తిదారుల అభివృద్ధికి చేయూతనివ్వాలనే తీర్మానాన్ని ఎంవి రమణ ప్రవేశపెట్టగా, నాగరాజు బలపరిచారు. ఎంబిసిల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్న తీర్మానాన్ని టి జ్యోతి ప్రవేశపెట్టారు. పి ఆశయ్య, మతోన్మాద, సంఘ్‌పరివార్ దాడులను ప్రతిఘటిద్దాం, లౌకికతత్వాన్ని కాపాడుకుందాం అనే తీర్మానాన్ని కె భాస్కర్ బలపరిచారు.

కేరళ తరహాలో కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు నిర్ణయించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. కేరళలో రోజుకూలి రూ.600 నిర్ణయించి అమలు చేస్తోందని చెప్పారు.

'ఉక్కు'లో సిఐటియు విజయభేరి

ప్రజాశక్తి– ఉక్కునగరం, విశాఖపట్నం

విశాఖ ఉక్కు కర్మాగారం గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో సిఐటియు విజయభేరి మోగించింది. సిఐటియుకు 3,784, ఐఎన్‌టియుసికి 3,586, ఎఐటియుసికి 3,234, బిఎంఎస్‌కు 126, టిఎన్‌టియుసికి 206 లభించాయి. 43 ఓట్లు చెల్లలేదు. సిఐటియు 198 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. మొత్తంగా 11,517 ఓట్లకుగాను 11,119 పోలయ్యాయి. 96.73 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల్లో 12 యూనియన్లు పోటీ చేసినప్పటికీ ప్రధాన పోటీ మాత్రం సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి మధ్యే నెలకొంది. ప్లాంట్ పరిరక్షణ, మంచి వేతన ఒప్పందం నినాదాలతో బరిలోకి దిగిన సిఐటియుకు కార్మికులు పట్టం కట్టారు. ఈ దఫా ఎన్నికల్లో మహిళా ఉద్యోగినుల ఓట్లు భారీగా పెరిగాయి. గత రెండు, మూడేళ్లలో ఉద్యోగాల్లో చేరిన మహిళలందరూ ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిఐటియు, మిత్ర పక్షాలకు పూర్తి మద్దతు ఇచ్చిన కార్మికవర్గానికి, యువ కార్మికులకు పేరుపేరునా సిఐటియు నేతలు సిహెచ్.నర్సింగరావు, ఎన్.రామారావు, జె.అయోధ్యరాం, వైటి.దాస్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కార్మిక సమస్యల పరిష్కారానికి, ప్లాంట్ పరిరక్షణకు అందరి సహకారంతో ముందుకు వెళతామని పేర్కొన్నారు.

ఏచూరి ప్రభృతుల అభినందనలు


వైజాగ్ స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో సిఐటియు విజయం సాధించినందుకుగానూ స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకత్వానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరోసభ్యులు బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు, ఎపి రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఫోన్‌లో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ మంగళవారం అగ్రనేతలు తనను ఫోన్‌లో సంప్రదించి స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గానికి, నాయకత్వం వహించిన సిఐటియుకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడేందుకు సిపిఎం అన్ని రకాలుగా సహకారం అందజేస్తుందని ఈ సందర్భంగా వారు వెల్లడించారన్నారు.

అన్యాయమెక్కడ : ప్రధాని

చెబుతున్నాయని ఆయన రాజ్యసభలో పేర్కొన్నారు. జైట్లీ, గోయల్ హామీలతో టిడిపి ఎంపీలు ఆందోళన విరమించారు.

దద్దరిల్లిన పార్లమెంట్ ఉభయ సభలు

బడ్జెట్‌లో ఏపికి నిధులు కేటాయింపుల్లో జరిగిన అన్యాయంపై టిడిపి, వైసిపి, కాంగ్రెస్ ఎంపిలు ఆందోళన చేపట్టారు. ఏపి ఎంపిల ఆందోళనతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ఉభయ సభల వాయిదా పరంపర కొనసాగింది. లోక్‌సభ, రాజ్యసభ మూడేసి సార్లు వాయిదా పడ్డాయి. తొలుత పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు సుజనా చౌదరి, తోట నరసింహం, కొనకళ్ల నారాయణ, మురళీ మోహన్, రామ్మోహన్ నాయుడు, అవంతి శ్రీనివాస్, నిమ్మల కిష్టప్ప, మాగంటి బాబు, గల్లా జయదేవ్, శ్రీరాం మాల్యాద్రి, గరికపాటి మోహన్ రావు, టిజి వెంకటేష్, రవీంద్రబాబు, కేశినేని నాని, తోట సీతామహాలక్ష్మి, శివప్రసాద్ తదితరులు ఆందోళన చేపట్టారు. మరోవైపు గేట్ నెంబర్ 1 వద్ద వైసిపి ఎంపిలు విజయసాయి రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, అవినాష్ రెడ్డి, వరప్రసాద్, మిథున్ రెడ్డిలు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో టిడిపి, వైసిపి ఎంపిలు దాదాపు దాదాపు ఐదు గంటల సేపు ఆందోళనను చేశారు. టిడిపి ఎంపి శివప్రసాద్ చిడతలు వాయిస్తూ, గోవిందా..గోవిందా అంటూ నారదుడి వేషంలో నిరసన తెలియ జేశారు. లోక్‌సభలో స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆందోళన చేస్తోన్న ఎంపిలనుద్దేశించి మాట్లాడుతూ వెళ్లి మీ స్థానాల్లో కూర్చోండంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పరిస్థితి అదుపులోకి రాక పోవడంతో సభ మూడు సార్లు వాయిదా పడింది. బుట్టా రేణుక తన సీటు వద్దే నిలబడి నిరసన



పార్లమెంట్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి ఎంపీలు

తెలిపారు. మరో ఎంపి కొత్తపల్లి గీత మాత్రం తన సీట్లోనే కూర్చున్నారు. కేంద్ర మంత్రి, టిడిపి ఎంపి అశోక్ గజపతిరాజు పత్తా లేకుండా పోయారు. బిజెపి ఎంపిలు హరిబాబు, గోకరాజు గంగరాజు తమ స్థానాల్లో కూర్చుని ఉన్నారే తప్ప, ఆందోళన చేస్తోన్న ఎంపిలకు కనీసం సంఘీభావం కూడా తెలపలేదు. మరోవైపు రాజ్యసభలో కూడా ఏపి ఎంపిలు ఆందోళన చేశారు. టిడిపి ఎంపిలు సిఎం రమేష్, తోట సీతామహాలక్ష్మీ, గరికపాటి మోహన్‌రావు, వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి, కాంగ్రెస్ ఎంపిలు సుబ్బిరామి రెడ్డి, కెవిపి తదితరలు ఆందోళన వ్యక్తం చేశారు. వెల్‌లోకి వెళ్లి ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు.

ఇటు ఆందోళన..అటు చర్చలు

తెలుగు దేశం పార్టీ ఒక పక్క ఆందోళన చేపడుతునే మరోవైపు కేంద్ర మంత్రులతో చర్చ జరిపింది. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్‌లతో సుజనా చౌదరి రెండు సార్లు చర్చలు జరిపారు. ఆందోళన విరమించాలని కేంద్ర మంత్రులు కోరగా, సభలో ఏదో ఒక ప్రకటన చేస్తేనే ఆందోళన విరమిస్తామని సుజనా కేంద్ర మంత్రులకు తెలిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా సభలో ప్రధాని నరేంద్ర మోడీతో కూడా మాట్లాడారు. బిజెపి సీనియర్ నేత ఎల్‌కె అద్వానీ సుజనాను పిలిచి మాట్లాడారు. సిఎం రమేష్‌ను హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలిపించుకొని మాట్లాడారు.

ప్రతిపక్షాలతో టిడిపి ఎంపిలు వాగ్వాదం

అధికార బిజెపిని వదలేసి, ప్రతిపక్షాలతో టిడిపి ఎంపిలు వాగ్వాదానికి దిగారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడే సందర్భంలో ఆందోళన చేస్తోన్న టిడిపి ఎంపిలు ఆయన కనబడకుండా ప్లకార్డులతో కప్పేశారు. ఖర్గే ప్రసంగానికి అంతరాయం కలిగించారు. లోక్‌సభ టివి కెమెరాల్లో టిడిపి ఎంపిల ప్లకార్డులే కనబడతున్నాయి. దీంతో కాంగ్రెస్ ఎంపిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో కాంగ్రెస్, టిడిపి ఎంపిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో సభ వాయిదా పడింది. సభ వాయిదా పడిన తరువాత కూడా కొద్ది సేపు వాగ్వాదం కొనసాగింది. కాగా కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించాలని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి కెవిపి రామచంద్రరావు ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లును మనీ బిల్లుగా పేర్కొంటూ రాజ్యసభ తిప్పిపంపింది. ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి ఇంత వరకు చట్టబద్ధత కల్పించలేదు. ఈ నేపథ్యంలో ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ మెంబర్ బిల్లును కెవిపి రామచంద్రరావు రాజ్యసభకు సమర్పించారు. అయితే ఇది రాజ్యాంగపు ఆర్టికల్ 110 ప్రకారం మనీ బిల్లు అవుతుందని కాబట్టి దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి రాజ్యసభ సెక్రటేరియట్ నిరాకరించింది.

యాక్షన్ సీక్వెన్స్


నాగార్జున, ఈని

అక్కినేని నాగార్జున, రాంగోపాల్ వర్మ కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న నాలుగో సినిమా ఇది. ఇందులో నాగార్జున పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ కొత్త షెడ్యూల్ ముంబైలో జరుగుతుంది. నాగార్జున, అజయ్, సాయాజీ షిండేలా కాంబినేషన్‌లో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నారు. బాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ ఐజా షేక్ సారథ్యంలో ఈ యాక్షన్ ఎపిసోడ్ జరుగుతుంది. ముంబైలోని ఎస్సెల్ వరల్డ్ అనే ఎమ్యూజ్ మెంట్ పార్క్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఛేజింగ్ సీన్స్ కూడా చేస్తున్నారు. మార్చి 10 వరకూ జరగనున్న ఈ షెడ్యూల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు.

మరోమారు సమావేశమవుతాం


సి.కల్యాణ్

అధిక ధరలు వసూలు చేస్తూ నిర్మాతల్ని, పంపిణీదారుల్ని, ప్రదర్శనకారుల్ని దోచుకుంటున్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు త్వరలో చర్చలకు రావాలని కోరామని నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు నుంచి సరైన స్పందన రాకపోతే మార్చి 1నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియటర్ల బంద్ చేయడానికి నిర్ణయించామని చెప్పారు. ఈ విషయంపై మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రస్తుతం చిన్న చిత్రాలేవీ షూటింగ్‌లు జరుపుకోవడం లేదనీ, రన్నింగ్‌లో ఉన్న పెద్దచిత్రాలే సెట్స్‌పై ఉన్నాయని స్పష్టం చేశారు. ఇటువంటి తరుణంలో కార్మికులకు పని తగ్గుతుందన్న నేపథ్యంలో చిత్రసీమలో సమస్య తలెత్తినప్పుడల్లా ఇటువంటి పరిస్థితి పునరావృతం అవుతుందని గుర్తు చేశారు. తమ ముందున్న సమస్య పరిష్కారమై చిత్రసీమ కళకళలాడన్నదే తమ అభిమతమని స్పష్టం చేశారు. ఈ మధ్యనే ఛాంబర్‌లో నాలుగు రాష్ట్రాలకు చెందిన సినీ ప్రతినిధులు కలిసి సమావేశమై ఏకాభిప్రాయానికి వచ్చామని చెప్పారు. మార్చి ఒకటో తేదీ నుంచి బంద్ పాటించాలా? లేదా? అన్న విషయంపై మరోమారు సమావేశమై నిర్ణయం తీసుకుంటామని కల్యాణ్ అన్నారు.

హీరోయిన్లకు ఆ వెసులు బాటు లేదు


లావణ్య త్రిపాఠి

"స్క్రిప్ట్ విషయంలో హీరోలకున్నంత వెసులుబాటు హీరోయిన్లకు ఉండదు. కానీ మా క్కూడా అలా భిన్నమైన కథల్ని ఎంపిక చేసుకునే అవకాశాలు రావాలని కోరుకుంటున్నా"నని నటి లావణ్య త్రిపాఠి ఆకాంక్షించింది. సాయిధరమ్ తేజ్ హీరోగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సి.కళ్యాణ్ నిర్మించారు. ఇందులో లావణ్య కథానాయిక. ఎన్‌ఆర్ఐ పాత్రను పోషించింది. ఈనెల 9న విడుదల కానున్న నేపథ్యంలో మంగళవారం ఆ చిత్ర విషయాలను వెల్లడించింది.

ఈ మధ్య మీ వలన నిర్మాతలు కొంతమంది ఇబ్బందిపడ్డట్టు ఆరోణలు వచ్చాయి ?

నేను పని చేసిన అన్ని నిర్మాణ సంస్థలకి నాకు మంచి రిలేషన్స్ ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదు. కానీ తమిళంలో ఒక నిర్మాణ సంస్థతో చిన్న చిన్న ఇబ్బందులు తలెత్తాయి. అవి కూడా ప్రత్యేకంగా నా వలన కాదు. ఆ విషయం కూడా ప్రూవ్ అయింది.

'ఇంటిలిజెంట్'లో మీ పాత్ర ఎలా ఉంటుంది?

సంధ్య క్యారెక్టర్‌లో నటించాను. యు.ఎస్.లో చదువుకొని ఇండియా వచ్చి మా నాన్న వ్యాపారాలు చూస్తుంటాను. చాలా కోపం ఎక్కువ. ఎప్పుడూ అందరికన్నా డామినేట్‌గా ఉండాలనుకుంటాను. అలాంటి అమ్మాయి ప్రేమలో ఎలా పడింది? అనేది కథ. క్యూట్ లవ్ స్టోరీ. యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది.

కథలో ప్రధాన అంశం ఏమిటి?

కథ చాలా ఇంటిలిజెంట్‌గా ఉంటుంది. వెరీ టిపికల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీ. ఒక సామాన్య వ్యక్తి తన తెలివితేటలతో సమాజానికి, పేద ప్రజలకి ఎలాంటి మేలు చేశాడనేది మెయిన్ కాన్సెప్ట్. ఇవే కాకుండా ఇంకా పలు అంశాలు ఉంటాయి. ధర్మ క్యారెక్టర్‌లో తేజ్ చాలా పవర్ ఫుల్‌గా కనిపిస్తాడు.

తనతో నటించడం ఎలా అనిపించింది?

తేజ్ మంచి నటుడే కాదు... డాన్సర్ కూడా. సెట్లో ఎప్పుడూ జోక్స్ వేస్తూ అందరినీ నవ్విస్తుంటాడు. చాలా మంచి వ్యక్తి. మస్కట్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు టైమే తెలియలేదు. మా ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ వర్కవుట్ అయింది. లవ్ సీన్స్ అన్నీ చాలా ఫ్రెష్‌గా ఉంటాయి.

డ్యాన్స్ విషయంలో ఏమైనా ప్రాక్టీస్ చేశారా?

తొలిసారి ఈ చిత్రంలో డ్యాన్సులు బాగా ప్రాక్టీస్ చేసి చేశాను. నా ఫేవరెట్ లెజండరీ యాక్టర్ చిరంజీవి 'చమక్ చమక్' సాంగ్‌ని తెలుగు, హిందీలో చూశాను. ఆ పాటని రీమిక్స్ చేయడం చాలా కష్టం. అయినా ఈ మూవీలో చేశాం. వెరీ బ్యూటిపుల్ సాంగ్. సెల్ ఫోన్..., కళ కళ కళామందిర్.. తదితరల పాటలు మాస్ ప్రేక్షకులను బాగా అలరిస్తాయి.

వినాయక్ నుంచి ఏం నేర్చుకున్నారు?

ఆయన దర్శకత్వంలో నటించడం చాలా ఆనందంగా ఉంది. ఎంత ఎదిగినా ఒదిగినట్లుండే ఆయన తత్త్వం నాకు నచ్చింది. ఆయన్నుంచి అదే నేర్చుకున్నా. సెట్లో చాలా సరదాగా ఉంటారు. ప్రతి షాట్‌నూ విశదీకరిస్తారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా చేయమని చెబుతుంటారు. ప్రతి సీన్‌లో స్పష్టం ఉంటుంది.

జయాపజయాలను ఎలా స్వీకరిస్తారు?

హిట్, ఫ్లాప్ అనేది కామన్. సక్సెస్‌ని ఎక్కువ ఎంజాయ్ చేస్తాం. ఫెల్యూర్ వచ్చినప్పుడు తప్పు ఎక్కడ జరిగిందో చూసుకొంటాం. ఫీడ్ బ్యాక్ కచ్చితంగా తీసుకుంటాను. 'భలే భలే మగాడివోయ్', 'సోగ్గాడే చిన్ని నాయనా' కమర్షియల్‌గా నాకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. అలాగే 'ఇంటిలిజెంట్' కూడా మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను.

డబ్బింగ్ చెప్పే ఆలోచన ఏమైనా ఉందా?

చెప్పాలని ఉంది. ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నాను. ఇంకా ఇంప్రూవ్ అయ్యాక డబ్బింగ్ చెప్తాను. తర్వాత గీతా ఆర్ట్స్‌లో విజయ్ దేవర కొండతో మూవీ చేస్తున్నాను. పరశురామ్ డైరెక్టర్. తమిళ్, మలయాళం నుండి కొన్ని ఆఫర్స్ వస్తున్నాయి. నా ఫస్ట్ ప్రిఫరెన్స్ తెలుగుకే ఇస్తాను. హైదరాబాద్ అంటే నాకు చాలా ఇష్టం. ఇక్కడే ఉండాలనుకుంటున్నా.

మేథమెటిషియన్ ఆనంద్

హృతిక్ రోషన్ గత ఏడాది 'కాబిల్' సినిమా చేశాక తన మాజీ భార్య సుశాన్నే, పిల్లలు హ్రీహాన్, హృధాన్‌తో సమయం అంతా గడుపుతున్నాడు. ఈ చిత్రం తర్వాత 'సూపర్ 30' చేస్తున్నాడు. ఇది గణితంలో నిపుణుడైన వ్యక్తి, పాట్నాకు చెందిన ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా రూపొందుతోంది. ఇతను ప్రతి ఏటా 30 మంది పేద విద్యార్థులను, అందులోనూ గ్రామీణ నేపథ్యంలో వారిని ఎంపిక చేసుకుని ఐఐటీ ప్రవేశాలకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నాడు. ఆనంద్ ఈ విధంగా మారడానికి స్ఫూర్తి ఏమిటి? ఇప్పటి వరకూ ఎంత మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చారు? వీటంతటికీ నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయి? వీరికి ఉచితంగా కోచింగ్ ఇవ్వడంలో ఎదుర్కొన్న ఇబ్బందులను 'సూపర్ 30' సినిమాలో చూపించబోతున్నారు. ఈ చిత్రంలో ఆనంద్ పాత్రలో హృతిక్ రోషన్ ఎలా ఉండబోతున్నారో మంగళవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. నిజంగా ఓ మేధావి ఉండే తరహాలోనే హృతిక్ లుక్ ఉండడం విశేషం. ఈ చిత్రానికి విశాల్ భల్లా దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో పాట్నా, బెనారస్‌ల్లో పది రోజులు పాటు మొదటి షెడ్యూల్ ఉండనుంది. ఈ చిత్రం ఎక్కువ భాగం ముంబాయిలోనే చిత్రీకరించనున్నారు. వచ్చే ఏడాది జూన్ 25న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


హృతిక్ రోషన్

ద్విభాషా చిత్రం


ధనుష్

తమిళ హీరోలు తెలుగులో పాపులర్ అయ్యాక నేరుగా తెలుగులో చిత్రాలు చేసేవారు. భాగ్యరాజా, పార్తీపన్, మురళి, కమల్ హాసన్, రజనీకాంత్, కార్తీ, సూర్య తమిళంతో పాటు తెలుగులో కూడా సినిమాలు చేసి మంచి మార్కెట్ సంపాదించుకున్నారు. అంతేకాకుండా తమిళంలో నటించిన సినిమాలను తెలుగులో అనువాదం చేసి మార్కెట్‌ను విస్తరించుకున్నారు. ఈ కోవలోనే ధనుష్ చిత్రాలు కూడా తెలుగులో డబ్ అవుతున్నాయి. అయినా ఈసారి తెలుగు, తమిళంలో ఏకకాలంలో సినిమా చేయడానికి సిద్ధమయ్యాడు. ఈ చిత్రం కథ ఫైనల్ స్టేజీలో ఉందట. త్వరలో దర్శకుడు ఎవరనేది తెలియజేస్తారు. ఈ చిత్రాన్ని పీవీపీ సంస్థ నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నాలుగు చిత్రాల్లో ధనుష్ నటిస్తున్నాడు. అవి పూర్తయ్యాక ఈ చిత్రం సెట్‌పైకి వెళ్లనుంది.

అప్పుడు మండుటెండ... ఇప్పుడు రాళ్ల వర్షం


సమంత

సామాజిక మాధ్యమంలో చురుగ్గా ఉండే తార సమంత. తన వ్యక్తిగత విషయాలు, సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను నిత్యం తన అభిమానులు ముందుంచుతుంది. నిజంగా కష్టమొచ్చిందో లేక తనుపడుతున్న ఇబ్బందిని అభిమానులతో పంచుకోవాలనుకుందో కానీ తాజా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన ఓ పోస్టు హల్‌చల్ చేస్తుంది. అయ్యా...ఎంత కష్టమంటూ అభిమానులు తెగ ఇబ్బంది పడిపోతున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే... ఇప్పటి వరకూ రామ్ చరణ్ హీరోగా చేసిన 'రంగస్థలం' చిత్రంలో ఈమె కథానాయికగా చేసింది. ఈ చిత్రం షూటింగ్ కోసం రాజమండ్రిలో మండుతున్న ఎండల్లో పాల్గొంది. ఈ షూటింగ్ పూర్తయిపోయిందని ఇటీవలే ట్విట్టర్‌లో పేర్కొంది. ఇప్పుడు విజయ్ హీరోగా తెరకెక్కుతోన్న తమిళ చిత్రం 'సూపర్ డీలక్స్' చిత్రీకరణలో పాల్గొంటుంది. ఈ షూటింగ్ అంతా రాత్రిళ్లు వర్షంలో చిత్రీకరణలో పాల్గొనాల్సి వస్తోందట. ఈ విషయాన్ని తెలిపేందుకు సెట్స్‌లోని ఓ ఫొటోను సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఫొటో మీద..'అప్పుడు రాజమహేంద్రవరంలో మండుటెండలోనూ.. ఇప్పుడు టెన్సకిలో రాత్రిళ్లు వర్షంలో చిత్రీకరణలో పాల్గొంటున్నాను. దేవుడా..నాతో ఇలాంటి చెత్త ఆటలు ఎందుకు ఆడుతున్నావ్?' అంటూ పోస్టు చేసింది.

రొమాంటిక్ చలి పోరాటం


నిరూప్, అవంతిక


'రాజరథం' చిత్రంలో 'కాలేజ్ డేస్', 'నీలి మేఘమా' అనే ఈ రెండు గీతాలు ఇటీవల విడుదలయ్యాయి. ఈ గీతాలు ప్రేక్షకుల నుండి మంచి స్పందన రాబట్టుకున్నాయి. అనూప్ బాణీలు సమకూర్చారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఎన్నో జ్ఞాపకాలని గుర్తు చేసేలా, కలల్లో విహరింపచేసేలా ఉన్న పాటలు వాస్తవానికి అందులో నటించిన నిరూప్ అవంతికలను వణికించాయి. ఆ పాటల చిత్రీకరణలో రెయిన్ సీక్వెన్స్ కోసం వాడిన నీరు చాలా చల్లగా ఉండడమే అందుకు కారణం. వణికించేంత చల్లని నీటిలో తడుస్తూ పాటకి తగ్గ ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చిందట ఈ హీరో హీరోయిన్లకు. 'కట్' చెప్పగానే చిత్ర బృందం నిరూప్, అవంతికల మీద వేడి నీళ్లు పోసి, బ్లాంకెట్ కప్పాక కానీ మాములు స్థితి కి వచ్చేవారు కాదట. ఈ చిత్రం ఈనెల 16న విడుదల కానుంది.

దోచుకునే ధనికులపై 'రెయిడ్'

'ఈ దేశంలో పేదరికం వల్ల ప్రజలు పేదలుగా మారడం లేదు. నీలా దేశం మీద పడి దోచేస్తున్న ధనికుల వల్ల ప్రజలు పేదలుగా మారుతున్నారు.... అనే మాటలతో ఉన్న టీజర్‌ను విడుదల చేసి సామాజిక మాధ్యమంలో మంచి స్పందనను రాబట్టింది 'రెయిడ్' చిత్రం. 'హీరోలు ఎల్లప్పుడూ యూనిఫాంలలో రారు' అన్నది ఈ చిత్రం ఉపశీర్షిక. ఈ చిత్రంలో అజయ్ దేవగణ్ కథానాయకుడు. రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. 1980లలో ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకున్న ఐటీ దాడుల నేపథ్యంలో ఈ సినిమాను తీస్తున్నారు. లఖ్‌నౌకి చెందిన ఐటీ డిప్యూటీ కమిషనర్ అమయ్ పట్నాయక్ పాత్రలో అజయ్ దేవ్‌గన్ నటిస్తున్నారు. ఇలియానా కథానాయిక. టీ-సిరీస్, పనోరమా స్టూడియోస్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. మార్చి 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. బంగారు బిస్కెట్లు, డబ్బు మూటలు ఉన్న బాక్స్‌పై హీరో కూర్చుని ఆసక్తిగా ఉన్న లుక్‌ను ప్రేక్షకుల ముందుంచారు.


'రెయిడ్'లో అజయ్ దేవగన్

సైటెక్ Science & Technology
ప్రజాశక్తి
11
విజయవాడ
బుధవారం 7-2-2018
scitechpage@gmail.com



ప్రశ్న: ఈ మధ్యనే సూపర్ మూన్, బ్లడ్ మూన్, బ్లూ మూన్ లనే త్రినామకరణంతో భాసిల్లిన చంద్రుడు గ్రహణానికి గురైనపుడు వివిధ రకాల వాదనల్ని మీడియాలోను, సామాజిక మాధ్యమా ల్లోను చూశాము. ఇలాంటి గ్రహణాలవల్ల నష్టమేమీ లేదా?

- ఎం.జగన్మోహన్‌రెడ్డి, హన్మకొండ

చంద్రగ్రహణంతో నష్టమా?

జవాబు : భూమి చుట్టూ తిరిగే ఏకైక సహజ ఉపగ్రహం చంద్రుడు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే గ్రహం. సూర్యుడి చుట్టూ భూమి ఓ చుట్టు తిరగడానికి పట్టే కాలాన్ని పరిభ్రమణ కాలం (Period) అంటారు. ఇది సుమారుగా 365 రోజులు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే క్రమంలో ఆగమనం ద్వారా సంభవించే కోణీయ ద్రవ్య వేగాన్ని (Angular momentum) ను బాలన్స్ చేయడానికి తన చుట్టూ తాను తిరుగుతుంది. ఈ గమనాన్ని భ్రమణం (spin) అంటాము. భూమికున్న భ్రమణ కాలం (Period of Spin) సుమారు 24 గంటలు. భూమి చుట్టూ తిరిగే చంద్రుడి పరిభ్రమణ కాలం సుమారు 28 రోజులు. అంతేకాదు. చంద్రుడి భ్రమణకాలం కూడా సుమారు 28 రోజులే. అందువల్లే చంద్రుని ఒక సగభాగాన్ని (Hemisphere) మాత్రమే మనం చూస్తాము. నక్షత్రం కావడం వల్ల సూర్యుడు స్వయం ప్రకాశకంగా ఉంటాడు. కానీ భూమి, చంద్రుడు గ్రహ, ఉపగ్రహాలు కాబట్టి వాటికి స్వయం ప్రకాశకత్వం లేదు. సూర్యుడి కాంతి భూమి గుత్త సొమ్ము కాదు. తనకు ఏదేని ప్రాంతానికి మధ్య అడ్డులేనట్లయితే ఏ విధమైన కారణాల ద్వారానూ కాంతి బలహీనం కానట్లయితే సూర్యకాంతి అన్ని ప్రాంతాల మీదా, అన్ని వ్యవస్థల మీదా పడ్తుంది, అలాగే భూమి మీద పడ్డట్టే చంద్రుడి మీద పడ్తుంది. భూమి రోజుకోమారు భ్రమణం చెందడం వల్ల భూమధ్యరేఖకు కొంచెం అటుయిటు సుమారు 12 గంటల పాటు వెలుగు వున్న పగలు, సుమారు 12 గంటల పాటు వెలుగులేని (చీకటి వున్న) రాత్రి ద్యోతకమవుతాయి. అయితే చంద్రుడు మన భూమి చుట్టూ తిరుగుతుండడం వల్ల మన భూమికి సూర్యుడికి మధ్యలో వచ్చేలా కొన్ని రోజులు (భూమికన్నా చంద్రుడే సూర్యుడికి దగ్గరగా వున్నట్లు). మన భూమికి ఆవలగా సూర్యుడికి దూరంగా వున్నట్టు (సూర్యుడి నుంచి భూమికన్నా చంద్రుడే ఎక్కువ దూరంలో వున్నట్టు) మరికొన్ని రోజులు తిరుగుతుంటాడు. ఈ ప్రక్రియలో చంద్రుడి మీద పడ్డ సూర్యకాంతి పరావర్తనం చెంది మన భూమివైపు అగుపించే భాగంలో తేడాలు ఉండడం వల్ల శుక్ల, కృష్ణపక్షాలు, అమావాస్య, పౌర్ణమిలు సంభవిస్తాయి.

సూర్యుడి చుట్టూ భూమి తిరిగే దీర్ఘ వృత్తాకార కక్ష్యోపరితలాన్ని (orbital plane) ఎక్లిప్టిక్ (Ecliptic) అంటాము. ఖగోళ పరిభాషలో చెప్పాలంటే భూమి నుంచి చూస్తే సూర్యుడి మార్గాన్ని సాదృశ్యంగా (apparently) చూపే గమనోపరితలాన్ని ఎక్లిప్టిక్ అంటారు. చంద్రుడు భూమి చుట్టూ తిరిగే పరిభ్రమణోపరితలానికి ఖచ్చితమైన పేరులేకున్నా దాన్ని చంద్ర కక్ష్యోపరితలం అనే పిలుద్దాము.

కాసేపు ఎక్లిప్టిక్, చంద్రకక్ష్యోపరితలం రెండూ ఒకే ఉపరితలా (coplanar) న్ని ఆక్రమిస్తున్నాయనుకుందాం. అలాంటప్పుడు భూమికి సూర్యుడికి మధ్య చంద్రుడు వస్తాడు. అంటే ప్రతి 28 రోజులకోమారు అంటే ప్రతి అమావాస్య నాడు సూర్యుడికాంతి పడని పగటి భాగం భూమిపై కొంత వుండే అవకాశం వుంది. అంటే ప్రతి 28 రోజులకోసారి సూర్యగ్రహణం వచ్చే అవకాశం వుంది. అలాగే ప్రతి 28 రోజులకోసారి సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి అడ్డు వస్తుంది కాబట్టి ప్రతి 28 రోజులకోసారి అంటే ప్రతి పౌర్ణమినాడు చంద్రగ్రహణం వచ్చే అవకాశమూ వుంది. కానీ అలా జరగడం లేదు. ఎందుకని? అందుకు కారణం ఎక్లిప్టిక్, చంద్రకక్ష్యోపరితలమూ ఒకే ఉపరితలాన్ని ఆక్రమించకపోవడమే. ఈ రెండు ఉపరితలాల మధ్య దాదాపు 5 డిగ్రీల సందు (కోణం లేదా Dihedral angle) వుంది. అందువల్లే అడపాదడపా మాత్రమే సౌరగ్రహణాలు దాదాపు సంవత్సరానికి రెండుసార్లయినా చంద్రగ్రహణాలు (Lunar Eclipses) వస్తాయి. 28 రోజుల వ్యవధిలో పౌర్ణమి పునరావృతం అవుతుంది. ఈ జనవరి నెల 2న భారత దేశంలో పౌర్ణమి సంభవించింది. మళ్లీ అదే జనవరి 31వ తేదీన మరో పౌర్ణమి సంభవించింది. ఇలా ఒకే నెలలో రెండు దఫాలు పౌర్ణమి వచ్చినట్లయితే ఆ రెండో పౌర్ణమి చంద్రుణ్ణి బ్లూ మూన్ అంటారు. ఇలా బ్లూ మూన్ రావడానికి కారణం పౌర్ణమికి, పౌర్ణమికి మధ్య ఉన్న కాలం సుమారు 29 రోజులు కావడం, ప్రతి నెలలో విధిగా 29 రోజులు లేకపోవడం, కాబట్టి సంవత్సరంలో (12 నెలల్లో) సుమారు 13 పౌర్ణమిలు వచ్చే అవకాశం వుండడానికి వీలుంది. ఒక నోటి లెక్క ప్రకారం ప్రతి 10 సంవత్సరాల వ్యవధిలో సుమారు 7 సార్లు బ్లూ మూన్ పరిస్థితి సంభవిస్తుంది. ఈ పరిస్థితి భూమ్మీద అన్ని దేశాలకు ఒకే విధంగా ఉండదు. మన దేశంలో మళ్లీ మార్చి 2, మార్చి 31న పౌర్ణమి వస్తాయి. అంటే మార్చి 31, 2018 నాటి పౌర్ణమి చంద్రుడు కూడా బ్లూ మూన్ అన్నమాట.

చంద్ర కక్ష్య పూర్తి వృత్తాకారంలో వుండదు. కొంచెం దీర్ఘ వృత్తాకారం (Elliptical) లో వుంటుంది. దీని దీర్ఘాక్షం (Apogee) విలువ సుమారు 4 లక్షల కి.మీ. కాగా హ్రస్వాక్షపు (Perigee) విలువ సుమారు 360 వేల కి.మీ. అంటే భూమికి కనిష్టంగా 1.8 లక్షల కి.మీ., గరిష్టంగా 2 లక్షల కి.మీ. ఉండేలా చంద్రుడు భూమి చుట్టూ పరిభ్రమిస్తాడు. భూమికి అత్యంత చేరువగా వచ్చే సందర్భంలో పౌర్ణమి సంభవిస్తే ఆ పౌర్ణమి చంద్రుడు మామూలు చంద్రుని పరిమాణం కన్నా దాదాపు 14 శాతం పెద్దగా కనిపిస్తాడు. ఇలాంటి గరిష్ట రూప పౌర్ణమి చంద్రుణ్ణి సూపర్ మూన్ అంటారు.

చంద్రుడి మీద సౌరకాంతి మూడు మార్గాల ద్వారా పడుతుంది. సూర్యుని కాంతి సరాసరి పడడం, ఇది చాలా ప్రకాశంతం. భూమ్మీద ఉన్న వాతావరణం ద్వారా వక్రీభవనం చెంది చంద్రుని మీద పడే అదేవైపు సౌరకాంతి రెండో వనరు. ఇది పైన పేర్కొన్న దాంతో పోల్చితే చాలా తక్కువ. సౌరకాంతి భూమి మీద పడడం వల్ల భూమికున్న ప్రకాశవంతమైన వాతావరణం మీద (భూ వెన్నెల లాగా) నుంచి పరావర్తనం చెంది కొద్దోగొప్పో చంద్రుని మీద పడ్డ కాంతి మూడో వనరు. ఇది కూడా చాలా స్వల్పం. అయితే అన్ని కాంతుల కన్నా ఎరుపు కాంతికి తక్కువ పరిక్షేపణ నష్టం (Scattering Loss) ఉండడం వల్ల రెండవ, మూడవ వనరుల ద్వారా వచ్చే కాంతిలో అధిక భాగం ఎరుపురంగులోనే చంద్రుణ్ణి చేరుతుంది. మామూలు రోజుల్లోని పౌర్ణమి కాంతి (మొదటి వనరు) తో పోలిస్తే రెండవ, మూడవ వనరుల కాంతి స్వల్పం కాబట్టి పౌర్ణమి వెన్నెల (బ్లూ మూన్ అయినా, సూపర్ మూన్ అయినా) సాధారణంగా తెలుపుగానే వుంటుంది. కానీ చంద్రగ్రహణం సమయంలో మొదటి వనరును దాదాపు భూమి అడ్డుకోవడం వల్ల రెండవ, మూడవ వనరుల ప్రభావం ద్యోతకం అవుతుంది. ఆ దృశ్యం సూపర్‌మూన్ సందర్భంలో మరింత హెచ్చుగా కనిపిస్తుంది. అంటే గ్రహణ చంద్రుడు పూర్తిగా మాయం అయినట్లు కాకుండా కొంచెం ఎరుపు రొట్టెలా కనిపిస్తాడు. ఇలాంటి చంద్రుణ్ణి బ్లడ్ మూన్ అంటారు. ఈ జనవరి 31న సంభవించిన చంద్రగ్రహణం బ్లూ మూన్ కావడంతో పాటు, సూపర్ మూన్ కావడం వల్ల బ్లడ్ మూన్‌గా అవతరించాడు. ఇలాంటి అరుదయిన సంఘటన ఎపుడుబడితే అపుడురాదు. దాదాపు 150 సంవత్సరాల తర్వాత మొన్న జనవరి 31న సూపర్ బ్లడ్ మూన్ గ్రహణం జరిగింది. మన తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం సుమారు 6 గంటల నుండి సుమారుడు రాత్రి 9 గంటల వరకు సాగిన బృహన్నీలారుణ (Super Blue Red) చంద్రగ్రహణం ఓ అద్భుత ఘట్టం. ఒకరి జీవితంలో ఒకసారి కన్నా ఎక్కువసార్లు సంభవించే అవకాశం లేదు. కొన్ని జీవితాలకు ఆ ఆవకాశమేమీ లేకపోవచ్చు. అలాంటి అరుదయిన ఘట్టాన్ని చూడకుండా నాలుగ్గోడల మధ్య దాక్కున్న మూఢ నమ్మకస్తుల తప్పిదాలు ఆ మూఢత్వాన్ని పోషించే మత రాజకీయాల తంతు కూడా తెలుసుకుందాం.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email:
allikayala@gmail.com

ఫొటోలను కార్టూన్లుగా మార్చే యాప్స్

స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత... కాదేదీ ఫొటోల కనర్హం అన్నట్టుగా తయారైంది. క్వాలిటీ మెగా పిక్సెల్‌తో వస్తోన్న రియర్ కెమెరా, ఫ్రంట్ కెమెరాలతో ఫొటో ప్రియుల ఉత్సాహం మరింత ద్విగుణీకృతం అయింది. సెల్ఫీల ట్రెండ్ విపరీతంగా పెరిగింది. సోషల్ మీడియా ఈ ఫొటోలన్నింటికీ వేదికగా మారింది. రకరకాల హావభావాలతో ఫొటోలను తీసుకోవడం, వాటిని ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో పోస్టు చేయడం, లైకులు, కామెంట్లతో సంబరపడటం ఓ అలవాటుగా మారిపోయింది. అదే సమయంలో కొత్తదనం కోసం ఆరాటమూ పెరిగింది. ఇలా కొత్తదనం కోరుకునే వారు వారి వారి ఫొటోలను రకరకాల గ్రాఫిక్ డిజైన్లలోనూ, కార్టూన్ క్యారెక్టర్లలోనూ చూసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. అటువంటి వారికోసం రకరకాల ఫొటో ఎడిటింగ్ యాప్స్, కార్టూన్ యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇదే కోవలో మన ఫొటోలను కార్టూన్ క్యారెక్టర్‌లోకి మార్చగల యాప్స్ కూడా వున్నాయి. వాటిలో కొన్నిటి గురించి తెలుసుకుందాం...

Cartoon Art Pics Photo Editor: ఇది బెస్ట్ కార్టూన్ యాప్‌లలో ఒకటి. మన ఫొటోలను కార్టూన్స్ గాను, పెయింటింగ్స్ గాను మార్చేందుకు కావాల్సిన మోడ్రన్ ఆర్ట్ ఫిల్టర్స్ ఎన్నో ఈ యాప్‌లో ఉన్నాయి. మీ ఫొటోను కార్టూన్‌లోకి మార్చేందుకు సెల్ఫీ కెమెరాలో ఉన్న కార్టూన్ ఫిల్టర్స్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో మీ ఫొటోలను కార్టూన్లుగా క్రియేట్ చేసుకుని, లాంచ్ ఫోటోను సెలక్ట్ చేసుకోవడమే. యాప్‌లో ఇన్ బిల్ట్ ఎఫెక్ట్స్ అప్లై చేస్తుంది. మీరు క్రియేట్ చేసుకున్న ఫోటోను డౌన్‌లోడ్ చేసుకుని సోషల్ మీడియాలోగానీ, పర్సనల్‌గా ఫ్రెండ్స్‌కు కానీ షేర్ చచేసుకోవచ్చు. jpg, png, gif ఇమేజ్ ఫార్మాట్లకు కూడా సపోర్టు చేస్తుంది.



Cartoon Sketch: ఈ యాప్ ఎఫెక్ట్స్, ఫ్రేమ్స్, ఫిల్టర్లతో దీన్నికార్టూన్‌గా మార్చడం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. మీరు అందంగా, ప్రకాశవంతంగా కనిపించడానికి ఇమేజ్‌ను ఎడిట్ కూడా చేసుకోవచ్చు. ఎమోజీలతో ఫన్నీ లుక్ కూడా తేవచ్చు. కావాలంటే టెక్స్ట్ కూడా రాసుకోవచ్చు. ఫోటోను కార్టూన్ లేదా స్కెచ్‌లోకి మార్చాక సేవ్ చేసుకుని సోషల్ మీడియాలో షేర్ చేయవచ్చు.

Fatify : ఈ యాప్‌తో మీ ఫోటోను కార్టూన్ మాదిరిగా కనిపించేలా చేయవచ్చు. అంతేకాదు ఫొటోలో ముఖం, శరీరం వేర్వేరుగా ఏదోక భాగం లావుగా కనిపించేలా క్రియేట్ చేసుకోవచ్చు.

MomentCam Cartoons & Stickers : మీ ఫోటోల నుంచి ఫన్నీ కార్టూన్లను, స్టిక్కర్లను క్రియేట్ చేయడానికి ఉపయోగపడే మరొక యాప్. ఫన్నీ క్యారెక్టర్, ఎమోటికాన్లను చేయడానికి గూగుల్ ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.

Cartoon Photo Editor: ఫోటోలను కార్టూన్లుగా మార్చడానికి ఉపయోగపడే యాప్ లలో కార్టూన్ ఫోటో ఎడిటర్ కూడా ఉత్తమమైనదే. స్కెచెస్, కార్టూన్లు, ఆయిల్ పెయింటింగ్, పెన్సిల్ డ్రాయింగ్ వంటి ఆర్టిస్టిక్ డిజైన్లు సృష్టించడానికి ఈ యాప్‌లో ఎన్నో ఫిల్టర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఫిల్టర్ల ద్వారా మీ ఫొటోలను అందంగా తీర్చిదిద్దుకోడంతో పాటు ఎడిట్ చేసుకోవచ్చు. అనంతరం నేరుగా సోషల్ మీడియాలో షేర్ చేసుకోవచ్చు.

ArtistA Cartoon & Sketch Cam: ఫోటోలను కార్టూన్ క్యారెక్టర్‌లోకి మార్చగల మరో ఉత్తమ ఆండ్రాయిడ్ యాప్ ఇది. సెల్ఫీల కోసం ఇందులో మంచి ఆప్షన్ ఉంది. ఫోటో ఎడిటింగ్‌కు ఫిల్టర్లను సెలక్ట్ చేసుకోవడం కోసం మీ సెల్ఫీ కెమెరాకు ఉపయోగపడుతుది. అంతేకాదు ఇందులో ఫోటోలకు కావాల్సిన రకరకాల ఎఫెక్ట్స్ కూడా ఉంటాయి. ఇలా ఎడిట్ చేసిన ఫోటోలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా షేర్ చేసుకోవడానికి సదుపాయం కూడా వుంది.

Cartoon Face-selfie Foto edit: అద్భుతమైన కార్టూన్ క్యారెక్టర్లను క్రియేట్ చేయడానికి మీరు ఉపయోగించే ఫిల్టర్లలో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయి. బ్యాక్‌గ్రౌండ్స్, బ్యూటీ మేకప్ ఎఫెక్ట్స్ లిస్టు వంటివి ఎన్నో ఫిల్టర్లు ఈ యాప్‌లో ఉన్నాయి.

Cartoon Yourself: కొన్ని నిమిషాల్లోనే మీ ఫోటోలను కార్టూన్‌గా క్రియేట్ చేసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. మీరు చేయాల్సిందల్లా యాప్ ఇన్‌స్టాల్ ఆప్షన్‌గా ఎంచుకోవాలి. తర్వాత బ్యాక్‌గ్రౌండ్ ను సెలక్ట్ చేసుకున్నాక మీ ఫొటోను పూర్తిగా కార్టూన్ గా క్రియేట్ చేయవచ్చు. కొన్ని ఫన్నీ స్టిక్కర్లను కూడా యాడ్ చేయవచ్చు. ఫొటోల్లోని ముఖాలకు అద్దాలు, గడ్డం, మీసాలు, జుట్టు వంటివి యాడ్ చేసి ఫన్నీగా మార్చవచ్చు.

ఆండ్రాయిడ్‌లో పనిచేసే ఈ యాప్స్ అన్నింటినీ గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెల్ఫీలను, ఫొటోలను మన క్రియేటివిటీకి అనుగుణంగా ఆర్టిస్టిక్‌గా మలచుకోవచ్చు. అలా క్రియేట్ చేసుకున్నవాటిని ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల్లోకి పోస్టు చేసుకోవచ్చు. మరెందుకాలస్యం. ★





ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్స్!

ఫేస్‌బుక్ అకౌంట్లలో ఎక్కువ శాతం నకిలీవేనట. ఈ విషయాన్ని ఆ సంస్థే స్వయంగా వెల్లడించింది. 2017 డిసెంబర్ చివరి నాటికి 2.13 బిలియన్ల నెలవారీ యాక్టివ్ వినియోగదార్లతో దూసుకు పోతోన్న ఫేస్‌బుక్‌కు నకిలీ అకౌంట్ల సమస్య కూడా అధికమేనని తేలింది. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ అంచనా ప్రకారం... 2017 డిసెంబర్ చివరి నాటికి దాదాపు 200 మిలియన్ అకౌంట్లు(20 కోట్ల అకౌంట్లు) ఫేస్‌బుక్‌లో నకిలీవే. అయితే... ఈ నకిలీ అకౌంట్లు భారత్‌లోనే అత్యధికంగా ఉన్నాయని ఈ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ వెల్లడించింది. భారత్ తోపాటు, ఇండోనేషియా, వియత్నాం, ఫిలిప్పీన్స్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయట. గతేడాది చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్యలో సుమారు 10 శాతం మందికినకిలీ అకౌంట్లు వున్నాయని ఫేస్‌బుక్ తన వార్షిక రిపోర్టులో తెలిపింది. ★

చిన్నారి



జోక్ :

షాపు ఓనర్ : మా షాపులో ఏం కొన్నా అన్నిషాపుల కంటే రూపాయి తగ్గించి ఇస్తాం.


బంటి : అయితే రూపాయి పల్లీలు ఇవ్వండి అంకుల్!

పొడుపు కథ

కింది నుంచి పైకి ఆవిరులు,
పైన మేఘాల రూపాలు,
చల్లని గాలి తాకితే చాలు,
చేస్తూ వస్తా చిటపట ధ్వనులు

జవాబు : వర్షం

నీడ కనిపెట్టండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని జంతువులు, వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ నీడ దేనిదో కనిపెట్టండి!

చిట్టెలుక అంటే?





పిల్లలూ..! మీరు ఎలుకను చాలాసార్లు ఇళ్లల్లో చూసే ఉంటారు కదా? మరి ఎలుక గురించి మీకు తెలుసా? ఎలుకలూ వాటి పిల్లలకు పాలిస్తాయి. కనుక దీన్ని క్షీరదం అంటారు. ఇది చూడటానికి ఉడుత రూపంలో ఉంటుంది. కానీ కొద్దిగా పెద్ద పొట్టను కలిగి ఉంటుంది. ఎలుకల పళ్లు చాలా బలంగా ఉంటాయి. ఎంత బలంగా అంటే ఇవి చెక్కనూ అవలీలగా కొరికేయగల వన్నమాట! పిల్లలూ నిత్యజీవితంలో ఎలుకల వల్ల మనుషులు చాలా సమస్యలను ఎదుర్కొంటారని మీకూ తెలిసే ఉంటుంది కదా! అయితే వీటివల్ల ముఖ్యంగా రైతులకు నష్టం అంతా ఇంతా కాదు. పంట చేలను నాశనం చేయడం, ధాన్యపు గాదులకు బొక్కలు (బొర్రలు) చేస్తూ నిలువ ఉంచిన ధాన్యాన్ని ఇవి పాడు చేస్తుంటాయి. ఇంకా మీరు గమనిస్తే మన ఇంట్లో పెట్టెలో పెట్టిన బట్టలనూ, పుస్తకాలనూ కొరికేస్తుంటాయి. అంతేకాదు పిల్లలూ మానవులలో వచ్చే ప్లేగు వ్యాధులకు వీటినే ప్రధాన కారణాలుగా చెబుతుంటారు డాక్టర్లు. అయితే అన్ని ఎలుకలకూ ఒకే రకమైన లక్షణాలు ఉండవు. ఎలుకలలో పెద్దవీ, చిన్నవీ ఉంటాయి. వీటిలో చిన్నవాటిని చిట్టెలుకలు అని పిలుస్తారు. వాటివల్ల కొంత చెడు ఉన్నా వాటిపైనే శాస్త్రవేత్తలు అనేక ప్రయోగాలు చేస్తుంటారు. ఎలుక పిండం నుంచి సేకరించిన మూలకణాల సహాయంతో ప్రయోగశాలలో గుండె కండరాలను సృష్టించడంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు గతంలో విజయం సాధించారు. ఈ కండరాలను ఉపయోగించి, గుండె సంబంధ సమస్యల్ని పరిష్కరించే వీలుందని ఆ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రయోగాలకు ముఖ్యంగా చిట్టెలుకలనే ఉపయోగిస్తున్నారు. నాణానికి రెండు ముఖాలన్నట్లు ఎలుకలో ఉన్న మరో కోణమూ ఇప్పుడు మీకు తెలిసిందిగా. ★





నేను గీసిన బొమ్మ





బి. ఉదయ్‌భార్గవ్,
4వ తరగతి, జి.ఇ.స్కూల్, గుమ్మలక్ష్మీపురం, విజయనగరం జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

ఉత్కంఠపోరులో మహిళల విజయం

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్



అలోర్ సెటార్ (మలేషియా) : ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పి.వి. సింధూ సారథ్యంలోని మహిళాజట్టు, శ్రీకాంత్ సారథ్యంలోని పురుషుల జట్లు తొలి విజయాలను సాధించాయి. సోమవారం ఉత్కంఠభరితంగా హాంకాంగ్‌తో తలపడిన మహిళా జట్టు 3-2 పాయింట్ల తేడాతో గెలిచింది. ఈ టోర్నీ సెమీఫైనల్‌కు చేరిన నాలుగు జట్లు ఉబేర్ కప్, థామస్ కప్‌లకు నేరుగా అర్హత సాధిస్తాయి. పి.వి. సింధూ తొలి సింగిల్స్ మ్యాచ్‌లో 21-12, 21-18 పాయింట్ల తేడాతో ఇఫ్‌పుయ్ ఇన్(హాంకాంగ్)పై గెలిచి 1-0 ఆధిక్యతను సంపాదించింది. అనంతరం జరిగిన డబుల్స్‌లో పొన్నప్ప జోడీ 22-20, 20-22, 10-21తో ఓడిపోగా... కుదరవల్లి శ్రీకృష్ణ ప్రియ కూడా 19-21, 21-18, 20-22తో ఓడిపోవడంతో హాంకాంగ్ 1-2 ఆధిక్యతలో నిలిచింది. నాల్గో మ్యాచ్‌లో సింధూ- సిక్కిరెడ్డిల డబుల్స్ జోడీ 21-15, 15-21, 21-14తో పాయింట్లతో... నిర్ణయాత్మకమైన ఐదో మ్యాచ్‌లో రుత్వికా శివాని గద్దె 16-21, 21-16, 21-13తో గెలిచి చిరస్మరణీయమైన 3-2తో విజయాన్ని చేకూర్చింది. పురు షుల జట్టు 5-0 తేడాతో ఫిలిప్పీన్స్ జట్టుపై ఘన విజయం సాధించింది. మహిళా జట్టు గురువారం జపాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాది స్తుంది. పురుషుల బ్యాడ్మింటన్ జట్టు బుధవారం మాల్దీవులతో... గురువారం ఇండోనేషియాతో తలపడనుంది.

పురుషుల జట్టు : కిదాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, సమీర్ వర్మ, సాత్విక్ సాయిరాజ్, రాన్కీ రెడ్డి, చిరాజ్ శెట్టి, మను అత్రి, బి. సుమీత్‌రెడ్డి, రామచంద్ర, ఎం.ఆర్. అర్జున్
మహిళా జట్టు : పి.వి. సింధూ, శ్రీకృష్ణప్రియ, రుత్విక గద్దె, రుతుపర్ణ దాస్, మిథిల, అశ్విన్ పొన్నప్ప, సిక్కిరెడ్డి, ప్రజక్త సావంత్, సంయోగిత.
మహిళాజట్లు : గ్రూప్-డబ్ల్యు : భారత్, జపాన్, హాంకాంగ్,
గ్రూప్-ఎక్స్ : దక్షిణ కొరియా, చైనీస్ తైపే, మాల్దీవులు,
గ్రూప్-వై : థాయిలాండ్, మలేషియా, వియత్నాం, ఫిలిప్పీన్స్.
గ్రూప్-జడ్ : చైనా, ఇండోనేషియా, సింగపూర్
పురుషుల జట్లు : గ్రూప్-ఎ : చైనా, హాంకాంగ్, సింగపూర్
గ్రూప్-బి : జపాన్, దక్షిణకొరియా, నేపాల్, కజకిస్తాన్,
గ్రూప్-సి : చైనీస్ తైపే, మలేషియా, థాయ్‌లాండ్, మైన్మార్,
గ్రూప్-డి : భారత్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మాల్దీవులు.

చిట్టగాంగ్ పిచ్‌కు పూర్ రేటింగ్



ఢాకా : బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌కు చెందిన జాహర్ అహ్మద్ చౌదరి స్టేడియంకు ఐసీసీ పూర్ రేటింగ్ ప్రకటించింది. తొలి టెస్ట్‌కు మ్యాచ్ రిఫరీగా ఉన్న డేవిడ్ బూన్ ఈ పిచ్‌కు మంగళవారం (1 డీమెరిట్) పూర్ రేటింగ్‌ను ఇచ్చాడు. ఈ మైదానంలో జనవరి 31 నుండి ఫిబ్రవరి 4 తేదీల మధ్య శ్రీలంక-బంగ్లాదేశ్ దేశాల తొలి టెస్ట్ జరిగింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 513 పరుగులు చేస్తే... శ్రీలంక 713 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ బంగ్లాదేశ్ 5 వికెట్ల నష్టానికి 317 పరుగులు సాధించడంతో ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ టెస్ట్‌మ్యాచ్‌లో ఐదుగురు బ్యాట్స్‌మెన్‌లు సెంచరీలు చేయడమే కాకుండా... మరో ఆరుగురు అర్ధసెంచరీలను సాధించారు. అవుట్‌ఫీల్డ్ మానిటరింగ్ ప్రాసెస్ ప్రకారం ఈ మైదానం బౌలర్లకు ఏమాత్రం సహకరించని కారణంగా ఐసీసీ ఒక డీమెరిట్ (పిచ్ నాణ్యత) పాయింట్‌ను తగ్గించింది. ఈ పిచ్‌పై నిషేధం 12 నెలలపాటు అమలులో ఉండనుంది.

25 ఏళ్ల కల ఫలించనుందా!

టెస్ట్ సిరీస్ ఓడి కసిమీదున్న టీమిండియా వన్డే సిరీస్ గెలుపునకు చేరువలో నిలిచింది. ఇప్పటివరకు 25 ఏళ్లలో సఫారీగడ్డపై ఒక్కసారి కూడా ఏ సిరీస్ విజయం సాధించింది లేదు. ఎప్పుడు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లినా రిక్తహస్తాలతోనే తిరిగొచ్చేది. కోహ్లీ సారథ్యంలో ఆరు వన్డేల సిరీస్‌లో రెండు వన్డేల్లో గెలుపొంది ఊపుమీదున్న మన జట్టు ఈ మ్యాచ్ గెలిస్తే సువర్ణాధ్యాయం లిఖించే అవకాశముంది.

కేప్‌టౌన్ : భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య బుధవారం మూడోవన్డే జరగనుంది. ఇప్పటికే రెండు వన్డేలను గెలిచి ఊపుమీదున్న టీమిండియాను నిలువరించడం సఫారీజట్టుకు కష్టమేనని చెప్పవచ్చు. మూడో వన్డేకు డుప్లెసిస్, డివిలియర్స్, వికెట్ కీపర్ డికాక్‌లు దూరమవ్వడంతో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ కకావికలమైంది. క్రీజ్‌లో కుదురుకొని ఆడే బ్యాట్స్‌మన్లలో హషీమ్ ఆమ్లా ఒక్కడే మిగిలాడు.

కేప్‌టౌన్ మైదానంలో సఫారీ జట్టుతో తొలిటెస్ట్‌ను ఆడిన టీమిండియా 72 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఆ మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ మొత్తం ఘోరంగా విఫలమైనా హార్దిక్ పాండ్య 93 పరుగులతో చెలరేగిన విషయం తెలిసిందే. అయితే.. వన్డే సిరీస్ ఆరంభం నుంచి టీమిండియా అసాధారణ రీతిలో విజయాలు సాధిస్తోంది. డర్బన్‌లో జరిగిన తొలి వన్డేలో 6 వికెట్లతో గెలిచిన టీమిండియా... సెంచూరియన్ వేదికగా జరిగిన రెండో వన్డేలో 118 పరుగులకే దక్షిణాఫ్రికా జట్టుని కుప్పకూల్చిన తీరు వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో మళ్లీ కేప్‌టౌన్ వేదికగా దక్షిణాఫ్రికాపై టెస్ట్‌లో ఓడిన ప్రతీకారం వన్డే రూపంలో తీర్చుకునేందుకు ఇదే తగిన సమయం. సఫారీ జట్టు వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ మణికట్టు గాయంతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో కొత్త కుర్రాడు హెన్రిచ్ అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి. దక్షిణాఫ్రికాలో ఇప్పటివరకు భారత్ ఒక్క ద్వైపాక్షిక సిరీస్‌లోనూ రెండు మ్యాచ్‌లు మించి గెలిచింది లేదు. వన్డే సిరీస్ గెలిచే సదవకాశం టీమిండియా ముందు నిలిచింది. ఆతిథ్య జట్టులో అను భవజ్ఞులు గాయా లపాలై దూరమైన వేళ కోహ్లీ సేనకు ఈ విజయం నల్లేరుపై నడకే! అతి విశ్వాసానికి పోకుండా ఆడితే గెలుపు సులభమే.

స్పిన్ దెబ్బకు విలవిల..

భారత మణి కట్టు స్పిన్ ద్వయం యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు రెండు వన్డేల్లోను సఫారీ జట్టు పతనాన్ని శాసించారు. వీరిద్దరూ తొలి రెండు మ్యాచుల్లో 13 వికెట్లు తీశారు. రెండు వన్డేల్లో చాహల్ 7, కుల్దీప్ 6 వికెట్లు పడగొట్టారు. అంతే గాక ఆ జట్టు స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కో వడంలో ఇబ్బంది పడు తోంది. స్పిన్నర్లపై ఆధిపత్యం చెలాయించగల సీనియర్ బ్యాట్స్‌మన్ అయిన ఆమ్లా సైతం తన స్థాయికి తగిన ఆటను ఇంకా ప్రదర్శించలేదు. మిడిలార్డర్‌లో అనుభవజ్ఞుడైన బెహార్డిన్‌ను తీసుకోవాలని మార్క్రమ్ యోచిస్తున్నాడు.

భారతజట్టు : విరాట్ కోహ్లీ (సారథి), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్య రహానె, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్యా, యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్.

దక్షిణాఫ్రికా జట్టు : అయిడెన్ మార్క్రమ్ (సారథి), హషీమ్ ఆమ్లా, జేపీ డుమిని, ఇమ్రాన్ తాహిర్, డేవిడ్ మిల్లర్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగి ఎంగిడి, ఫెహ్లుక్‌వాయో, రబాడ, షంషి, జొండొ, బెహార్డిన్, హెన్రిచ్ (వికెట్ కీపర్).

గత చరిత్ర...

దక్షిణాఫ్రికాలో 1992-93, 2010-11లో పర్యటించిన భారత జట్టు ద్వైపాక్షిక సిరీసుల్లో రెండు మ్యాచులు గెలిచింది. రెండో పర్యటనలో 2-1తో ఆధిక్యంలో ఉన్న టీమిండియా వరుసగా మూడింట్లో ఓడి చివరికి 3-2తో సిరీస్ చేజార్చుకుంది. మరోసారి 5-2తో వెనకబడ్డారు. అయితే ప్రస్తుతం ఆతిథ్య జట్టు ఉన్న పరిస్థితుల్లో భారత్ సిరీస్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదు!

నేడు మూడో వన్డే సాయంత్రం 4.30 గం॥ల నుంచి



అయిడెన్ మార్క్రమ్





విరాట్ కోహ్లీ

నజరానాల వ్యత్యాసంపై ద్రావిడ్ అసంతృప్తి



ముంబయి: అండర్-19 ప్రపంచకప్ గెలిచిన యువజట్టుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) నజరానా ప్రకటించినా... పారితోషికం వ్యత్యాసం విషయమై ద్రావిడ్ మండిపడ్డాడు. ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచకప్‌లో టీమిండియా విజేతగా నిలిచిన క్రీడాకారులకు, కోచ్‌కు, ఇతర సహాయ సిబ్బందికి ఒక్కొక్కరికి ఒక్కోరకంగా పారితోషికాన్ని బీసీసీఐ ప్రకటించింది. కోచ్‌కు రూ. 50 లక్షలు, టీమిండియా క్రీడాకారులకు రూ.30లక్షలు, సహాయ సిబ్బందికి రూ.20 లక్షల చొప్పున ప్రకటించారు. ఈ పారితోషికం విషయమై కోచ్ రాహుల్ ద్రావిడ్ స్పందిస్తూ... 'అందరూ కలిసి సమష్టిగా కష్టపడితేనే ఈ ప్రపంచకప్ దక్కింది. అంతేకానీ, నేనేమీ వారి కంటే ఎక్కువ కష్టపడలేదు. నాకంటే వారు తక్కువ కష్టపడలేదు. మన జట్టు ప్రపంచకప్ గెలిచినప్పటి నుంచి ఈ విషయం నేను చెబుతూనే ఉన్నా. అలాంటప్పుడు బీసీసీఐ నజరానా విషయంలో ఎందుకు వ్యత్యాసం చూపించిందో తెలియడం లేదు' అని ద్రావిడ్ అన్నట్లు సమాచారం. మరి బీసీసీఐ ద్రావిడ్ వ్యాఖ్యలను పరిగణనలోనికి తీసుకుంటుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

అమరావతిలో సిఎస్ఐఆర్ టెక్నాలజీ

సిఎంతో సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతిలో సిఎస్ఐఆర్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్ గిరీశ్ సాహ్నీ సచివాలయంలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో సిఎం మాట్లాడుతూ ఐటికి ఇప్పుడు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ జత కలిసిందని, సిఎస్ఐఆర్ దేశం గర్వించే స్థాయికి ఎదిగినా పరిశోధన ఫలాలు క్షేత్ర స్థాయికి అందడం లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాంకేతికంగా ఉన్న ప్రతి అవకా శాన్నీ ప్రభుత్వం సంపూర్ణంగా వినియోగించుకుంటోందన్నారు. సిలికాన్ వ్యాలీ తరహాలో ఎపిని ఇన్నోవేషన్స్ వ్యాలీగా మార్చాలని సంకల్పించామని, కొత్త ఆవిష్కర ణలకు పెద్దపీట వేశామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి, సహజ సేద్యానికీ ప్రాధాన్యతనిస్తున్నామని, లాభసాటి వ్యవసాయమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. పరిశోధన, అధ్యయనాలకు శాశ్వత వేదికను ఏర్పాటు చేసుకునే వరకూ సిఎస్ఐఆర్ తాత్కాలిక ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తుం దన్నారు. రాష్ట్రంలోని విద్యా సంస్థలను అనుసంధానం చేసుకుని పరిశోధన ఫలాలను పరివ్యాప్తం చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. వాటర్ గ్రిడ్‌తో జల వనరులు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా అందేలా చేస్తున్నామని, సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించుకునేలా సిఎస్ఆర్ మార్గదర్శనం చేయాలని కోరారు. ఎపి ప్రభుత్వంతో పనిచేసేందుకు తగిన ప్రతిపాదనలతో వచ్చామని, రెండు మాసాల్లో పూర్తి డిపిఆర్‌తో వస్తామని సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ తెలిపారు.

బౌద్ధ ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చిన థాయ్‌ల్యాండ్

అమరావతిలో బౌద్ధ ఆలయాల నిర్మాణానికి థాయ్‌ల్యాండ్ బృందం ముందు కొచ్చింది. ఎపి నుంచి థాయ్ ఎయిర్‌వేస్ తరపున విమానాలను నడిపేందుకు సంసి ద్ధత వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రిని థాయ్‌ల్యాండ్ బృందం మంగళవారం కలిసింది. అమరావతిలో పది ఎకరాలు కేటాయిస్తామని, ఆలయ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు, ఆకృతులతో రావాలని ముఖ్యమంత్రి సూచించారు. విశాఖ లేదా విజయ వాడ నుంచి ఎయిర్‌వేస్ సేవలు ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు బృందం తెలపగా, విజయవాడ నుంచి ప్రారంభించాలని సిఎం కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్ధిస్టు లెర్నింగ్ సెంటర్‌కు అనుసంధానంగా ఉంటూ బౌద్ధ ధర్మం విశిష్టతలను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు థాయ్‌ల్యాండ్ కౌన్సిల్ జనరల్ కాంగ్ కనీత్ రక్చోరియన్ తెలిపారు.

బిటి-3 పత్తిపై ఎట్టకేలకు కదలిక

- నూజివీడు, కావేరి కంపెనీలకు షోకాజ్
- అనుమతుల్లేని విత్తనాలు అమ్మినట్లు నిర్ధారణ
- గడువు మీరినా స్పందించని సంస్థలు
- సర్కారీ పెద్దలతో రాయబేరాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

అనుమతుల్లేని బిటి-3 పత్తి విత్తనాలను రైతులకు విక్రయించిన నూజివీడు సీడ్స్, కావేరి సీడ్స్ సంస్థలకు వ్యవసాయశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బిటి-3 పత్తి విత్తనాలపై అధ్యయనానికి సర్కారు నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ పరిశీలనలో మూడవ తరం బిటి పత్తి విత్తనాలకు సంబంధించిన జన్యుపరమైన ఆధారాలు లభ్యమయ్యాయని సదరు షోకాజ్ నోటీసుల్లో వ్యవసాయ శాఖ పేర్కొంది. అనుమతుల్లేని పత్తి విత్తనాలను వాణిజ్యప రసాగుకు అమ్మడం చట్టరీత్యా నేరమని హెచ్చరించింది. విత్తన నియంత్రణ, పర్యావరణ చట్టాలను, నిబంధనలను అతిక్రమించినందున ఎందుకు లైసెన్స్‌లు సస్పెన్షన్ చేయ రాదో, ఎందుకు లైసెన్స్‌లు రద్దు పర్చరాదో తెలపా లని ఆదేశించింది. తాము పంపిన నోటీసు అందుకున్న తర్వాత ఐదు రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం చెప్పాలని, లేని పక్షంలో ఎలాంటి ముందస్తు సమాచారం తెలపకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నూజి వీడు సీడ్స్, కావేరి సీడ్స్ కంపెనీలకు నోటీసులు పంపిం చింది. వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ కార్యాలయం నుంచి ఆ శాఖ అదనపు సంచాలకులు (సీడ్స్) పేరుతో రెండు ప్రైవేటు విత్తన సంస్థలకూ నోటీసులు వెళ్లాయి. కాగా నోటీసులు అందుకున్న సదరు కంపెనీలు మంగళవారం సాయంత్రం వరకు అధికారికంగా స్పందిం చలేదని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. ఐదు రోజుల గడువు పూర్తయినా రాతపూర్వకంగా జవాబు చెప్ప కుండా ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో ఆ కంపెనీలు రాయ'బేరాలు' సాగిస్తున్నట్లు ఆరోపణలొ స్తున్నాయి. సర్కారు సైతం విత్తన సంస్థలను రక్షించేం దుకు, బిటి-3 వ్యవహారాన్ని తూతూ మంత్రపు చర్యలతో సరిపుచ్చేందుకు పావులు కదుపుతోందని విమర్శలొస్తున్నాయి.

వత్తాసు పలికి... నాలుక్కరుచుకొని

రెండు మూడేళ్ల నుంచి గుంటూరు జిల్లా కేంద్రంగా అనుమతుల్లేని రౌండప్ రెడీ ఫ్లెక్స్ (ఆర్ఆర్ఎఫ్) లేక గ్లెయిసెల్ పేరుతో పత్తిని సాగు చేసి ఆ విత్తనాలను రైతు లకు సరఫరా చేస్తున్నారు. తమ విత్తనాలు సాగు చేస్తే కలుపు నివారణ మందును తట్టుకుంటుందని, అందుకు జన్యువును చొప్పించామని తెగ ప్రచారం చేశారు. తొలుత ఆ విత్తనాలకు సర్కారు వత్తాసు పలికింది. తదుపరి నాలుక్కరుచుకొని అధ్యయనానికి కమిటీ నియమించింది. నిరుడు అక్టోబర్ 17న అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్‌ను వేసి పదిహేను రోజుల్లో నివేదిక ఇవ్వమనగా టాస్క్‌ఫోర్స్ ఆలస్యంగా రిపోర్టు ఇచ్చింది. ఇదిలా ఉండగా గుంటూరు రూరల్ మండలంలో అధికారులు పత్తి చేల నుంచి నమూనాలు సేకరించి పరీక్షల కోసం లేబొరేటరీకి పంపగా మూడోతరం బిటి జన్యువు చొప్పించినట్లు తేలింది. అనుమతుల్లేని విత్తనాలను నూజివీడు సీడ్స్ కంపెనీ 'రాజా' రకం పేరుతో విక్రయించిందని విచారణలో నిర్ధారణ అయినట్లు నూజివీడు సీడ్స్ సంస్థకు



పంపిన షోకాజ్ నోటీసులో వ్యవసాయశాఖ పేర్కొంది. అలాగే కావేరి సీడ్స్‌కు కూడా నోటీసులు పంపినట్లు సమాచారం. కర్నూలు జిల్లాలో బిటి-3 వ్యవహారంలో కొందరిపై ఎఫ్ఐఆర్ సైతం నమోదైంది.

అ అధికారిని తప్పించారా?

కాగా బిటి పంటల వాణిజ్యసాగుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని జన్యు ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ (జిఇఎసి) అనుమతించాలి. కానీ జిఇఎసి అనుమతుల్లేకుండా మూడేళ్ల నుంచి ఏపీలో అదీ, రాష్ట్ర పాలన కొలువైన సచివాలయం, అసెంబ్లీ సమీపం నుంచే లక్షలాది ఎకరాల్లో సాగుకు బిటి-3 పత్తి విత్తనాలు సర ఫరా అయ్యాయి. ఈ విషయాన్ని ప్రభుత్వమే ఒక జీవోలో అంగీకరించింది. ప్రభుత్వ పెద్దల అండ లేకుండా సీడ్ మాఫియా ఇంతగా చెలరేగడం అసంభవమన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. కొసమెరుపేమంటే.... గుంటూరు రూరల్ మండలంలో నమూనాలు సేకరించిన విత్తన నియంత్రణ సెల్ అధికారిని ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన్ని వేరొక సెక్షన్‌కు పంపారు.

ఎపికి పెట్టుబడులతో రండి

- జర్మనీ పారిశ్రామికవేత్తలకు మంత్రి అమరనాథ రెడ్డి ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని పరి శ్రమల శాఖ మంత్రి ఎన్ అమరనాథ రెడ్డి జర్మనీ పారిశ్రామిక వేత్తలను కోరారు. జర్మనీ పర్యటనలో భాగంగా ఆ దేశ రాజధాని బెర్లిన్‌లో మంగళ వారం పలు కంపెనీల ప్రతినిధులతో చర్చించా రు. తొలుత హర్బర్ కంపెనీ సిఇఒ అలెక్స్ బెర్న్ సోర్ఫ్, అప్లస్ ఆటో ఉపాధ్యక్షుడు హన్స్ జుర్గన్ చింప్ జెన్‌తో సమావేశమయ్యారు. ఇప్పటికే ప్రపంచస్థాయి కంపెనీలు కియా, అపోలో, హీరో తదితర కంపెనీలు ఎపిలో పెట్టుబడులు పెట్టా యని, పెట్టుబడులతో వస్తే పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మధ్యతరహా పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. తురింజన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బెంజిమెన్‌తో భేటీ అయి ఎపిలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి వివరించారు. రాష్ట్రంలో పర్యటించి ఎపిలో పెట్టుబడులు పెట్టేం దుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఆగస్టులో తురింజన్ రాష్ట్ర వాణిజ్య శాఖ మంత్రి, అధికారులు ఎపిలో పర్యటి స్తారని బెంజిమెన్ హామీ ఇచ్చారు. ఈ సమావే శంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఆర్ ప్రీతమ్ రెడ్డి, ఇడిబి అధికారులు పాల్గొన్నారు.

రేపు బంద్ నేపథ్యంలో సిఎంతో డిజిపి భేటీ

- శాంతి భద్రతలపై సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యా యానికి నిరసనగా వామపక్షాలు ఈ నెల ఎని మిదో తేది గురువారం బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. శాంతి భద్రతలకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు డిజిపి మాలకొండయ్యతో పాటు అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహిం చారు. వామపక్షాల బంద్‌కు కాంగ్రెస్, వైసిపిలు పూర్తి మద్దతు తెలిపిన నేపథ్యంలో సిఎం, డిజిపిల భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘట నలూ జరగకుండా చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. బంద్‌కు పిలుపు నిచ్చిన పార్టీలన్నీ ఢిల్లీలో తమ డిమాండ్లను విని పించాలని, రాష్ట్రంలో ఎటు వంటి విఘాతం కలి గించవద్దని చంద్రబాబు కోరారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం రాజీ లేకుండా అన్ని ప్రయత్నాలూ చేస్తుందని తెలిపారు. రాష్ట్రానికి న్యాయం జరగాలని టిడిపి, జనసేన నేతలు కోరుకుంటే గురువారం జరిగే బంద్‌లో అధికార పక్షం, జనసేన కూడా పాల్గొనాలని పలు సంఘాల నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బంద్ జరగకుండా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా నిర్వహించి తీరుతామని స్పష్టం చేస్తున్నారు.

రైల్వే బడ్జెట్‌లో ఎపికి రూ.3670 కోట్లు

- విజయవాడ-అమరావతి లైన్‌కు రూ.10కోట్లు
- ద.మ. రైల్వే జిఎం వినోద్ కుమార్ యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైల్వే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 3670కోట్ల నిధులు కేటాయించారు. విజయ వాడ- అమరావతి-గుంటూరు కొత్త లైనుకు ఈబడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారు. పలు రూట్లలో 385 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈఏడాది రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రూ.703 కోట్లతో 12 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 15 రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టను న్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు, తదితర అంశాలను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనే జర్ వినోద్ కుమార్ యాదవ్ మంగళవారం రైల్ నిలయంలో విలేకరులకు వెల్లడించారు. సికింద్రాబాద్, విజయవాడ స్టేషన్ల రి డెవలప్‌మెంట్ పనులను స్టేషన్ రైల్వే కార్పొరేషన్ చేపట్టనుందని జిఎం తెలిపారు.

తెనాలి - రేపల్లె, నంద్యాల - ఎర్ర గుంట్ల, ధర్మవరం - పాకల, పాణ్యం- దిగువ మెట్ట, గుంతకల్లు-కల్లూరు, గుంతకల్-బళ్లారిల మధ్య రైల్వే లైన్ల విద్యుదీకరణకు నిధులు కేటాయించారు. కడప-గుంతకల్-బెల్లారీ కొత్త రైల్వే లైన్ సర్వేకు అనుమతు లొచ్చాయి. ముస్తాబాద్ - కొండపల్లి, గుంతకల్ - మలప్ప మధ్య ఫ్లై ఓవర్ల నిర్మా ణానికి సర్వే చేయనున్నారు.

ఓబులవారిపల్లి-కృష్ణపట్నం కొత్తలైన్ ప్రాజెక్టుకు రూ.200కోట్లు కేటాయించారు. గుంటూరు -తెనాలి డబ్లింగ్‌కు రూ.40కోట్లు కేటాయించారు. నడికుడి- శ్రీకాళహస్తి కొత్త లైన్ ప్రాజెక్టుకు రూ.420 కోట్లు, కడప - బెంగుళూరు ప్రాజెక్టుకు రూ. 175కోట్లు, గుంతకల్ - కల్లూరు డబ్లింగ్‌కు రూ.76.52 కోట్లు, గుంటూరు - గుంతకల్ డబ్లింగ్‌కు రూ. 200కోట్లు, విజయవాడ- భీమవరం- నిడదవోలు డబ్లింగ్‌కు రూ.200కోట్లు, కోటిపల్లి - నర్సాపూర్ కొత్తలైన్‌కు రూ.200 కోట్లు, గూటి- ధర్మవరం డబ్లింగ్‌కు రూ.76కోట్లు, ఖాజీ పేట-విజయవాడ మూడోలైన్ నిర్మాణానికి రూ.60కోట్లు, విజయవాడ-గూడూరు మూడో లైన్ నిర్మాణానికి రూ.250కోట్ల కేటాయింపులు జరిగాయి. కర్నూల్‌లో మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ ఫ్యాక్టరీకి రూ.58కోట్లు, తిరుపతి రైల్వేస్టేషన్‌కు రెండో ద్వారం నిర్మాణం అభివృద్ధికి రూ. 7.95కోట్లు, తిరుచూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించారు. రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రూ.1813 కోట్లు కేటాయించారు.

అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్

- పగటిపూట 9గంటలు సరఫరా
- సంగం ప్రజా సంకల్పయాత్రలో జగన్ హామీ



సంగం బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

ప్రజాశక్తి-సంగం

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పగటి పూట తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్ అందిస్తామని వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని దువ్వూరు నుంచి సంగంకు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.150లకు 11 రకాల రేషన్ సరకులు ఇచ్చేవారని తెలిపారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పొదుపు మహిళలకు రుణాలు మాఫీ చేస్తామన్నారు. రైతులకు రుణ మాఫీ ఒకే సారి చేస్తామన్నారు. వైద్యం ఖర్చులు వెయ్యి రూపాయలు దాటిన వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద చేరుస్తామని పేర్కొన్నారు. 46 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.రెండు వేల పింఛన్ అందజేస్తామని వివరించారు. 108 సేవలను పునరుద్ధరిస్తామన్నారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భూమి పూజ చేసిన సంగం బ్యారేజీని ఆయన పరిశీలించారు. తన తండ్రి హయాంలో ఐదు బ్యారేజీలకు శంకుస్థాపన చేసినా అవి నేటికీ నిర్మాణదశలోనే ఉన్నాయన్నారు. మన ప్రభుత్వంలో పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామన్నారు. సంగం చెక్‌పోస్టు సెంటర్‌లో 70 అడుగుల పార్టీ జెండాను ఆవిష్కరించారు. పాదయాత్రలో భాగంగా అనారోగ్యంతో ఉన్న జెడ్పిటిసి దేవసహాయాన్ని జగన్ పరామర్శించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

ప్రత్యేక హోదాతోనే ప్రజలకు మేలు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ హోదా, ప్యాకేజి అంటే నిధులే అని అర్థం వచ్చేలా మంగళవారం పార్లమెంట్‌లో భాష్యం చెప్పారు. ప్రత్యేకహోదా వస్తే వివిధ పథకాలకు ఇచ్చే నిధుల్లో 90శాతంను కేంద్రం భరిస్తుందని, ప్యాకేజి వల్లే అది 60శాతంగా మారిందని అన్నారు. మిగిలిన మొత్తాన్ని భర్తీ చేయడానికి కసరత్తు చేస్తున్నామని అన్నారు. మంత్రి మాటలు వింటే ప్రత్యేకహోదా అంటే నిధులు మాత్రమే అన్న అభిప్రాయం కలుగుతుంది. కానీ, వాస్తవం వేరు. హోదా ఇస్తే పారిశ్రామిక సంస్థలకు పన్ను మినహాయింపుతో పాటు అనేక ప్రోత్సహాలు వస్తాయి. పరిశ్రమలతోపాటు కొత్త ఉద్యోగాలు వస్తాయి. ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి. ప్రత్యేకహోదా అంటే ప్రజల దృష్టిలో పరిశ్రమలు, ఉద్యోగాలు. ప్రభుత్వాల దృష్టిలో కేవలం నిధులు ... అందుకే ఈ కుప్పిగంతలు. అసలు ప్రత్యేకహోదా అంటే ఏమిటి?

ఒక రాష్ట్రానికి లేదా కేంద్ర పాలిత ప్రాంతానికి కేంద్రం ప్రత్యేక హోదా ఇస్తుంది. దీని ప్రకారం ఆ రాష్ట్రానికి లేదా ప్రాంతానికి కేంద్రం ప్రత్యేక రాయితీలను ఇస్తుంది.

ప్రత్యేక ప్యాకేజీ అంటే?

ప్రత్యేక కారణాల వల్ల కేంద్రం రాష్ట్రాలకు, ప్రాంతాలకు డైరెక్ట్‌గా నిధుల సహాయం చేయడమే ప్రత్యేక ప్యాకేజీ. ఉదాహరణకు ఎన్నికల సమయంలో తలెత్తిన రాజకీయ కారణాలు కూడా కావచ్చు. దీని ప్రకారం కేంద్రం ఓ రాష్ట్రానికి నిర్దిష్టమైన నిధులతో కూడిన ప్యాకేజీని కల్పిస్తుంది.

ప్రత్యేక హోదా ఎవరిస్తారు?

ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే అధికారం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రణాళికా సంఘం సభ్యులు (ఇప్పుడు నీతి ఆయోగ్ సభ్యులు), ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఉండే జాతీయ అభివృద్ధి మండలికి ఉంటుంది. ఒక రాష్ట్రానికి లేదా ప్రాంతానికి ప్రత్యేక హోదా మంజూరును పార్లమెంటులోని ఉభయ సభలు మూడింట రెండు వంతుల ఆధిక్యంతో రాజ్యాంగ సవరణ ద్వారా చేయాలి. ఈ విషయానికి సంబంధించి రాజ్యాంగంలోని 21వ భాగానికి చెందిన ఆర్టికల్స్ 369 నుంచి 392 వరకు కొన్ని ప్రత్యేక అంశాలను పేర్కొనడం జరిగింది. వీటిలో ఆర్టికల్ 370 (జమ్ము, కాశ్మీర్), 371, 371ఎ నుంచి 371ఐ వరకు (మహారాష్ట్ర, గుజరాత్, గోవా, ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, అస్సాం, మణిపూర్, సిక్కిం, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్) ముఖ్యమైన సవరణలు.



ప్రత్యేక హోదా పొందిన రాష్ట్రాలు

1969లో అయిదవ ఆర్థిక సంఘం సూచనలతో మొదలైన ఈ తరహా ప్రతిపత్తి మొట్టమొదట పొందిన రాష్ట్రాలు జమ్ము కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్. ఆ తర్వాత ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నూతనంగా ఏర్పడిన ఉత్తరాఖండ్‌లో కలిపి 11 రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాతిపదికన కేంద్ర ఆర్థిక సహాయంలో ప్రాధాన్యం లభిస్తుంది. ఈ హోదా కోరుతున్న రాష్ట్రాలలో కొత్తగా ఏర్పడింది మన రాష్ట్రమే. ఉత్తరాఖండ్ నూతనంగా ఏర్పడి నప్పుడు అధికారంలో వున్న ప్రస్తుత ఎన్.డి.ఎ ఏ విధంగా సాయం చేసిందో, అదే మాదిరిగా నిలువ నీడ లేకుండా పోయిన నూతన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలనేది ప్రజల ఆకాంక్ష.

కోరుతున్న రాష్ట్రాలు

అయితే ప్రత్యేక హోదా కోరుతున్న రాష్ట్రాలు ఆంధ్రతో పాటుగా మరికొన్ని వున్నాయి. అందులో బీహార్ రాష్ట్ర అభ్యర్థన ఎప్పటి నుంచో పెండింగ్‌లో వున్నదే. అలాగే రాజస్థాన్, ఒడిషా, జార్ఖండ్ సైతం ఈ ప్రతిపత్తిని డిమాండ్ చేస్తున్నాయి. వీటితోపాటుగా బెంగాల్‌లో డార్జిలింగ్ ప్రాంత అభివృద్ధికి, బోడోల అభివృద్ధికి, విదర్భ ప్రాంత అభివృద్ధికి, పొరుగున ఉన్న ఉత్తర కర్నాటక ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలన్న అభ్యర్థనలు ఎప్పటి నుంచో వున్నాయి.

-ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ప్రత్యేక సహాయం అంటే?

- ప్రత్యేక సహాయం కొన్ని లక్ష్యాలతో కూడినది. నిర్దిష్ట లక్ష్యాలను సాధించడమే ప్రత్యేక సహాయం (స్పెషల్ అసిస్టెన్స్ మెజర్) ఉద్దేశ్యం.
- రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేకంగా ఒక క్యాటగిరీకి చెందిన వాటికి (వెనుకబడిన జిల్లాలు లేదా పరిశ్రమలు లేదా విద్యా కేంద్రాలు...).కేంద్రం సహాయం చేస్తుంది
- పెట్టుబడులను ఆకర్షించడానికి కేంద్రం పన్ను రాయితీలతో వెసులుబాటు కల్పిస్తుంది.
- సహాయం అనేది ఎన్ని సంవత్సరాలైనా సరే రాష్ట్రం ఆ రంగంలో నిలదొక్కుకునేంత వరకు కేంద్రం సాయం చేస్తూనే వుంటుంది.
- వెనుకబడిన జిల్లాల దగ్గరి నుంచి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన వరకు కేంద్రం అన్నింటా రాష్ట్రానికి సహాయం చేస్తుంది.
- ప్యాకేజీ అమలు తప్పనిసరి ఏమీకాదు. ప్రభుత్వం ఎగ్గొట్టినా చేసేదేమీ వుండదు. దీనికి ఎలాంటి చట్టబద్ధత వుండదు కనుక కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఇది ఆధారపడి వుంటుంది అదే ప్రత్యేక హోదా అయితే దానికి చట్టబద్ధత వుంటుంది. అందులో పేర్కొన్న హామీలన్నీ కచ్చితంగా అమలు చేయాల్సి వుంటుంది.

ప్రత్యేక 'హోదా-ప్యాకేజీ-సహాయం' ఏది ప్రయోజనకరం?

ప్రత్యేక హోదాలో కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇచ్చే నిధులను హోదా లేకుండానే ఇస్తున్నామని కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు చెబుతున్నారు (ఈయన రెండేళ్ళ క్రితం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హో దా ఐదేళ్ళు కాదు పదేళ్ల కావాలని పార్లమెంటులో వరించిన వ్యక్తి)

ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి నష్టం అని తెలుగు దేశం తరుపున కేంద్ర మంత్రి పదవి వెలగబెడుతున్న సుజనా చౌదరి చెబుతున్నారు (ఈయన రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేక హోదా ఇదిగో ఇచ్చేస్తోంది, అదిగో ఇచ్చేస్తోంది అని నిన్నటి వరకు ఊరించిన వ్యక్తి)

అటు బిజెపి ఇటు తెలుగు దేశం నేతలు మీడియాలో ఒక సెక్షన్ ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా ప్రత్యేక సహాయానికి అనుకూలంగా ప్రచారం అందుకున్నాయి. కాని వాస్తవానికి ప్రత్యేక వల్ల వనకూడే లాభాలేంటి? మిగిలిన ప్యాకేజీలకు గల తేడా ఏమిటి?

'ప్రత్యేక హోదా' వల్ల ఆ ప్రాంతానికి లేదా రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయి. ఉపాధి కలుగుతుంది. మౌలిక వసతులు ఏర్పడతాయి. దాంతో ప్రజల ఆదాయాలు పెరిగి అభివృద్ధికి బాటలు పడతాయి. ఇకపోతే 'ప్రత్యేక ప్యాకేజీ' ఓసారి ముగిసిందీ అంటే ఆ తర్వాత కేంద్రం నుంచి ఎలాంటి సహాయం అందదు. 'ప్రత్యేక సహాయం' అనేది వెనుకబడిన ఒక రంగంలో మాత్రమే కేంద్రం చేసే సాయం. ఆ రంగం అభివృద్ధి చెందే వరకు సాయం చేస్తూనే వున్నప్పటికీ వృద్ధి ఆ రంగానికే పరిమితమౌతుంది. కనక ఇది సంపూర్ణ వృద్ధికి తోడ్పడదు. అందుకే ప్రత్యేక హోదా కల్పిస్తే ప్యాకేజీ, సహాయం అన్నీ అందినట్టే. అందుకే ప్రజల ఆకాంక్షలు కూడా అటువైపే వున్నాయి. పైగా ముందుగా ఇది నేతల తరపు నుంచి వచ్చిన వాగ్దానమన్న విషయాన్ని వారూ విస్మరించకూడదు.

హోదా - ప్రయోజనాలు

- **ప్రత్యేక హోదా కల్పించడం వల్ల రాష్ట్రాలకు కింది ప్రయోజనాలు కల్గుతాయి. ప్రణాళికా వ్యయంలో అధిక వాటా. ఇప్పటి వరకు అమలులో వున్న నిబంధనల ప్రకారం కేంద్రం చేసే ప్రణాళికా వ్యయం (సెంట్రల్ ప్లాన్-అవుట్ లే) మొత్తాన్ని ఖర్చు చేసే అంశంలో 30 శాతాన్ని ప్రత్యేక వర్గ హోదా కలిగిన రాష్ట్రాలలో, మిగిలిన 70 శాతాన్ని మిగిలిన అన్ని రాష్ట్రాలకు కలిపి ఖర్చు చేయాలి.**
- **కేంద్రం అందించే ఆర్థిక సహాయం మొత్తంలో 90 శాతం గ్రాంటుగాను, 10 శాతం రుణంగాను వుంటుంది. అదే మిగిలిన రాష్ట్రాలకు (అంటే ప్రత్యేక వర్గ హోదా లేనటువంటివి) 30 శాతం గ్రాంటుగాను, 70 శాతం రుణంగాను అందుతుంది.**
- **కేంద్ర ప్రాయోజిత విదేశీ రుణ ఆధారిత ప్రాజెక్టుల నిధుల విషయంలో ఈ తరహా రాష్ట్రాలకు 90 శాతం గ్రాంటుగా లభిస్తాయి.**
- **ఎక్సైజ్ డ్యూటీ, పన్నుల విధింపులో కొన్ని రాయితీలు లభిస్తాయి. అందువల్ల పారిశ్రామికవేత్తలు ఇటువంటి రాష్ట్రాలలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే అవకాశం మెండుగా వుంటుంది.**
- **కొన్ని ఎంపిక చేసిన కొండ ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు లభించే అవకాశం వుంది.**
- **ఆ ప్రాంత లేదా రాష్ట్ర లోటు బడ్జెట్‌ను కేంద్రం పూడుస్తుంది.**


వుండాల్సిన అర్హతలు

ఒక రాష్ట్రానికి లేక ప్రాంతానికి ప్రత్యేక హోదా ప్రకటించేందుకు పరిగణనలోకి తీసుకునే కీలక అంశం ఆ ప్రాంత ఆదాయ వనరులు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల అభివృద్ధికి తగిన నిధులు సమకూర్చుకొనే అవకాశం, వెసులుబాటు లేని రాష్ట్రాలకు ఈ హోదాను కల్పించవచ్చు. ఆ ప్రత్యేక పరిస్థితులు, లక్షణాలివి. ఎ) ప్రత్యేక ప్రాంతం, బి) తక్కువ జనాభా సాంద్రత లేక గిరిజన జనాభా శాతం గణనీయంగా ఉండే ప్రాంతం, సి) పొరుగు దేశాలతో సరిహద్దు కలిగినటువంటి కీలక ప్రాంతం, డి) ఆర్థిక, మౌలిక వసతుల వెనుకబాటుతనం వున్న రాష్ట్రం ఇ) రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు గడ్డుగా ఉండే అటువంటి రాష్ట్రాలకు 'ప్రత్యేక హోదా' ఇస్తారు.

పోల'వరం' కష్టమే

ప్రజాశక్తితో ఉండవల్లి అరుణ్‌కుమార్

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తాజాగా ఏర్పడిన పరిణామాలతో పోలవరం ప్రాజెక్టు ఫలాలు ప్రజలకు సకాలంలో అందడం కష్టంగా మారిందని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ప్రాజెక్టు పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న అయన ఉద్దేశ్యపూర్వకంగానే ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును అలస్యం చేస్తున్నాయని చెప్పారు. ఇంటర్వ్యూ పూర్తి వివరాలు క్లుప్తంగా :



ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం మాటలకు, చేసే పనులకు పొంతన లేకుండా ఉందని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. 2018 కల్లా ప్రాజెక్టు పూర్తి కావడం ఖాయమంటూ పదేపదే చేసిన ప్రకటనలు సాకారం కావాలంటే ఖర్చు చేయాల్సిన మొత్తంలో నామమాత్రంగా కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయడం లేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ మూడేళ్లలో చేసిన ఖర్చు కేవలం రూ. 3,500 కోట్లేనని, జాతీయ హోదా ప్రకటనతో కేంద్ర పూర్తి చేయాల్సిన నిర్మాణ పనులను తామే చేస్తామంటూ రాష్ట్ర సర్కారు తీసుకున్న తర్వాత అంచనాలు భారీగా పెంచేసిందన్నారు. చేసిన ఖర్చులోనూ అవకతవకలు జరుగుతున్న వ్యవహారంలో సిఎం చంద్రబాబు మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. అంచనా వ్యయాన్ని ఎందుకు పెంచాల్సి వచ్చిందన్న దానిపై స్పష్టత లేదన్నారు.

నిర్వాసితులకు న్యాయం జరిగేనా ?

కొత్త భూసేకరణ, పునరావాస చట్టం వల్ల నిర్వాసితులకు భారీగా నిధులు ఇవ్వాల్సి వస్తోందని చెప్పిన ప్రభుత్వం అంచనాలను పలు దఫాలుగా పెంచిందన్నారు. దీంతో ఒక పక్క భూసేకరణ, పునరావాస వ్యయాన్ని ఎవరు భరించాలన్న దానిపై సందిగ్ధత వీడడం లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటం వల్ల రూ. వేల కోట్లు ఏ విధంగా భరిస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం వ్యయాన్ని తాము ఇచ్చేది లేదని అనేక సందర్భాల్లో కేంద్రం తేల్చిచెప్పినా . కేవలం అసెంబ్లీ సీట్లు పెంపుదల కోసమే సిఎం రాజీ ధోరణి అవలంబిస్తూ కేంద్రంతో లాలూచీ పడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రత్యేక హోదా, రాజధాని, బకాయిలు చెల్లింపులు వంటి వాటిపై రాజీ ధోరణి అవలంభిస్తున్న ప్రభుత్వం పోలవరంపై కూడా ఇదే ధోరణి అవలంభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాజెక్టుకు సంబంధించిన స్పిల్‌వే, దయాఫ్రం వాల్, ఎర్త్‌కం రాక్‌పిల్ డ్యాం పనులకు సంబంధించి ఇప్పటి వరకు చేసిన పనులకు రూ.3,217 కోట్లు రావాల్సి ఉందన్నారు. కానీ కేంద్రం మాత్రం వాటిని విడుదల చేయడం లేదన్నారు. మరోవైపు రెవెన్యూ లోటు కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 3,100 కోట్లు రావాల్సి ఉండగా అక్కడ కూడా మొండి చెయ్యే ఎదురైందన్నారు. గతేడాది కూడా నాబార్డు ద్వారా నిధులు అందజేస్తామని ప్రకటించిన కేంద్రం నిధులు విడుదల చేయలేదన్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 250 కోట్లు కేటాయిస్తే, 2015-16 బడ్జెట్‌లో కేవలం రూ. 100 కోట్లు విదిలించిందన్నారు. 2016-17 బడ్జెట్‌లోనూ రూ. 100 కోట్లే కేటాయించిదని, 2017-18 బడ్జెట్‌లో కనీసం రూపాయి కూడా కేటాయించలేదన్నారు. 2014-15లో రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై రూ.1952 కోట్లు ఖర్చు చేస్తే, అందులో రూ. 345 కోట్లను కేంద్రం వాపసు ఇవ్వగా, ఇంకా రూ.1607 కోట్లు రావాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తవ్వాలంటే ఇప్పుడున్న అంచనాల ప్రకారం దాదాపు రూ. 43 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఎఐబిపి ద్వారా 2008 నుంచి 2014 మార్చి వరకు 3658 కోట్లు విడుదల చేసిందని, జాతీయ హోదా వచ్చిన తర్వాత గత ఏడాది నవంబర్ వరకు రూ. 3133 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇందులో పోలవరం అథారిటీ ఏర్పడిన తర్వాత రూ. 2916 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టులో పలు కేసులు ఉన్నాయని, ఇవన్నీ పరిష్కారం జరిగి నిధులు దారాళంగా విడుదలైతే తప్ప పూర్తయ్యే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఇటీవల ఉత్తరాంధ్ర ప్రతినిధుల బృందం కేంద్ర జలవనరులశాఖ మంత్రి గడ్కరీని కలిసిన సమయంలో 2018కల్లా పోలవరం పూర్తి చేస్తామని చెప్పారని, మరోపక్క సిఎం చంద్రబాబు 2019 కల్లా పూర్తి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ బడ్జెట్‌లో పోలవరానికి ప్రత్యేక నిధులు కేటాయించకపోయినా నాబార్డుకు రూ. 30 వేల కోట్లు అదనంగా ఇస్తున్నామని గానీ, ప్రధాన మంత్రి కృషి సంచారయోజన కింద ఇచ్చే రుణం రూ. 30 వేల కోట్లు కేటాయిస్తే ఆనందించవచ్చన్నారు. ప్రాజెక్టు అంశంలో బిజెపి, టిడిపిలు నాటకాలడుతున్నాయి. 'ప్రాజెక్టులో అవినీతి జరిగిందనేది అక్షర సత్యం. అవినీతి జరగకపోతే చంద్రబాబు ఎందుకు నోరుమెదపడం లేదు. అసలు పోలవరం పూర్తవుతుందనే నమ్మకం లేకపోవడం వల్లే పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులు చేపట్టారు' అని అన్నారు.

ఉపాధి హామీపైనా చిన్నచూపే

- **కేంద్రం నుంచి అరకొరగానే నిధులు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి, టిడిపి రాజకీయ వ్యవహారాల కారణంగా రాష్ట్రంలో అన్ని రంగాలతో పాటు ఉపాధి పథకం అమలుకు అవసరమైన నిధులనూ మంజూరు చేయడంలో కేంద్రం శీతకన్నేసింది. భారీ మొత్తంలో నిధులు వస్తాయని ఆశించిన రాష్ట్రం, కేంద్రం నుంచి నిధుల విడుదలలో జాప్యం కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ కన్వర్జెన్స్‌తో చేపట్టిన పనుల ఆశించిన స్థాయిలో జరగలేదు. భవిష్యత్తులోను ఇదే తీరు కొనసాగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకవైపు వేతనాలు, మరోవైపు మెటీరియల్ కాంపొనెంట్ విడుదలలో తీవ్ర జాప్యం అవుతోంది. కొద్ది నెలల కిందట రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి తోమర్‌ను కలిసి కూలీల వేతనాలకు రూ.600 కోట్లు, మెటీరియల్‌కు రూ.1,600 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఇప్పటికీ ఈ మొత్తంలో 50 శాతం నిధులు మాత్రమే విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నట్లు, ఉపాధి పథక అమలులో లోపాలు అధికంగా ఉండటంతోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందనే వాదనలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది రూ. 6,566.67 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటి వరకూ రూ.4500 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారు. మరోవైపు ఇళ్ల కేటాయింపులోను ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ఇళ్ల కావాలని కోరుతున్న పేదలు అధికంగా ఉన్నారు. కొద్ది నెలల కిందట రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు డిల్లీ వెళ్లి కేంద్ర మంత్రిని కలిసి అదనంగా ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం 21 లక్షల మందిని అర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో రాష్ట్రానికి అదనపు కేటాయింపుల ఊసే ఎత్తలేదు. దేశ వ్యాప్తంగా రూ.21 వేల కోట్లతో 49 లక్షల ఇళ్ల పేదలకు నిర్మించనున్నట్లు పేర్కొంది.

సహకరించని కేంద్రం

- **అలవోకగా అప్పు చేసేస్తున్న రాష్ట్రం**

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

కొత్త రాష్ట్రం ఏర్పడి నాలుగేళ్లు కావస్తోంది. కేంద్రం నుండి సహకారం ఏ మాత్రం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేస్తోంది. చేసిన అప్పులు ఏం చేస్తున్నారు... దేనికి ఖర్చు చేస్తున్నారన్నది కూడా తెలియని గందరగోళం కనిపిస్తోంది. హెూదా అంటూ ఆశలు కల్పించిన కేంద్రం తరువాత ప్యాకేజి అంటూ మాట మార్చడం, చివరకు ప్యాకేజిలో కూడా విదిలింపు విధానాన్ని అనుసరించడంతో రాష్ట్రంలో ఆర్థిక, అభివృద్ధి సమస్యలు తొలగిపోయే పరిస్థితి కనిపించడం లేదు.

2014లో రాష్ట్ర విభజన నాటి నుంచి రాష్ట్రం అప్పులపైనే ఆధారపడుతోంది. ఈ మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా 70 వేల కోట్ల రూపాయలు అప్పు చేసేశారు. విభజన జరిగిన 2014-15 సంవత్సరానికి 1.48 లక్షల కోట్ల రూపాయల రుణం ఉండగా, అది 2017-18 నాటికి రూ. 2.16 లక్షల కోట్లకు చేరిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుండగా, మొత్తం అప్పు రూ. 2.30 లక్షలకు చేరనుందని ప్రాథమిక అంచనా.

ఇది జిఎస్‌డిపిలో కూడా భారీగా కనిపిస్తుండడంతో కొత్త అప్పులపై, కేంద్ర సాయంపై ప్రభావం చూపించనుంది. మొత్తం రుణాలు జిఎస్‌డిపిలో 25 శాతం దాటకూడదన్న నిబంధన ఉండగా, ప్రస్తుతం 28.11 శాతం ఉంది. దీనివల్ల నీతీ ఆయోగ్ నుంచి రావాల్సిన అదనపు ప్రయోజనాలు కూడా లేకుండా పోతున్నట్లు ఆర్థిక నిపుణులంటున్నారు.

అప్పులతో హంగులు

అప్పు చేసి పప్పుకూడు సామెత వినే ఉంటారు కదా! రాష్ట్ర పరిస్థితి అదేమాదిరి తయారైంది. చేసిన అప్పుల్లో అధికభాగం పాత అప్పుల వడ్డీలకు సరిపోతుండగా మిగిలిన మొత్తం హంగులకు రాష్ట్ర సర్కారు వినియోగిస్తోంది. రూ. 90 వేల కోట్ల అప్పుల్లో రూ. 65 వేల కోట్ల పాత అప్పుల కోసం చెల్లించారు. మిగిలిన నిధులను ప్రధానంగా ఉత్సవాలు, విదేశీయాత్రలు, పుష్కరాలు, నగరాలను అందంగా తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాలకు ఎక్కువశాతం నిధులు ఖర్చు చేసినట్లు లోపాయికారీగా అంగీకరిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న సంస్థలు కూడా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. నేరుగా కార్పొరేషన్లకు రుణం తీసుకునే అధికారాలను కల్పిస్తూ, వాటిని తాను గ్యారంటీగా ఉంటోంది. అనంతరం ఈ రుణాన్ని తాను తీసుకుని, ఇతర రంగాలకు ఖర్చు చేస్తోంది. ఒక రుణాన్ని 20 ఏళ్లలో చెల్లిస్తామంటూ దరఖాస్తు చేసుకోవడం అన్నది ఆంధ్రప్రదేశ్‌తోనే ప్రారంభం కావడం గమనార్హం. దీనివల్ల అసలు చెల్లింపునకు దీర్ఘకాల గడువు లభిస్తున్నప్పటికీ, అప్పు భారం పెరుగుతుందన్నది నిపుణుల వాదన.

విభజన హామీలు అమలు చేయాలి

- **ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని, ప్రత్యేక ప్యాకేజీలో నిర్దిష్ట కేటాయింపులు చేయాలని ఏపి పునర్విభజన చట్టంలో పొందుపరచి ఉందని మాజీ మంత్రి కొణ తల రామకృష్ణ మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి పై కేంద్రం హామీలు, బడ్జెట్ కేటాయింపుల పై ప్రజాశక్తితో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీలు, అందుకు అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న బిజెపి కూడా ఆమోదించి అధికారంలోకి వచ్చి మూడేళ్ల గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని ఎద్దేవా చేశారు. ఈమేరకు ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం కేంద్రాన్నే నేరుగా ప్రశ్నిస్తామని, ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి ఉత్తరాంధ్ర చర్చా వేదిక తరపున రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ ఢిల్లీలో మకాం వేశారు. పలువురు నేతలు కేంద్ర మంత్రులను కలసి విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీతోపాటు విభజన చట్టంలో పొందుపరచిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు.

ఏపి పై కేంద్రం చిన్న చూపు చూస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజనతో సగం వెనుకబడిపోతే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులు చేయక మరింత వెనుకబడిపోయిందని విమర్శించారు. ముందు ప్రత్యేక క్యాటగిరీ అని ప్రకటించి, ఆ తర్వాత ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని చెప్పారన్నారు. చివరికి ప్రత్యేక మొండిచేయి ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రత్యేక ఆర్థిక సహాయం కింద 2016లో రూ 350 కోట్లు కేటాయించారని ఆతర్వాత ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. కేంద్రం ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్రానికి ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు (ఇఎపి) వచ్చేలా చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టూ మంజూరు కాలేదన్నారు. కేంద్రం ఐదేళ్ల ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తామని చెప్పిందని, ఇప్పటికే దాదాపు నాలుగేళ్ల పూర్తయినా ఆమేరకు సాయం అందలేదన్నారు. ప్రత్యేక ఆర్థిక సాయం కింద కేంద్రం వాటా రూ 3 వేల కోట్లు ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటికీ కేటాయింపుల్లేవన్నారు. బుందేల్‌ఖండ్ తరహాలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్యాకేజీ కేటాయించాలని కేంద్రాన్ని డిమాం డ్ చేశారు. కనీసం రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజి, రాయితీలు ఇస్తే పరిశ్రమలు వస్తాయని, తద్వారా ఉపాధి అవకాశాలు, తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు.

వేదిక డిమాండ్లు

- కేంద్రం ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి. రూ 1500 కోట్లు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి.
- ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు బుందేల్‌ఖండ్, బోలంగీర్ - కలహండి - కోరాపుట్ తరహా ప్యాకేజీ ప్రకటించాలి.
- రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పన్నుల రాయితీలతో కూడిన ప్రత్యేక హోదాను ప్రకటించాలి.
- విశాఖ రైల్వే జోన్‌ను ప్రకటించాలి.
- గిరిజన విశ్వవిద్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.
- ఎయిమ్స్ ఆస్పత్రిని విశాఖలో ప్రారంభించాలి.
- రాయలసీమలో హైకోర్టును, అమరావతి, విశాఖలో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలి.
- విశాఖ మెట్రో రైలు పనులు వెంటనే ప్రారంభించాలి.
- ఉత్తరాంధ్రలోని నదులను గోదావరితో అనుసంధానం చేయాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక డిమాండ్ చేస్తోంది.



రైల్వే జోన్ ఊసేలేదు

అపాయింట్ డేట్ నుంచి ఆరు నెలల్లోగా రైల్వే శాఖ ఏపిలో రైల్వే జోన్ ఏర్పాటు పై ఒక నిర్ణయం తీసుకోవాలని విభజన చట్టంలో ఉందన్నారు. కాని మూడున్నరేళ్లు గడిచినా రైల్వే జోన్ ప్రకటించలేదని కొణతల విమర్శించారు.

రైల్వే జోన్ కోసం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఇప్పటికీ రహస్యంగానే ఉందని ఎద్దేవా చేశారు. రైల్వే జోన్ లేకపోవడంతో ఉద్యోగాల్లో, లాజిస్టిక్స్, రవాణా రంగాల్లో వెనుకబడ్డామని చెప్పారు. వాణిజ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. ఇప్పటివరకు శ్రీకాకుళం నుంచి అమరావతికి నేరుగా రైలు సదుపాయమే లేకపోవడం విచారకరమన్నారు. విశాఖలో రైల్వే జోన్ ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అక్కడ జోన్ ఏర్పాటు చేస్తే కాకినాడ పోర్టు, విశాఖ పోర్టు, అక్కడ ఉన్న పరిశ్రమలు తదితర అవకాశాలను బట్టి విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేస్తే పలు రంగాల్లో అభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక కారిడార్‌కు రైల్వే జోన్ ఉంటే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రైల్వే జోన్ ప్రస్తావన వస్తే అక్కడి స్థానికులు, వివిధ రంగాల వారి అభిప్రాయాలు తీసుకోవలని సంబంధంలేని నిబంధనలు పెడుతోందన్నారు. గతంలో వివిధ రాష్ట్రాలకు కొత్తగా 7 రైల్వే జోన్లు ప్రకటించినప్పుడు ఇలాంటి నిబంధనలేమీ పెట్టలేదని, అప్పుడు కూడా బిజెపి ప్రభుత్వమే కేంద్రంలో అధికారంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే ఏపికి రైల్వే జోన్ ప్రకటించే విషయంలో తాత్సారం చేస్తోందని మండిపడ్డారు.

బంద్‌కు సిద్ధం

- రగులుతున్న రాష్ట్ర ప్రజానీకం
- రాష్ట్రాన్ని ముంచేసిన బిజెపి, టిడిపి
- రేపటి బంద్‌కు అన్ని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల మద్దతు

విభజన హామీల అమలుతో పాటు, ప్రత్యేక హోదా విషయంలో బిజెపి, టిడిపి చేసిన వంచనపై ప్రజానీకం రగులుతోంది. రాజధాని నిర్మాణం నుండి పోలవరం ప్రాజెక్టు వరకు, ప్రత్యేక హోదా నుండి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు వరకు.. ఎన్నికల ముందు నరేంద్రమోడీ, చంద్రబాబు నాయుడు కలిసి కురిపించిన వరాల జల్లుకు తాజా బడ్జెట్‌లో మొండిచేయి చూపడంతో ప్రజానీకంలో తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే వామపక్షాలు గురువారం (8వ తేదీ) ఇచ్చిన బంద్ పిలుపునకు అనూహ్య స్పందన కనిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్షం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ కూడా బంద్‌కు మద్దతు తెలిపింది. జాతీయ కార్మిక సంఘాలు బంద్‌లో పాల్గొనాలని నిర్ణయించాయి. రవాణాను నిలిపివేస్తున్నట్లు లారీ ఓనర్ల సంఘం ప్రకటించింది. వివిధ ప్రజా సంఘాలు కూడా బంద్‌లో పాల్గొనాలని నిర్ణయించాయి. బిజెపి, తెలుగుదేశం పార్టీలు మినహా అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు భాగస్వామ్యం అవుతుండటంతో బంద్ భారీ స్థాయిలో విజయవంతం అవుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. నిఘా వర్గాలు కూడా ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ప్రజానీకం నుండి వస్తున్న అనూహ్యమైన స్పందనతో బిజెపి, టిడిపి ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయి. బంద్‌కు దూరంగా ఉంటున్న ఆ రెండు పార్టీలు నష్టనివారణ చర్యలపై దృష్టి సారించాయి. పార్లమెంటులో టిడిపి ఎంపిల ఆందోళన, ఆర్థిక, రైల్వేశాఖల మంత్రుల ప్రకటనలు, ప్రధాన మంత్రితో భేటీ, పార్టీ నేతలతో చంద్రబాబు మంతనాలు వంటివి ఈ చర్యల్లో భాగమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు చోటు చేసుకున్న ఈ వరుస పరిణామాల అనంతరం కూడా రాష్ట్రానికి న్యాయం చేసే విషయమై ఎటువంటి స్పష్టమైన ప్రకటనా రాకపోవడం గమనార్హం. మంత్రులతో పాటు, ప్రధాన మంత్రి కూడా ఈ దిశలో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికేమీ ప్రకటించలేదు. ఉత్తుత్తి హామీల పాత క్యాసెట్‌నే మళ్లీ వినిపించారు. కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుండీ ఆంధ్రప్రదేశ్‌పై మోడీ సర్కారుది ఇదే ఉదాసీనత.. ఇదే నిర్లక్ష్యం! దానికి తానా, తందానా అనడమే రాష్ట్రంలోని బాబు సర్కారు చేసిన నిర్వాకం! దీనికి నిరసనగానే రాష్ట్ర ప్రజల ఈ ధర్మాగ్రహం..!



సంపూర్ణమద్దతు

విభజన చట్టంలోని హామీలను కేంద్రం నేరవేర్చే వరకు ఎవరూ పోరాటం చేసిన వైసిపి మద్దతు ఇస్తుందని వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తెలిపారు.

-వైసిపి

8 తేది వరకు నిరసన

వామపక్షాల బంద్‌కు కాంగ్రెస్ మద్దతు తెలిపింది. ఎనిమిదో తేది వరకు ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి తెలిపారు.

-కాంగ్రెస్

ఆంధ్రులకు ద్రోహం

5 కోట్ల మంది ఆంధ్రులకు ద్రోహం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగాను, కార్మిక సంఘాలక నష్టం చేకూర్చేదిశగానూ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు బంద్‌లో పాల్గొని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు కనువిప్పు కలగాలి.

కార్మిక సంఘాలు

బంద్‌లోప్రత్యక్షంగా పాల్గొనండి

బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొనాలి. బంద్ రోజు రాష్ట్రంలో ఎగుమతులు, దిగుమతులు నిలిపి వేస్తున్నాం. కేంద్రప్రభుత్వం డీజిల్, పెట్రోల్‌పై తగ్గించిన రూ.8ల ఎక్సైజ్ డ్యూటీని ప్రజలకు వర్తింప చేయాలి.

లారీ ఓనర్స్ అసోసియేషన్, ఏపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ ఫెడరేషన్

జాతీయ విద్యా సంస్థలు ప్రకటనలకే పరిమితం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జాతీయ స్థాయి విద్యాసంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నిధుల లేకపోవడంతో వీటి నిర్మాణాలు ముందుకుసాగే పరిస్థితి కనపడటం లేదు. ఇచ్చిన అరకొర నిధులు వాటి ప్రహరీలకే సరిపోవడం లేదు. రాష్ట్రంలో 17 జాతీయ విద్యాసంస్థల ఏర్పాటుకు సుమారు రూ.11 వేల కోట్లు అవసరం కాగా, అందులో కనీసం పావు వంతు కూడా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు నిధులు కేటాయించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం మొత్తం ఈ విద్యాసంస్థలు ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం చేయూతనివ్వాల్సి ఉంది. కానీ, ఆ దిశలో చర్యలు శూన్యం.

బడ్జెట్ కేటాయింపులు

సంస్థ పేరు రాష్ట్రప్రభుత్వ	ప్రాజెక్టు అంచనా ఇచ్చిన నిధులు వాటాతో కలిపి (రూ.కోట్లలో	ఇప్పటి వరకు (రూ.కోట్లలో)
ఐఐటి తిరుపతి	3150	56.49
ఐఐఎస్ఈఆర్ తిరుపతి	1613	74
ఐఐఎం విశాఖపట్నం	691.58	45.31
ఎన్ఐటి తాడేపల్లి గూడెం	460.50	39
ఐఐఐటిడిఎం కర్నూలు	747.77 13	18.10
సెంట్రల్ యూని వర్సిటీ, అనంతపుర్	1100	--
గిరిజన యూనివర్సిటీ విజయనగరం	400	-
అగ్రికల్చర్ యూనివర్సిటీ గుంటూరు	1,504	135
ఎయిమ్స్ మంగళగిరి	1,618	--
జాతీయ విపత్తుల నిర్వహణ(గన్నవరం)	70.87	-
పెట్రోలియం విశాఖపట్నం	665	53.17
మొత్తం విలువ	**11672.95**	**421.07**

ఐదు కోట్ల ఆంధ్రులకు అన్యాయం

కె.యస్. లక్ష్మణరావు
శాసన మండలి మాజీ సభ్యులు



నాలుగు దశాబ్దాల క్రితం "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" అంటూ గర్జించిన ఆంధ్రులు మరోసారి అన్యాయాన్ని ఎదుర్కోవలసిన సమయం ఆసన్నమైంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా 2014 ఫిబ్రవరిలో ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా 5 ఏళ్ల పాటు ఇస్తామని ప్రకటించారు. 2014 మేలో ఏర్పడిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ హామీని గౌరవించలేదు, అమలు చేయలేదు. 2016 సెప్టెంబర్ 7న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. ఈ ప్యాకేజీ చట్టబద్ధత కల్పించటానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, దాని అమలుకు ఇప్పటి వరకు నిధులు కేటాయించలేదు.

2014 జూన్ 2 నుండి అమలులోకి వచ్చిన విభజన చట్టంలో 108 సెక్షన్లు, 13 షెడ్యూల్స్ పొందుపరచి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చారు. పార్లమెంట్ ఇచ్చిన ఈ చట్టానికి రాజ్యాంగబద్ధత, చట్టబద్ధత ఉన్నాయి. కానీ, గత నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టంలోని ప్రధాన అంశాల అమలులో ఆంధ్రులకు అన్యాయం చేస్తే, ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందినది. విభజన చట్టంలోని అంశాలు పరిశీలిస్తే...

13వ షెడ్యూల్ – పరిశ్రమల స్థాపన

విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో ఎపిలో అనేక పరిశ్రమల స్థాపన గురించి పేర్కొన్నారు. దుగరాజపట్నంలో భారీ నౌకాశ్రయాన్ని అభివృద్ధి చేసి 2018 కల్లా మొదటి దశ పూర్తి చేయాలి. కడపలో సమగ్ర ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలి. ఎపిలో గ్రీన్‌ఫీల్డ్ ముడి చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో రసాయన సముదాయాన్ని నెలకొల్పాలి. వైజాగ్– చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను, ఢిల్లీ–ముంబయ్ పారిశ్రామిక కారిడార్ తరహాలో ఏర్పాటు చేయాలి. విభజన జరిగిన నాటి నుండి 6 నెలలలోగా నూతన రైల్వేజోన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి. విశాఖపట్నం, విజయవాడలో మెట్రో రైలు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి.

పై అంశాలను పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం ఒక్క పరిశ్రమ విషయంలో కూడా నిర్దిష్టమైన చర్యలు తీసుకోకుండా ఎపికి పూర్తి అన్యాయం చేసినది. ఇటీవల బడ్జెట్‌లో బెంగళూరు మెట్రోకు 17 వేల కోట్లు కేటాయించిన ఆర్థికమంత్రి విశాఖ, విజయవాడ మెట్రోల గురించి ప్రస్తావన కూడా చేయలేదు. నాలుగేళ్లు గడిచినా రైల్వే జోన్, ఉక్కు కర్మాగారం, ఓడరేవులను పట్టించుకోకపోవడం ఆంధ్రులను వంచించటమే.

జాతీయ విద్యా సంస్థలు

విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో ఎపిలో 11 జాతీయ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినది. ఐఐటి, ఐఐఎం, ఎన్ఐటి, సెంట్రల్ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ, ఎయిమ్స్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, పెట్రోలియం యూనివర్సిటీ మొదలైన వాటిని ఏర్పాటు చేయాలి. ఈ జాతీయ విద్యా సంస్థలకు మొత్తం అంచనా వ్యయం రూ. 9,600 కోట్లు కాగా, కేంద్రం గత నాలుగేళ్లలో కేవలం రూ. 421.07 కోట్లే కేటాయించడం దారుణమైన విషయం. ఎయిమ్స్ మంగళగిరిలో, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి లాంలో శంకుస్థాపన చేసినప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలంటే కేంద్రం సెంట్రల్ యూనివర్సిటీ చట్టాన్ని సవరించాలి. విజయనగరంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలంటే ఇందిరాగాంధీ జాతీయ గిరిజన యునివర్సిటీ చట్టంలో మార్పుచేయాలి. కేంద్రం ఇప్పటివరకు ఈ సవరణల గురించి పట్టించుకోలేదు.

షెడ్యూల్స్ 9,10 – ఉమ్మడి సంస్థల విభజన

విభజన చట్టం 9,10 షెడ్యూల్స్‌లో రెండు రాష్ట్రాలకు చెందిన ఉమ్మడి సంస్థలను పొందుపరిచారు. వీటి ఆస్తులను ఉభయ రాష్ట్రాలు 58 : 42 నిష్పత్తిలో పంచుకోవాలి. 9వ షెడ్యూల్‌లో 90 సంస్థలు, 10వ షెడ్యూల్‌లో 107 సంస్థలను ఉంచారు. వీటి ఆస్తుల పంపిణీకి మాజీ ఐఎఎస్ అధికారిణి షీలా బిడే కమిటీని నియమించారు. ఈ కమిటీ చేసిన సిఫార్సులు ఇంతవరకు అమలు కాలేదు.

ఉదా : హైదరాబాద్‌లోని ఆర్టీసి ఆస్తులను ఉభయ రాష్ట్రాలు 58 : 42 నిష్పత్తిలో పంచుకోవాలి. ఇప్పటికీ అనేకసార్లు అధికారుల స్థాయిలో చర్చ జరిగినప్పటికీ పంపిణీ తేలలేదు. ఉన్నత విద్యామండలి ఆస్తులు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ పంపిణీ జరగలేదు. వీటి గురించి కేంద్ర ప్రభుత్వం గానీ, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి అయిన గవర్నర్ గానీ నిర్దిష్ట విధానాలు రూపొందించి అమలు చేయలేదు.

సెక్షన్ 46(3) – వెనుకబడిన జిల్లాల అభివృద్ధి

విభజన చట్టంలో సెక్షన్ 46 (3) ప్రకారం రాయలసీమ, ఉత్తర కోస్తా జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీతో పాటు, తగిన ప్రోత్సాహకాలు కల్పించాలి. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు, ఉత్తరకోస్తా జిల్లాలైనా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పారిశ్రామికాభివృద్ధిలో, తలసరి ఆదాయంలో, మానవాభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు అన్ని అభివృద్ధి సూచికలలో 12,13 స్థానాలలో ఉన్నాయి. వీటి అభివృద్ధికి కేంద్రం విదర్భ, బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి 25 వేల కోట్ల వరకు ఇవ్వవచ్చని ఆశిస్తే, కేంద్రం ఇప్పటి వరకు 7 జిల్లాలకు కేవలం 1050 కోట్లు మాత్రమే ఇచ్చినది. 2018–19 బడ్జెట్‌లో ఆ కేటాయింపులు కూడా లేకపోవడం దారుణమైన విషయం.

సెక్షన్ 94(3) – రాజధాని నిర్మాణానికి సహాయం

విభజన చట్టంలో సెక్షన్ 94 (3) ప్రకారం శాసనసభ, శాసన మండలి, రాజ్ భవన్, హైకోర్టు సచివాలయం మొదలైనవాటితో పాటు, ఇతర మౌలిక సదుపాయాలతో నిర్మించే ఎపి నూతన రాజధానికి అవసరమైన ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందించాలి. 2015 అక్టోబర్ 22న ప్రధానమంత్రి రాజధానికి శంకుస్థాపన చేసినప్పటికి ఇప్పటివరకు కేవలం వెలగపూడిలో తాత్కాలిక సచివాలయ నిర్మాణం మాత్రమే జరిగినది.

పాలనా రాజధాని నిర్మాణానికి సుమారు రూ.60 వేల కోట్లు అంచనా వేస్తే, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం రూ. 2,500 కోట్లు ఇచ్చింది. దీనిలో రూ. 1000 కోట్లు గుంటూరు, విజయవాడ భూగర్భ డ్రైనేజీ కోసం ఇచ్చారు. రాజధాని నిర్మాణంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వ వైఖరి సక్రమంగా లేదు. రాజధాని నిర్మాణానికి 29 గ్రామాలలో 33 వేల ఎకరాలు భూసమీకరణ చేసి భూములను ప్రైవేటు సంస్థలకు కేటాయించడం దారుణం. విట్, అమృత, ఎస్ఆర్ఎం. తదితర ప్రైవేటు విద్యాలయాలకు వందల ఎకరాలు కేటాయిస్తున్న ప్రభుత్వం, ప్రభుత్వ రంగాలలో ఒక విద్యాలయాన్ని కూడా ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. (ఈ 29 గ్రామాలలో ప్రభుత్వ రంగాలలో కేవలం ప్రభుత్వ .జూనియర్ కాలేజీ) మాత్రమే ఉన్నది. రాజధాని అభివృద్ధి పేరుతో సింగపూర్ కన్సార్టియందంతో స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో కుదుర్చుకున్న ఒప్పందం సరైనది కాదు. రాజధాని నిర్మాణానికి విదేశీ కంపెనీలతో సంప్రదింపులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు కేంద్ర ప్రభుత్వంపై సరైన ఒత్తిడి తేలేదు. రూ. 2 లక్షల కోట్లకు సరైన డిపిఆర్‌లు గానీ, యుసిలు గాని పంపడం లేదని కేంద్రం ఆరోపిస్తున్నది. డిపిఆర్‌లు పంపామని మంత్రి నారాయణ చెపుతున్నారు. రాజధాని నిర్మాణంపై పూర్తి వివరాలతో ఒక'శ్వేత పత్రాన్ని" విడుదల చేయవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నది.

సెక్షన్ 90–పోలవరం ప్రాజెక్టు నిర్మాణం

విభజన చట్టంలో సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్యాకేజీగా ప్రకటించి ప్రాజెక్టు అభివృద్ధి నియంత్రణ కేంద్రం తన పరిధిలోకి తీసుకున్నట్లు ప్రకటించారు. అన్ని రకాల పర్యావరణ, అటవీ, పునరావాస, పునర్నిర్మాణ అనుమతులు పొంది కేంద్ర ప్రభుత్వమే ఈ ప్రాజెక్టులను పూర్తి చేయాలి. కారణాలేమైనప్పటికీ, పోలవరం నిర్మాణ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినది. తుది అంచనాల ప్రకారం పునరావాసం సహా ప్రాజెక్టుకు రూ.58 వేల కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదించారు. కానీ 2018–19 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పోలవరం ప్రస్తావనే చేయకపోవడం దారుణం. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటివరకు కేంద్రం నుండి రూ. 970 కోట్లు మాత్రమే వచ్చాయి. స్పిల్‌వే, డయాఫ్రం వాల్, ఎర్తకం రాక్‌ఫిల్ డ్యామ్‌కు సంబంధించి ఇప్పటి వరకు చేసిన పనులకు రూ. 3,217 కోట్లు రావలసి ఉన్నది. నిధులు విడుదల చేయటంలేదు. దీనితో 2019 కల్లా ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆశకు ఈ బడ్జెట్ ఆందోళన కలిగించే అంశంగా మారినది. పోలవరం ప్రాజెక్టుకు నిధుల సమీకరణ రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ప్రశ్నగా మారినది.

రెవెన్యూ లోటు ప్రస్తావన లేదు

రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడే రెవెన్యూ లోటును బడ్జెట్ కేటాయింపులు ద్వారా భర్తీ చేస్తామని 2014 ఫిబ్రవరి 20న ఆనాటి ప్రధాని మన్‌మోహన్ సింగ్ రాజ్యసభలో హామీ ఇచ్చారు. 2014–15 సంవత్సరానికి రెవెన్యూ లోటును రూ.16,078 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ తేల్చారు. ఇంత వరకు కేంద్రం 3,970 కోట్లు మాత్రమే ఇచ్చినది. గత నాలుగేళుగా రెవెన్యూ లోటుకు సంబంధించి మిగిలిన నిధులను విడుదల చేయలేదు. పై అంశాలతో పాటు ఇంకా అనేక విభజన చట్ట హామీలు అమలుకు నోచుకోకుండా ఉన్నాయి.

విభజన చట్టం కేంద్ర బాధ్యత

పార్లమెంట్ చేసిన విభజన చట్ట హామీలను అమలు చేయవలసిన బాధ్యత కేంద్రంపై ఉన్నది. కానీ 2014 ఎన్నికలలో పూర్తి మెజారిటీ పొందడంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రాల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. ఢిల్లీలో 'ఆప్' ప్రభుత్వాన్ని ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. బీహార్ ఎన్నికలలో బీహార్‌కు ప్రత్యేక ప్యాకేజీ అడగకుండానే ప్రకటించి ఇంత వరకు ఆ ప్యాకేజీ ఊసే ఎత్తటం లేదు. కర్నాటకలో రాబోయే ఎన్నికల దృష్ట్యా బడ్జెట్‌లో బెంగళూరు మెట్రోకు రూ.17 వేల కోట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ లో బిజెపికి రాజకీయ ప్రయోజనాలు లేకపోవడంతో విభజన చట్ట హామీలు అమలులో పూర్తి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు.

రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవడంతో విఫలమైనది. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలను రాష్ట్రప్రభుత్వం విశ్వాసంలోకి తీసుకోలేదు. రాష్ట్ర విభజన చట్ట అంశాలపై ఇంత వరకు ఒక సారికూడా అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రులకు జరుగుతున్న అన్యాయంపై వివిధ సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, పౌర సమాజం గళమెత్తాలి, నిరసన తెలపాలి.

ముందుకు సాగని రాజధాని



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి అనుమానాలకు తావిస్తోంది. రాజధాని నిర్మాణం చేపట్టాలంటే కనీసం రూ.42 వేల కోట్లు అవసరమవుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 2016, 2017లో రెండుసార్లు ఆ మేరకు నిధులు కేటాయించాలని ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి లేఖ రాశారు. అయినా ఇంతవరకు కేంద్రం నుండి రాజధానికి వచ్చింది రూ.2500 కోట్లే. కేంద్ర మంత్రులు మాట్లాడుతూ డిపిఆర్ రానందువల్లే రాజధానికి నిధులు విడుదల కావడం లేదని చెబుతున్నారు. రాష్ట్ర మంత్రి నారాయణ మాత్రం తాము డిపిఆర్ సమర్పించామంటున్నారు. . ఏడాదిన్నర నుండి చర్చలు, విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారు మినహా ఒక్క రూపాయి విడుదల కాలేదు. రాజధాని పేరుతో 2015 నుండి ఇప్పటి వరకూ వేర్వేరు చోట్ల నాలుగుసార్లు శంకుస్థాపనలు చేశారు. తొలుత తాళ్లాయపాలెంలోనూ, అనంతరం ఉద్దండ్రాయునిపాలెం, మూడోసారి లింగాయపాలెం, అనంతరం తాత్కాలిక సచివాలయం పేరులో వెలగపూడిలోనూ నాలుగుసార్లు భారీ ఎత్తున శంకుస్థాపనలు చేశారు. కానీ రాజధానికి రూపు తీసుకురాలేకపోయారు. పైగా రాజధాని ప్రమోషన్ పేరుతో ప్రపంచ దేశాల్లో ప్రచారానికి గానీ, పెట్టుబడులు, కన్సల్టెన్సీల పేరుతోగానీ, విదేశీ పర్యటనలకుగానీ, తాత్కాలిక కార్యాలయాలకుగానీ సుమారు రూ.1800 కోట్ల వరకూ ఖర్చు పెట్టారు.

2021 వరకూ కావాల్సిన నిధులు (కోట్లలో)	
రోడ్లకు	2,977
మంచినీరు, మురుగునీటి పారుదలకు	1,166
హైటెన్షన్ లైన్లు మార్చేందుకు	500
వీటితోపాటు పవర్‌కేబుల్	
వేసే నిర్మాణాలకు	950
సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ల	166
గ్రీన్ వర్క్సు	250
వరద నిర్వహణ	1,209
గ్రామాల్లో సదుపాయాల వృద్ధి	860
పూలింగు ప్లాట్లలో సదుపాయాలు	14,080
స్టార్టప్ ఏరియా సదుపాయాలు	313
స్టార్టప్ ఏరియా రెండోదశకు సదుపాయాలు	500
ప్రభుత్వ కార్యాలయాలు	6705
మొత్తం	**29,676**

మూడేళ్లకు రూ.29 వేల కోట్లు అవసరం

రాజధాని నిర్మాణానికి రూ.58 వేల కోట్లు అవసరమని సిఆర్‌డిఏ పేర్కొంది. దీనిలో రూ.14,200 కోట్లు ఇచ్చేందుకు హడ్కో, ప్రపంచ బ్యాంకు, ఇతర వాణిజ్య బ్యాంకులు ముందుకు వచ్చాయి. మూడేళ్లలో సదుపాయాల కల్పనకు రూ. 29,676 కోట్లు అవసరమవుతాయనీ నివేదించారు. ఈ నిధులను స్వల్పకాలిక, దీర్ఘకాలిక పద్ధతుల్లో వివిధ బ్యాంకుల నుండి తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎడిబి), ఎఐఐబి ద్వారా నిధుల సేకరణపై చర్చలు సాగిస్తున్నారు.

.శంకుస్థాపన హామీలు ఒక్కటీ నెరవేరలేదు

రాజధాని శంకుస్థాపన సమయంలో రాజధాని ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని, అన్ని గ్రామాలనూ స్మార్ట్ విలేజ్‌గా మార్చి కనీస సదుపాయాలు కల్పిస్తామని, విద్యా, వైద్యం ఉచితంగా అందిస్తామని, ఎన్‌టిఆర్ క్యాంటీన్లు ఏర్పాటు చేసి అతి తక్కువ ధరకు భోజన సదుపాయం కల్పిస్తామనీ చెప్పారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదు.

ఈ ఏడాదికి .16,886 కోట్లు


20 ఏళ్లకు అమరావతిని ప్రపంచస్థాయిగా మార్చేందుకు సుమారు రూ.43,772 కోట్లు అవసరమవుతాయని సిఆర్‌డిఏ ఆర్థిక సలహా కమిటీ అంచనా వేసింది. అమరావతి ఫైనాన్షియల్ స్ట్రాటజీ కన్సల్టెన్సీ కూడా దీన్నే ఖరారు చేసింది. దీనిలో 2018 నాటికి రూ.16,886 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ప్రపంచబ్యాంకు, హడ్కో రుణమిస్తే 2018 వరకూ కేంద్రం ఇవ్వకపోయినా అప్పుతోనే చాలావరకూ పనులు పూర్తి చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించుకుంది. కేంద్రం నుండి కొంత నిధులొస్తే వాటినీ కలుపుకొని అనుకున్న పనులు పూర్తి చేస్తుంది. వీటితోపాటు అదనపు నిధుల కోసం ఎల్ఐసి పిఎఫ్ నుండి రుణాలు తీసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.

రోడ్లకు తొలి ప్రాధాన్యత

అప్పుల రూపంలో తీసుకునే నిధులను విభాగాల వారీగా వెచ్చించేందుకు రోడ్లు, సదుపాయాలు, గ్రీనరీ, ప్రభుత్వ భవనాలు, హౌసింగ్, సామాజిక, సమీకరణ భూముల్లో సదుపాయాలుగా విభజించి వెచ్చించనున్నారు. దీనికోసం 2036 వరకూ ప్లాను రూపొందించింది. ఈ అంకెలు ఘనంగా కనిపిస్తున్నప్పటికీ నిధులు రావడం సందేహమే!

ఔదార్యం చూపమన్నా ...

స్పందించని మోడీ



అమరావతి : రాష్ట్ర విభజనతో పీకల్లోతు నష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవడానికి మరిం ఔదార్యం చూపాలని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కోరినా ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పందించలేదు. 2016 మార్చిలో ఈ మేరకు చంద్రబాబు ప్రధానికి లేఖ రాశారు. రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలను అమలు చేయాలని కోరిన ఈ లేఖలో ప్రత్యేకహోదా విషయాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అయితే, రాష్ట్రానికి హోదా ఇచ్చి తీరాలని మాత్రం ఆయన స్పష్టంగా కోరలేదు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదేళ్లపాటు ప్రత్యేక ప్రతిపత్తి హోదా ఇస్తాం. ఇది రాష్ట్ర ఆర్థికరంగాన్ని పటిష్టం చేయడానికి దోహదపడుతుంది' అని పార్లమెంట్‌లో ప్రధాని హామీ ఇచ్చారని లేఖలో పేర్కొన్న ఆయన 14వ ఆర్థికసంఘం ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు, ఇతర రాష్ట్రాలకు మధ్య డెవల్యూషన్ విషయంలో ఎటువంటి తేడా చూపలేదని ప్రధాని దృష్టికి తీసుకువచ్చారు. అయితే, రాష్ట్రం ఆర్థిక కష్టాలు ఎదుర్కుంటున్న నేపథ్యంలో కేంద్రం చేపట్టిన 25 పథకాలను నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని సాంఘిక అభివృద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆ ఏడాది బడ్జెట్ ముందు బాబు రాసిన ఈ లేఖకు స్పందన కనిపించలేదు. తాజా బడ్జెట్ సమావేశాల ముందుకూడా చంద్రబాబు ప్రధానిని కలిసిన విషయం తెలిసిందే. ఆ తరువాత టిడిపి ఎంపీలు కలిసి వినతిపత్రం సమర్పించారు.ఆ వినతిపత్రంలో కూడా దాదాపుగా ఇవే అంశాలున్నాయి. వీటికి కూడా కేంద్ర ప్రభుత్వం మొండిచేయ్యే చూపింది.